లఘుగ్రంథాలు

# ప్రపంచ తెలుగు మహాసభలు

27-29, డిసెంబర్ 2012, తిరుపతి

# తెలుగు సినిమా చరిత్ర

రచన

ఎస్.వి. రామారావు


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి

పొట్టి శ్రీరాములు

తెలుగు విశ్వవిద్యాలయం

Blank Page

లఘు గ్రంథాలు

# తెలుగు సినిమా చరిత్ర

## ఎస్.వి.రామారావు

ప్రపంచ తెలుగు మహాసభలు

27-29 డిసెంబర్, 2012, తిరుపతి

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం
హైదరాబాద్

**తెలుగు సినిమా చరిత్ర**

**రచయిత** : **ఎస్.వి.రామారావు**

**ISBN** : **81-86073-340-1**

© **పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం**

ప్రచురణల సంఖ్య : 479

వెల : **రూ. 20/-**

ప్రతుల సంఖ్య : **5000**

ముద్రణ : **డిసెంబరు, 2012**

ప్రతులకు : **సంచాలకులు**
ప్రచురణల విభాగం,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ - 500 004.

---

ముద్రణ : **కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్,** విద్యానగర్, హైదరాబాద్.

యన్. కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాదు

ముఖ్యమంత్రి
ఆంధ్రప్రదేశ్



# నాంది

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక్క వేదిక పైకి తీసుకు వచ్చేందుకు, తెలుగు ప్రభలను దశదిశలా వ్యాపింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2012 డిసెంబర్ 27 నుండి 29 వరకు ఏడుకొండలవాడి ఆవాసమైన తిరుపతి పుణ్య క్షేత్రంలో అత్యున్నత స్థాయిలో తెలుగు మహాసభలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఉన్న తెలుగు వారందరూ పరస్పరం భావ వినిమయం చేసుకోవడానికీ, తెలుగువారు తమ గత చరిత్రను సంస్మరించుకుంటూ, ఉత్కృష్టమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికో ఈ మహా సభలు ఎంతగానో దోహదం చేస్తాయని మేము విశ్వసిస్తున్నాం.

తొలి ప్రపంచ తెలుగు మహాసభలు జరిగి 37 సంవత్సరాలు గడిచాయి. అయితే ఇంతవరకూ ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ మహాసభలను నిర్వహించడానికి చొరవ చూపలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ప్రజాజీవితాన్ని ఎలా మెరుగుపరచాలీ, తెలుగు వారి వైభవాన్ని ఎలా పరిరక్షించాలీ అనే దృష్టితో పనులు చేపడుతోంది. తెలుగువారి నిర్వహణ సామర్థ్యాన్ని ఇటీవల జరిగిన జీవ వైవిధ్య సదస్సులో కూడ ప్రభుత్వం నిరూపించింది. ఈ నేపథ్యంలోనే ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడానికి సమాయత్తమైంది.

ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలు సంభవించాయి. వీటి నేపథ్యంలో బహుభాషా దేశమైన మన భారత దేశంలో తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన విషయాల్లో జరిగిన కృషి గురించి, జరగవలసిన కృషి గురించి మనం చర్చించవలసింది ఎంతో ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మన తెలుగు భాష ఉనికిని కోల్పోకుండా పరిరక్షించేందుకు, తెలుగు ఔన్నత్యాన్ని నలుదిశలా చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. నిత్యం ప్రజల హితం కోరి, ప్రజల అభీష్టాలను నెరవేర్చేందుకు, తెలుగు జాతి దేశ విదేశాల్లో తలెత్తుకు తిరిగేలా చేసేందుకు అవిరళ కృషి చేస్తున్న మా ప్రభుత్వం, తెలుగు తేజం కాంతులు వెదజల్లేలా ఈ మహోజ్వలమైన సభల నిర్వహణకు పూనుకొంది. ఈ సభలలో సదస్సులు, తెలుగు వారి కళా ప్రదర్శనలు, చేతివృత్తుల ప్రదర్శనలు, లలితా కళా వైభవాన్ని చాటే కార్యక్రమాలు, రాష్ట్రేతర, విదేశాంధ్రుల సమావేశాలు, మొదలైన ఎన్నో అంశాలతో పాటు పుస్తక ప్రచురణ కూడ పెద్ద ఎత్తున చేపడుతున్నాం. అందులో భాగంగానే ఈ లఘుగ్రంథాల ప్రచురణ జరుగుతుంది.

ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మహాసభల సందర్భంగా ప్రచురించే లఘు గ్రంథాలు పాఠకుల ఆదరణ పొందగలవని ఆశిస్తున్నాం.

కిరణ్ రెడ్డి

**(ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి)**

ముఖ్యమంత్రి

**V. VASANT KUMAR**, B.Sc.,(Ag.),M.B.A.
Minister for Tourism & Culture, Archeology & Museums,
Archives & Youth Services & Sports, N.C.C.
Government of Andhra Pradesh

सत्यमेव जयते

Room No. 501, 5th Floor,
J-Block, A.P. Secretariat,
Hyderabad-500 022.
Phone : 040-23454168, 23450541
Fax : 040-23450899



# ప్రస్తావన

తెలుగువారు తెలుగు నేలపై 37 ఏళ్ళ విరామం తర్వాత చేసుకుంటున్న పండుగ ప్రపంచ తెలుగు మహాసభలు. మన సంస్కృతిని నలుదిశలా వ్యాపింప జేస్తున్న తెలుగు వారందరూ ఒక్కచోట చేరి, తెలుగు దనాన్ని పంచు కునేందుకు, తెలుగు పరిమళాలు వెదజల్లేందుకు ఉద్దేశించిన సన్నివేశం ప్రపంచ తెలుగు మహాసభలు. తెలుగు వారి సంస్కృతి బహుముఖీనమైంది. అందులో భాష, సాహిత్యం, చరిత్ర, లలితకళలు, జానపద, గిరిజన విజ్ఞానం వంటి ఎన్నో అంశాలున్నాయి. వీటన్నిటి గురించి విశ్లేషించుకుని, వాటిని పరిరక్షించడం, పోషించడం, పరివ్యాప్తి చేయడం ప్రభుత్వం తన విధ్యుక్త ధర్మంగా భావిస్తున్నది.

ఈ బృహత్తరమైన బాధ్యతని నెరవేర్చే సంకల్పంలో భాగంగానే "ప్రపంచ తెలుగు మహాసభల" నిర్వహణకు ప్రభుత్వం నడుము కట్టింది. అతి తక్కువ వ్యవధిలో అత్యంత సమున్నత స్థాయిలో తలపెట్టిన ఈ మహాసభలకు దేశ విదేశాల నుంచి తెలుగువారు స్వాగతం పలుకుతున్నారు. అత్యధిక సంఖ్యలో ఈ సభల్లో పాల్గొంటున్నారు.

తెలుగు వారందరూ ఒక్కచోట సమకూడి, తమ గురించి చర్చించుకుని, భవిష్యత్తుకు బాటలు వేసుకునే క్రమంలో మన గురించి మనం మరోసారి తెలుసుకునేందుకు, వివిధ రంగాల్లో మనం సాధించిన దాన్ని పునశ్చరణ చేసేందుకు ఈ సభల సందర్భంగా సదస్సులు, లఘుగ్రంథాల ప్రచురణ, ప్రత్యేక సంచికల ముద్రణ,

వివిధ అంశాల్లో ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

తెలుగువారిది ఘనమైన చరిత్ర, అత్యున్నత సంస్కృతి. అయితే కాలంతో పాటు అభివృద్ధి పథంలో నడుస్తున్న తెలుగువారు ఎప్పటి కప్పుడు తమ సంస్కృతిలోకి కొత్త నీరును ఆహ్వానించడం సహజం. ఈ "పాతకొత్తల మేలు కలయికే" ఒక జాతిని నిత్యచైతన్యంతో నింపుతుంది. ఈ విధంగా కొత్త దనాన్ని ఆహ్వానిస్తూనే, మన గతవైభవాన్ని విస్మరించకుండా కాపాడుకోవలసిన బాధ్యత మన మీద ఉంది. ఇవన్నీ ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో చర్చకు రానున్నాయి. అందరం కలిసి, తెలుగుదనాన్ని పరిరక్షంచుకునే ప్రయత్నం చేయవలసిన తరుణం ఆసన్నమైంది.

వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని తెలుగువారి భాష, సాహిత్యం, సంస్కృతి, పౌరజీవనం తదితర అంశాలపై లఘుగ్రంథాలను నిష్ణాతుల చేత రచింపజేసి ప్రచురించే గురుతర బాధ్యతను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, తెలుగు అకాడమీ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్వర్తిస్తున్నాయి. తెలుగు ప్రజలు కలకాలం ఉపయోగించుకునే విధంగా ఈ పుస్తక ప్రచురణ జరుగుతోంది. వీటిని పాఠకులు, తెలుగు భాషాభిమానులు, పండితులు ఆదరిస్తారని విశ్వ సిస్తున్నాను.

వ. వసంతకుమార్

**(వట్టి వసంతకుమార్)**

# పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
**POTTI SREERAMULU TELUGU UNIVERSITY**

**ఆచార్య ఎల్లూరి శివారెడ్డి**
ఉపాధ్యక్షులు

లలిత కళాక్షేత్రం,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్-500 004.


# నివేదన

ఇన్నేళ్ళ తరువాత ప్రపంచ తెలుగు మహాసభలు జరగడం తెలుగు భాషా సాహిత్యాభిమానులకు, సంస్కృత ప్రియులకు, వివిధ రంగాలలో నిష్ణాతులైన మేధావులకు ఆనంద ప్రదమైన అంశం. 1975లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల ఉత్తేజం తోనే 1985లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఆవిర్భవించింది. తెలుగు విశ్వ విద్యాలయం ఈ రాష్ట్రంలోను, భారత దేశంలోను, విదేశాలలోను ఎన్నో సభలు, సమావేశాలు నిర్వహించింది. భాషా సాహిత్య సంస్కృతుల్ని దృష్టిలో ఉంచుకొని అనేక గ్రంథాలను వెలువరించింది. తెలుగు విశ్వ విద్యాలయం అప్పటి సాహిత్య అకాడమీ నిర్వహించిన పాత్రను చాలా వరకు బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నది. విస్తరణ సేవా విభాగాన్ని అకాడమీల విభాగంగా మార్చి దానికి సంబంధించిన కార్యక్రమాలను చేపడుతున్నది. నిధుల కొరత వల్ల కొన్ని కార్యక్రమాలను అనుకున్న స్థాయిలో చేయలేకపోతున్నాం.

ఈ నాలుగవ ప్రపంచ మహాసభల సందర్భంగా తెలుగు విశ్వ విద్యాలయం తన వంతు బాధ్యతను స్వీకరించింది. భారత దేశంలో పదిచోట్ల సన్నాహక సభలు ఇప్పటికే అధిక భాగం నిర్వహించింది. 1975లో మహాసభల సందర్భంగా ప్రచురించిన 30 లఘు గ్రంథాల్ని పునర్ముద్రిస్తున్నది. మరొక 50 గ్రంథాలను ప్రత్యేకమైన అంశాలమీద రాయించి ఈ మహాసభల సందర్భంగా విడుదల చేస్తున్నది. ఆయా రంగాలలో నిష్ణాతులైన వారిచేత ప్రామాణిక గ్రంథాలను రాయించాలన్నది మా విశ్వ విద్యాలయం ఆశయం. నిజంగా ఇంత స్వల్ప సమయంలో గ్రంథ రచన చేసి సహకరించిన రచయితలకు మా ధన్యవాదాలు. ఈ గ్రంథాల ప్రచురణకు ఆర్థిక సహకారం అందించిన ప్రభుత్వానికి ప్రత్యేకంగా ముఖ్యమంత్రి గౌరవనీయులు మాన్యశ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి గారికి, సాంస్కృతిక శాఖామాత్యులు, మాన్యశ్రీ వట్టి వసంతకుమార్ గారికి, సంబంధిత ప్రభుత్వాధికారులకు మా విశ్వవిద్యాలయం పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పరంపరలో "తెలుగు సినిమా చరిత్ర" అనే అంశం మీద చిరుపొత్తాన్ని సకాలంలో వ్రాసి యిచ్చిన ఎస్.వి.రామారావు గారికి ధన్యవాదాలు. గ్రంథముద్రణ కార్యక్రమంలో చేదోడు వాదోడుగా ఉన్న విశ్వవిద్యాలయ రిజిస్టర్ ఆచార్య కె.ఆశీర్వాదం గారికి, ఆచార్య సి.మృణాళినిగారికి మరియు ఆచార్య డి. మునిరత్నం నాయకుడు గారికి అభినందనలు.

(ఎల్లూరి శివారెడ్డి)

# విషయసూచిక


| | | | పేజి నెం. |
|---|---|---|---|
| 1. | మూకీలు – టాకీలు – బాల్యదశ ముచ్చట్లు | ... | 10 |
| 2. | పౌరాణిక చిత్రాలు | ... | 12 |
| 3. | చారిత్రిక చిత్రాలు | ... | 18 |
| 4. | జానపద చిత్రాలు | ... | 24 |
| 5. | సాంఘిక చిత్రాలు | ... | 30 |
| 6. | సామాజిక, సందేశాత్మక, కుటుంబ కథా చిత్రాలు | ... | 31 |
| 7. | కళాత్మక చిత్రాలు | ... | 36 |
| 8. | మహిళా చిత్రాలు | ... | 38 |
| 9. | బాలల చిత్రాలు | ... | 42 |
| 10. | నవలా, నాటక చిత్రాలు | ... | 45 |
| 11. | హాస్య చిత్రాలు | ... | 47 |
| 12. | విప్లవాత్మక, చైతన్య చిత్రాలు | ... | 53 |
| 13. | జేమ్స్‌బాండ్, కౌబాయ్, ఫ్యాక్షన్ తరహా చిత్రాలు | ... | 55 |
| 14. | అనువాద చిత్రాలు | ... | 57 |
| 15. | సాంకేతిక రంగం | ... | 59 |
| 16. | రచయితలు | ... | 67 |
| 17. | సంగీతం | ... | 74 |
| 18. | నృత్యం | ... | 81 |
| 19. | కళ | ... | 84 |
| 20. | రూపశిల్పం (మేకప్) | ... | 88 |
| 21. | ఛాయాగ్రహణం (ఫొటోగ్రఫి) | ... | 89 |
| 22. | పోరాటాలు, అద్భుతాలు (స్టంట్స్ అండ్ థ్రిల్స్) | ... | 93 |
| 23. | కూర్పు (ఎడిటింగ్) | ... | 95 |
| 24. | సినిమా జర్నలిజం – పత్రికలు | ... | 98 |
| 25. | ఈ పుష్కర (2001–2012) చరిత్ర | ... | 100 |
| 26 | సినీ పరిశ్రమలోని వివిధ సంఘాలు | ... | 104 |
| 27. | ఎవార్డులు – పురస్కారాలు | ... | 106 |
| 28. | తెలుగు సినీ చరిత్రలో మైలురాళ్లుగా చెప్పుకోతగ్గ అంశాలు | ... | 108 |
| 29. | రచయిత పరిచయం | ... | 109 |

# కృతజ్ఞతాపూర్వకంగా

తెలుగు సినిమా జర్నలిస్టుగా 'సితార, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, ఆంధ్రప్రదేశ్' వంటి పలు పత్రికలకు వందలాది వ్యాసాలను, సినిమా చరిత్రకారునిగా తెలుగుసినిమా రంగానికి చెందిన వివిధ అంశాలను విశ్లేషిస్తూ ఓ డజను పుస్తకాలు వ్రాశాను. పలు టీవీ కార్యక్రమాలు నిర్వహించాను.

నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు సందర్భంగా 'తెలుగు సినిమా చరిత్ర' పేరిట వందపేజీల్లో ఓ మోనోగ్రాఫ్ (గ్రంథం) వ్రాయమని అధికారులు నన్ను ఆదేశించారు. ఆ బాధ్యతను హృదయపూర్వకంగా ఆనందంగా స్వీకరించాను.

82 ఏళ్ల సినిమా చరిత్ర మనది. వేలాది చిత్రాలు, వందలాదిమంది నటీనటులు, వేలాదిమంది దర్శకులు, ఛాయాగ్రాహకులు, సంగీతదర్శకులు, రచయితలు వంటి సాంకేతిక నిపుణులు; వీరందరి గురించి విపులంగా, వివరంగా సమాచారాన్ని అందించాలంటే ఎన్నో వేల పేజీల బృహత్‌గ్రంథం రూపొందించాలి.

అయితే చిత్రాల వర్గీకరణను (పౌరాణిక, చారిత్రిక, జానపద, సాంఘిక), వాటి రూపురేఖల్ని, సాంకేతికనిపుణుల వివరాలను రేఖామాత్రంగా పరిచయం చేస్తూ - సినిమా గురించి ప్రాథమిక పరిజ్ఞానం అందించే దిశగా ఈ గ్రంథ రచన చేశాను. తెలుగు సినిమా పరిశ్రమ గురించి ఒక సూక్ష్మ బోధినిలా దీనిని రూపొందించాను. తక్కువ పుటలలో ఎక్కువ సమాచారాన్ని అందించడానికి ప్రయత్నించాను.

ఈ సువర్ణ అవకాశం నాకు అందించిన వారికి, ముఖ్యంగా మాన్య మంత్రివర్యులు శ్రీ వట్టి వసంతకుమార్‌గారికి, శ్రీమతి డి.కె.అరుణగారికి, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు డా॥ రాళ్ళబండి కవితాప్రసాద్‌గారికి, సలహాదారు కె.వి.రమణగారికి, అధ్యక్షులు ఆర్.వి.రమణమూర్తిగారికి, శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు డా॥ ఎల్లూరి శివారెడ్డిగారికి, తదితర పెద్దలకు నా మనఃపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

- ఎస్.వి.రామారావు

## మూకీలు - టాకీలు - బాల్యదశ ముచ్చట్లు

**నాందీ, ప్రస్థావన :**

భారత దేశంలో మహారాష్ట్రకు చెందిన దుండిరాజ్ గోవిందఫాల్కే (దాదాఫాల్కే) తొలిసారిగా 'రాజా హరిశ్చంద్ర' మూకీ చిత్రాన్ని నిర్మించి, 03.05.1913న విడుదల చేశారు. సంభాషణలు, సంగీతం ఉండవు కాబట్టి, దానిని మూకీ చిత్రం అన్నారు. భారత ప్రభుత్వం మూకీ చిత్ర పితామహునిగా దాదాఫాల్కేని గుర్తించి, వారి పేరిట సినీరంగానికి అత్యుత్తమ సేవలందించిన ప్రముఖులకు దాదాఫాల్కే ఎవార్డును అందించి, సత్కరిస్తున్నది.

ఆంధ్రదేశంలో మచిలీపట్నానికి చెందిన రఘుపతి వెంకయ్య తన కుమారుడైన ఆర్.ఎస్.ప్రకాశ్‌ను సినిమా టెక్నిక్ తెలుసుకోవడం కోసం విదేశాలకు పంపించారు. సాంకేతిక పరిజ్ఞానంతో తిరిగి స్వదేశానికి వచ్చిన ప్రకాశ్ దర్శకత్వంలో రఘుపతి వెంకయ్య 'భీష్మ ప్రతిజ్ఞ' అనే మూకీ చిత్రాన్ని రూపొందించి, 1921లో విడుదల చేశారు. వారిని సంస్మరించుకుంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు సినీరంగానికి అత్యుత్తమ సేవలందించిన వారిని గుర్తించి ప్రతి ఏటా 'రఘుపతి వెంకయ్య' ఎవార్డుతో సత్కరిస్తుంది.

"భీష్మ ప్రతిజ్ఞ"లో దర్శకుడైన ప్రకాశ్ భీష్మ పాత్ర పోషించారు. ఆ తరువాత ప్రకాశ్ మత్స్యావతార్, నందనార్, గజేంద్ర మోక్షం వంటి మూకీలను నిర్మించారు. ఆయన వద్ద దర్శకత్వంలో సహాయకులుగా పనిచేసిన వారిలో ముఖ్యులు యరగుడిపాటి వరదా (వై.వి.రావు) రావు, చిత్తజల్లు (సి) పుల్లయ్య, వై.వి.రావు గజేంద్రమోక్షంలో నటించారు. సి.పుల్లయ్య బొంబాయి వెళ్ళి తిరిగి వచ్చి కాకినాడలో 'భక్త మార్కండేయ' మూకీ చిత్రాన్ని ప్రారంభించి 1925 డిసెంబరులో విడుదల చేశారు. ఒక తెలుగువాడు తెలుగుగడ్డపై నిర్మించిన మూకీ 'భక్త మార్కండేయ'. ఇందులో సి.పుల్లయ్య యమునిగా, కాకినాడ రాజరత్నం మార్కండేయుని తల్లిగా, మద్దూరి బుచ్చన్న శాస్త్రి మృకండ మహర్షిగా నటించారు.

ఈ మూకీ చిత్రాలను ప్రదర్శించేటప్పుడు కథా గమనానికి తగ్గట్టు మంచికంఠం గల వారు సన్నివేశానికి అనుగుణంగా వ్యాఖ్యానం చెప్పేవారు. అది సందర్భశుద్ధి కలిగి, హాస్యస్ఫోరకంగా వుండటం చేత ప్రేక్షకులు ఆనందించేవారు. ఈ తరహా వ్యాఖ్యాతలుగా కస్తూరి శివరావు, కాళ్లకూరి సదాశివరావు (తర్వాత యిద్దరూ నటులైనారు) పి.కొండలరావు, దంగేటి నర్సింహారావు, కె.హనుమంతరావు ప్రసిద్ధులు.

ఆ రోజుల్లో సినిమాలు ఎక్కువగా టెంట్ అంటే దేరా థియేటర్లలో ప్రదర్శించేవారు. సింగిల్ ప్రొజెక్టర్ ఉండటం చేత 15 నిముషాలకి ఒకసారి రీల్ మార్చవలసి వచ్చేది. ఆ సమయంలో తినుబండారాలు, షోడాలు అమ్మేవారికి మంచి గిరాకి ఉండేది. టౌన్‌లో వున్న సినిమాలు చూడటం కోసం ఎడ్లబండ్లపై ప్రేక్షకులు వచ్చేవారు.

1931వ సంవత్సరం యావత్ భారతదేశ చలనచిత్ర చరిత్ర సువర్ణాక్షరాలతో లిఖింపవలసిన సంవత్సరం. హిందీలో తొలి టాకీ 'అలంఆరా' చిత్రాన్ని అర్దేషిర్ ఇరానీ దర్శకత్వంలోను, తొలి తెలుగు టాకీ 'భక్త ప్రహ్లాద', తొలి తమిళ టాకీ 'కాళిదాసు' హెచ్.ఎమ్.రెడ్డి దర్శకత్వంలోను రూపొందించబడ్డాయి.

'భక్త ప్రహ్లాద' 15.09.1931న విడుదలైంది. నాటి నుంచి నేటి దాకా అంటే 2012 వరకు సుమారు 6600 చిత్రాలు రూపొందించబడ్డాయి. వాటిల్లో పౌరాణిక చిత్రాలు 175, జానపద చిత్రాలు 175, చారిత్రక చిత్రాలు 100 కాగా, మిశ్రమ చిత్రాలు అంటే పౌరాణిక అంశతో కూడిన జానపదాలు (కనకదుర్గా పూజామహిమ, వరలక్ష్మి వ్రతం, లక్ష్మీపూజ మొ॥నవి), చారిత్రక అంశతో కూడిన జానపదాలు (మల్లీశ్వరి, ఏకవీర మొ॥నవి), చారిత్రక, పౌరాణిక, జానపద అంశతో కూడిన సాంఘిక చిత్రాలు (దేవాంతకుడు, యమగోల, మావూళ్లో మహాశివుడు, అరుంధతి, మగధీర మొ॥నవి); ఈ తరహాల్లో రూపొందినవి సుమారు 150 చిత్రాలు. కాగా సాంఘిక చిత్రాలు 6000 ఉంటాయి. తిరిగి సాంఘిక చిత్రాలలో సామాజిక కుటుంబ కథాచిత్రాలు, హాస్య చిత్రాలు, విప్లవ చిత్రాలు, నవలా చిత్రాలు, బాలల చిత్రాలు ఇలా పలు రకాలు. వాటిని గురించి ఆయా ప్రకరణాల్లో రేఖామాత్రంగా తెలుసుకుందాం.

❖ ❖ ❖

# పౌరాణిక చిత్రాలు

భారత, భాగవత, రామాయణాది కథలకు చెందిన ఇతివృత్తాలతో కూడిన చిత్రాలు ఈ వర్గీకరణలోకి వస్తాయి. టాకీల తొలిదశలో (1931-40) రంగస్థలంపై ప్రాచుర్యం పొందిన పౌరాణిక నాటకాలనే చిత్రాలుగా రూపొందించారు. 'భక్త ప్రహ్లాద, హరిశ్చంద్ర, సతీ సావిత్రి, సతీ అనసూయ, సతీ తులసి, శ్రీ కృష్ణతులాభారం, శ్రీ కృష్ణలీలలు, వీరాభిమన్యు, సంపూర్ణ రామాయణం, లవకుశ, వేంకటేశ్వర మహాత్మ్యం' వంటి చిత్రాలు మూడు, నాలుగుసార్లు నిర్మించబడ్డాయి. తెలుగు పౌరాణిక చిత్రాలకు సంబంధించి అద్భుత విషయం ఏమంటే మహానటుడు ఎన్.టి.రామారావు శ్రీకృష్ణ పాత్రను 15 చిత్రాల్లోను, శ్రీరాముని పాత్రను 4 చిత్రాలలోను పోషించడమే గాక, పురాణ ప్రసిద్ధమైన అర్జునుడు, బృహన్నల, భీముడు, భీష్ముడు, శివుడు; ప్రతినాయక పాత్రలైన దుర్యోధనుడు, రావణుడు, కీచకుడు వంటి పాత్రలను అత్యంత సమర్థవంతంగా పోషించి, ఊహలోను, రవివర్మ వంటి చిత్రకారుని చిత్తరువులలోను ఉన్న రూపాలకు తనదైన శైలిలో నటనతో ప్రాణం పోషి, కారణజన్ముడనిపించుకున్నాడు.

ఎన్.టి.ఆర్. తరువాత శ్రీకృష్ణ, శ్రీరామ, అర్జున పాత్రలను పోషించడమే కాక, నారదునిగా 15 చిత్రాలలో నటించి, జన్మను సార్థకం చేసుకొన్న నటుడు టి.ఎల్.కాంతారావు. మహానటి సావిత్రి రెండు చిత్రాలలో (నర్తనశాల, పాండవ వనవాసం) ద్రౌపదిగా సహజనటనతో రాణించారు. విశ్వ నట చక్రవర్తిగా బిరుదొందిన ఎస్.వి.రంగారావు 'నర్తనశాల'లో కీచకునిగా నటించి, జకార్తాలో జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ఉత్తమనటునిగా సత్కరింపబడ్డారు. ఘటోత్కచుడు, బలరాముడు, కంసుడు, హరిశ్చంద్రుడు వంటి విభిన్న పాత్రలలో జీవించారు. పౌరాణిక చిత్రం అనగానే, చక్కని పర్సనాలిటీ, గంభీరమైన గొంతు అవసరం. అవి పుష్కలంగా ఉన్న గుమ్మడి వెంకటేశ్వరరావు, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, ముదిగొండ లింగమూర్తి, యమ్.బాలయ్య, ఈలపాట రఘురామయ్య, సూరిబాబు, సి.ఎస్.ఆర్.ఆంజనేయులు, రేలంగి, రాజనాల,

పద్మనాభం, ముక్కామల, అల్లు రామలింగయ్య, సత్యనారాయణ, కృష్ణవేణి, శాంతకుమారి, అంజలీదేవి, జమున, జానకి, కృష్ణకుమారి, కాంచన, వాణిశ్రీ ; వీరంతా పౌరాణిక చిత్రాలలో రాణించినవారే. ఆణిముత్యాలుగా పేర్కొనదగిన కొన్ని చిత్రాలను సమీక్షించుకుంటే...

1934లో సి.పుల్లయ్య దర్శకత్వంలో రూపొందిన 'లవకుశ' చిత్రం ఆబాలగోపాలాన్ని ఆనందింపజేసింది. ఆ పుల్లయ్యగారి దర్శకత్వంలోనే రంగులలో రూపొందిన 'లవకుశ' చిత్రం 1963లో విడుదలై ఘన విజయాన్ని సాధించింది. అభినవ సీతారాములుగా అంజలీదేవి, ఎన్.టి.రామారావు నీరాజనాలు అందుకున్నారు. సముద్రాల సీనియర్, సదాశివబ్రహ్మం రాసిన గీతాలకు అజరామరమైన సంగీతాన్ని అందించారు ఘంటసాల. సుశీల, లీల ఆలపించిన లవకుశల గీతాలు ఈనాటికి సంగీతప్రియులని అలరిస్తూనే ఉన్నాయి. ఈ చిత్రంలో నటించిన ఎన్.టి.ఆర్, కాంతారావు, నాగయ్య, ధూళిపాళ, రేలంగి వీరందరికీ ఒక ఘంటసాలగారే పాడటం విశేషం. ఇదే కథను కొన్న మార్పులు, చేర్పులు చేసి ముళ్ళపూడి వెంకట రమణ 'శ్రీరామ రాజ్యం' పేరిట రూపొందించిన రచనను నిర్మాత వై.సాయిబాబా, బాపు దర్శకత్వంలో నిర్మించిన చిత్రంలో సీతారాములుగా నయనతార, బాలకృష్ణ నటించగా, జొన్నవిత్తుల గీతాలు వ్రాశారు. వాటికి ఇళయరాజా స్వరాలు సమకూర్చారు.

1936లో పి.వి.దాసు రూపొందించిన 'మాయాబజార్'కు మరిన్ని మార్పులు, హంగులు చేర్చి 1957లో విజయాసంస్థ రూపొందించిన 'మాయాబజార్' కాలపరీక్షకు నిలబడి జనరంజకమైన అద్భుత కళాఖండంగా నిలిచిపోయింది. ఈ చిత్రానికి పింగళి సాహిత్యం, మార్కస్ బారట్లే ఛాయాగ్రహణం, గోఖలే కళాధర్ రూపొందించిన సెట్స్ హేమాహేమీలవంటి నటీనటుల అభినయం వీటన్నింటినీ సమన్వయ పరుచుకొని తెరపై అద్భుత ఫలితాలు సాధించిన దర్శకులు కె.వి.రెడ్డి చిరస్మరణీయులు.

1935వ సంవత్సరంలో ప్రముఖ సంగీత దర్శకులు సాలూరు రాజేశ్వరరావు బాలకృష్ణుడుగా నటించగా, చిత్రపు నర్సింహారావు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'శ్రీ కృష్ణలీలలు'. అందులో కంసునిగా నటించిన వేమూరి గగ్గయ్య పాడిన

పద్యం 'ధిక్కారమును సైతునా' ఎంతగానో ప్రాచుర్యం పొందింది. ఇదే కథను 1959లో బేబి ఉమా బాలకృష్ణుడుగా నటించగా, జంపన దర్శకత్వంలో రాజ్యం పిక్చర్స్ 'కృష్ణలీలలు' పేరుతో తీయగా, అందులో కంసుని పాత్రను తనదైన శైలిలో పోషించారు ఎస్.వి.రంగారావు. నిర్మాత లక్ష్మీరాజ్యం యశోదగా నటించారు. ఈ కథకు చిన్న మార్పులు, చేర్పులు చేసి సి.ఎస్.రావు దర్శకత్వంలో 'యశోద కృష్ణ' పేరిట వచ్చిన రంగుల చిత్రంలో బేబి శ్రీదేవి బాలకృష్ణునిగా నటించగా, కంసుని పాత్రను ఎస్.వి.రంగారావే పోషించడం, సంగీతాన్ని ఎస్.రాజేశ్వరరావు అందించడం చెప్పుకోదగ్గ విశేషం.

కన్నడ రంగానికి చెందిన సుందరరావు నడకర్ని 1940లో తీసిన చిత్రం 'భూకైలాస్'. ఇదే కథను ఎ.వి.ఎమ్ సంస్థ శంకర్ దర్వకత్వంలో 1958లో రూపొందించిన చిత్రంలో ఎన్.టి.ఆర్ – రావణునిగా, ఎ.ఎన్.ఆర్ నారదునిగా, మయాసురునిగా ఎస్.వి.రంగారావు, జమున మందోదరిగా పోటీపడి నటించగా, సముద్రాల రచనకు సుదర్శన్ – గోవర్ధన్ సంగీతాన్ని అందించారు.

భారత కథకు మూల పురుషుడైన భరతునికి జన్మనిచ్చిన శకుంతల కథను 1932లో బదామి దర్శకత్వంలో రూపొందగా, 1966లో ఎన్.టి.ఆర్, బి.సరోజాదేవి కాంబినేషన్‌లో కమలాకర కామేశ్వరరావు దర్శకత్వంలో రాజ్యం పిక్చర్స్ 'శకుంతల' పేరిట నిర్మించారు.

1936లో దుర్గాఫిలిమ్స్ పేరిట 'సంపూర్ణ రామాయణం' రూపొందగా, 1972లో బాపూ దర్శకత్వంలో రంగులలో రూపొందిన 'సంపూర్ణ రామాయణం' కళాత్మకంగా ఉండి, ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. శ్రీరామునిగా శోభన్‌బాబు, రావణబ్రహ్మగా ఎస్.వి.రంగారావు చిరస్మరణీయమైన నటనను ప్రదర్శించగా, రవికాంత్ నగాయిచ్ ట్రిక్ ఫొటోగ్రఫీ కనువిందు చేసింది.

1936లో చిత్రపు నర్సింహారావు దర్శకత్వంలో రూపొందిన పౌరాణిక చిత్రం 'సతీ తులసి'. ఇందులో టైటిల్ రోల్‌ను సీనియర్ శ్రీరంజని పోషించగా, జలంధరుడుగా వేమూరి గగ్గయ్య నటించారు. ఇదే కథను నటుడు చదలవాడ కటుంబరావు, విక్టరీ మధుసూదనరావు దర్శకునిగా పరిచయం చేస్తూ– 1959లో నిర్మించగా, ఎస్.వరలక్ష్మి, గుమ్మడి వెంకటేశ్వరరావు ప్రధాన పాత్రలు పోషించారు.

1958లో నమ్మాళ్‌వార్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'శ్రీరామాంజనేయ యుద్ధం'. ఈ కథలోని ముఖ్యాంశం రామనామమా, రామబాణమా. ఇదే కథ బాపూ దర్శకత్వంలో ఎన్.టి.ఆర్ ప్రధానపాత్రలో రంగులలో రూపొందించారు.

పాండవుల అజ్ఞాతవాసం, విరాటపర్వంలోని కీచకవధ ఘట్టాన్ని ప్రధానాంశాలుగా రాజ్యం పిక్చర్స్ రూపొందించిన 'నర్తనశాల' చిత్రం పౌరాణిక చిత్ర బ్రహ్మ కమలాకర కామేశ్వరరావు ప్రతిభకు అద్దం పట్టింది. ఆయన దర్శకత్వంలో రూపొందిన మరో పౌరాణిక చిత్రం 'పాండవ వనవాసం'. దుర్యోధనాదుల దుష్టపన్నాగం, మాయాజూదం, పాండవుల అరణ్యవాసం, అక్షయపాత్ర దానం, సౌగంధిక కమల వృత్తాంతం, చిత్రసేనుని చేతిలో కౌరవుల పరాభవం, శిశుపాలుని గర్వభంగం, ఉత్తరాభిమన్యుల వివాహం; ప్రధాన ఘట్టాలుగా ఈ చిత్ర కథను రూపొందించారు రచయిత సీనియర్ సముద్రాల. ఘంటసాల సంగీతం చిత్రానికి ప్రాణం పోసింది. కామేశ్వరరావు దర్శకత్వంలో రూపొందిన 'శ్రీకృష్ణావతారం, శ్రీ కృష్ణవిజయం, శ్రీకృష్ణతులాభారం' కూడా చెప్పుకోదగ్గవి.

ఎన్.టి.ఆర్ రూపొందించిన 'సీతారామ కళ్యాణం' ఆయన అభినయంతో, సముద్రాల రచనతో, గాలిపెంచల నరసింహారావు సంగీతంతో రాణించింది. కళ్యాణ సీతారాములుగా గీతాంజలి, హరనాథ్ చక్కగా నటించారు. ఆంధ్రదేశంలో ఏ ఇంట కళ్యాణం జరిగినా మనకు వినిపించే గీతం 'సీతారాముల కళ్యాణం చూతము రారండి'. ఇదే కథను తనదైన శైలిలో కళాత్మకంగా రూపొందించారు దర్శకుడు బాపు. జయప్రద ముగ్ధమోహన సీతగా నటించగా, రావణుని పాత్రలో రాణించారు సత్యనారాయణ. గంగావతరణ ఘట్టానికి సి.నారాయణరెడ్డి వ్రాసిన గీతానికి, బాపు తెరపై చిత్రీకరించిన తీరు ప్రముఖుల ప్రశంసలు అందుకున్నాయి.

'చెంచులక్ష్మి' వంటి పౌరాణిక చిత్రాన్ని రూపొందించిన బి.ఎ.సుబ్బారావు, ఎన్.టి.ఆర్‌ను భీష్మునిగా మలచటం చారిత్రాత్మక విశేషం. ఈ చిత్రం ద్వారా దుర్యోధనుని పాత్రలో ధూళిపాళ సీతారామశాస్త్రిని సినీరంగానికి పరిచయం చేశారు. కర్ణునిగా గుమ్మడి, కుంతిగా జి.వరలక్ష్మి పాత్రోచితంగా నటించారు.

1956లో వచ్చిన రాజ్యం పిక్చర్స్ 'హరిశ్చంద్ర'లో ఎస్.వి.రంగారావు టైటిల్ రోల్ పోషించగా, గుమ్మడి విశ్వామిత్రునిగా, నిర్మాత లక్ష్మీరాజ్యం చంద్రమతిగా

నటించారు. ఇదే కథను కె.వి.రెడ్డి దర్శకత్వంలో విజయావారు రూపొందించి నప్పుడు ఎన్.టి.ఆర్, ముక్కామల, ఎస్.వరలక్ష్మి ఆ పాత్రలను పోషించారు.

'పారిజాతాపహరణం, సుభద్రా కళ్యాణం, గయోపాఖ్యానం' ఈ మూడు కథలను కలిపి పింగళి రూపొందించిన 'శ్రీకృష్ణార్జున యుద్ధం' కె.వి.రెడ్డి దర్శకత్వంలో సర్వాంగసుందరంగా రూపొందింది. ప్రధాన పాత్రల్లో ఎన్.టి.ఆర్, ఎ.ఎన్.ఆర్., బి.సరోజాదేవి రాణించారు. పెండ్యాల నాగేశ్వరరావు అందించిన సంగీతం హాయిగా ఉంటుంది.

1954లో వచ్చిన పౌరాణిక చిత్రం 'కాళహస్తి మాహాత్మ్యం'లో కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్, మాలతి ప్రధాన పాత్రలు పోషించారు. ఆ చిత్రంలోని ఘంటసాల పాటలు, పద్యాలు ప్రాచుర్యం పొందాయి. అదే కథను నటుడు కృష్ణంరాజు ప్రధాన పాత్ర పోషించి, బాపూ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'భక్త కన్నప్ప'. వేటూరి రచన, సత్యం సంగీతం, రామకృష్ణ గానం చిత్రానికి వన్నె తెచ్చాయి.

పౌరాణిక చిత్ర నిర్మాణానికి సంబంధించినంత వరకు ఒకే కథను రెండు సినిమాలుగా రూపొందించి, పోటీపడ్డ సందర్భాలకు పరాకాష్టగా చెప్పుకోదగ్గ అంశం 'దానవీర శూరకర్ణ, కురుక్షేత్రం' చిత్రాల పోటీ కథ. 1977లో సంక్రాంతికి కానుకగా ఈ రెండు చిత్రాలు విడుదలయ్యాయి. 'దానవీర శూరకర్ణ' చిత్రానికి కర్త, కర్మ, క్రియా అన్నీ తానే అయి, కథా, స్క్రీన్‌ప్లే, నిర్మాణం, దర్శకత్వంతో పాటు విభిన్న ప్రవృత్తి గల శ్రీకృష్ణ, కర్ణ, సుయోధన పాత్రలను అనితర సాధ్యం అనేలా ఎన్.టి.ఆర్ రూపొందించడం. ప్రత్యేకించి కర్ణుని అంగరాజ్యానికి రాజును చేసిన సందర్భంలో 'ఏమంటిరేమంటిరీ' అన్న రెండు పేజీల డైలాగు మూడు నిమిషాల సేపు అభినయించిన తీరు అద్భుతం, అపూర్వం. కొండవీటి వెంకటకవి రచన, సి.నా.రె గీతాలు, పెండ్యాల సంగీతం అదనపు ఆకర్షణలుగా చెప్పుకోవచ్చు. దీనికి పోటీగా సూపర్ స్టార్ కృష్ణ, కమలాకర కామేశ్వరరావు దర్శకత్వంలో ఇంచుమించు ఇదే కథతో రూపొందించిన చిత్రం 'కురుక్షేత్రం'. మహారథి, సముద్రాల రచన, ఎస్.రాజేశ్వరరావు సంగీతం, కురవల్లి నాగేశ్వరరావు కళా దర్శకత్వం చెప్పుకోదగ్గ అంశాలు. శోభన్‌బాబు శ్రీకృష్ణుడుగా నటించగా, పతాక సన్నివేశంలో ఘంటసాల భగవద్గీత శ్లోకాలను చిత్రీకరించడం ప్రత్యేకత.

మన ఊహలలోను రవివర్మ వంటి చిత్రకారుల చిత్రాలలోను మాత్రమే ఉండే శ్రీరామ, శ్రీకృష్ణ, సుయోధనుడు, శకుని, సీత, ద్రౌపది వంటి పాత్రలను ప్రామాణికంగా తెరపైకి అనువదించినవారు రామాయణకాలంనాటి అయోధ్యాపుర వీధులు, భారతకాలం నాటి మయసభ వీటిని సర్వాంగసుందరంగా సృష్టించేవారు, కథాకాలం నాటి వాతావరణానికి తగ్గట్టుగా సంగీతాన్ని అందించనవారు, పాత్రల హుందాతనానికి, ఔచిత్యానికి తగ్గట్టు మాటలు, పాటలు వ్రాసినవారు, వీటన్నింటినీ సమన్వయం చేసుకొని తెరపై అద్భుతాలు సృష్టించిన దర్శకులు అసలు ఆ తరహా చిత్రాలను నిర్మించాలని త్రికరణశుద్ధిగా కృషి చేసిన నిర్మాతలు – వీరందరీ సమష్టి కృషితో తెరపై 'మాయాబజార్', 'భూకైలాస్', 'దానవీరశూరకర్ణ', 'శ్రీకృష్ణావతారం' వంటి అద్భుత దృశ్య కావ్యాలు మన కళ్లముందు సాక్షాత్కరించాయి. ఇందుకు కారణభూతులైన దర్శకులు (కె.వి.రెడ్డి, కమలాకరకామేశ్వరరావు), రచయితలు (సముద్రాల, పింగళి, మల్లాది, ఆరుద్ర), నటీనటులు (ఎన్.టి.రామారావు, నాగేశ్వరరావు, కాంతారావు, ఎస్.వి.రంగారావు, గుమ్మడి, సి.ఎస్.ఆర్, రేలంగి, ఆర్.నాగేశ్వరరావు, ముదిగొండ లింగమూర్తి, మిక్కిలినేని, కన్నాంబ, సావిత్రి, జమున, సూర్యకాంతం, దేవిక), సాంకేతిక నిపుణులు (మార్కస్ బారెట్లె, కన్నప్ప, పసుమర్తి కృష్ణమూర్తి, వెంపటి సత్యం, వేదాంతం రాఘవయ్య, మాధవపెద్ది గోఖలే, కళాధర్, పీతాంబరం, భక్తవత్సలం, పెండ్యాల నాగేశ్వరరావు, ఘంటసాల, సుసర్ల దక్షిణామూర్తి) – ఇలా ఎందరెందరో మహానుభావులు అజరామరమైన దృశ్యకావ్యాలను మనకు అందించి, వారు అమరులై కళాభిమానుల దృష్టిలో ప్రాతఃస్మరణీయులుగా మిగిలిపోయారు.

మన పౌరాణిక చిత్రాలు ఎంతో పరిశోధనతో కూడి ప్రామాణికంగా నిర్మించబడ్డాయి. అందుకే రామానందసాగర్ హిందీలో రూపొందించిన సీరియల్ 'రామాయణం'కు బి.ఆర్.చోప్రా రూపొందించిన 'మహాభారత్'కు పాత్రల రూపకల్పనలోను, సెట్స్ రూపొందించటంలోను, అభినయపరంగాను, నిర్మాణపరంగాను సాంకేతిక విలువలకు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి.

❖ ❖ ❖

# చారిత్రిక చిత్రాలు

చరిత్రలో జరిగిన ప్రధాన ఘట్టాలను, కథానాయకులుగా చరిత్ర సృష్టించిన మహామహులు వారు కవులు కావచ్చు, గాయకులు కావచ్చు, పరిపాలకులు కావచ్చు – వారి జీవితాలను, ముఖ్య సన్నివేశాలను రూపకల్పన చేసిన చిత్రాలను చారిత్రిక చిత్రాలుగా వర్గీకరించవచ్చు. ఈ తరహా చిత్రాల నిర్మాణం వ్యయప్రయాసలతో కూడి వుంటుంది. ప్రధాన కథ, కథనం, పాత్రలు అన్నీ ప్రేక్షకులకు హరికథల రూపంలోను, బుర్రకథల రూపంలోను, నాటకాల రూపంలోను ప్రేక్షకులకు పరిచయమైనవే. ఈ చారిత్రిక చిత్రాలను ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా వాస్తవ అంశాలను విస్మరించకుండా, కొద్దిపాటి కల్పనతో సహజత్వానికి దగ్గరిగా వుండేలా తీర్చిదిద్దటం కత్తి మీద సాము వంటిది. అంతే కాకుండా కథాకాలం నాటి వాతావరణానికి తగ్గట్టుగా సెట్స్ నిర్మించటం, పాత్రల ఔచిత్యానికి తగ్గట్టు కాస్ట్యూమ్స్ రూపొందించటం సృజనాత్మక కళ. పౌరాణిక చిత్రాలలో వలెనే ఒకే చారిత్రిక కథను రెండు, మూడుసార్లు సినిమాలుగా రూపొందించిన సందర్భాలు ఉన్నాయి. ఆ దిశగా రూపొందిన చారిత్రిక చిత్రాలను పరిశీలిద్దాం.

1933లో 'రామదాసు' పేరిట రెండు చిత్రాలు పోటీపడి నిర్మించారు. ఒక దానిలో అరణి సత్యనారాయణ, రెండో చిత్రంలో సి.ఎస్.ఆర్ ఆంజనేయులు ప్రధాన పాత్ర పోషించారు. 1964లో ప్రముఖ నటుడు, సంగీతజ్ఞుడు వి.నాగయ్య ప్రధాన పాత్ర పోషించి, స్వీయ దర్శకత్వంలో 'రామదాసు' నిర్మించారు. ఆ చిత్రం నిర్మాణ దశలో అలనాటి భక్త రామదాసు పడ్డ ఇబ్బందులన్నీ నాగయ్య అనుభవించారు. కబీర్‌గా నటించిన గౌరీనాథశాస్త్రి మరణించగా, ఆ పాత్రను గుమ్మడి పోషించారు. నాగేశ్వరరావు, రామారావు, అంజలీదేవి అతిథి నటులుగా పాల్గొన్నారు. 2006లో ఇదే కథను రంగులలో నాగార్జున ప్రధానపాత్రలో రాఘవేంద్రరావు దర్శకత్వంలో, కీరవాణి సంగీతంతో, భారవి రచనతో రూపొందిన 'శ్రీరామదాసు' చిత్రం ఘన విజయాన్ని సాధించింది.

రాజమహేంద్రవరాన్ని పరిపాలించిన రాజరాజ నరేంద్రుని కుమారుడైన సారంగధరుని కథ కొంత కల్పితమైనా, చారిత్రక అంశాలతో ముడిపడినది. 1937లో శాంతకుమారి, బందా కనకలింగేశ్వరరావు ప్రధాన పాత్రలుగా పి.పుల్లయ్య దర్శకత్వంలో నిర్మించారు. రెండు దశాబ్దాల తరువాత 1957లో అదే కథను ఎన్.టి.ఆర్, భానుమతి కాంబినేషన్‌లో సముద్రాల రచనతో, ఘంటసాల సంగీతంతో ప్రేక్షకులకు కనువిందు చేసింది.

కావేరీ తీరాన వెలసిన శ్రీరంగనాథుని భక్తుడైన 'విప్రనారాయణ' కథను 1937లో అహిన్ చౌదరి దర్శకత్వంలో కస్తూరి నరసింహారావు, కాంచనమాల ప్రధాన పాత్రలుగా రూపొందించగా, అదే కథను భరణి రామకృష్ణ, నాగేశ్వరరావు, భానుమతి ప్రధాన పాత్రలుగా 1954లో నిర్మించగా, సముద్రాల రచన, రాజేశ్వరరావు సంగీతంతో రూపొందిన గీతాలు ఈనాటికి ప్రేక్షకులను అలరిస్తున్నాయి.

శివాజి కాలంలో అభంగాలు వ్రాసి, భక్తుడైన తుకారామ్ పాత్రను 1937లో సి.ఎస్.ఆర్ ఆంజనేయులు పోషించగా, అదే కథను అంజలీ పిక్చర్స్ రంగులలో 'భక్త తుకారామ్' పేరిట 1973లో వి.మధుసూదనరావు దర్శకత్వంలో నాగేశ్వరరావు, అంజలీదేవి, శివాజీగణేష్ ప్రధాన పాత్రలు పోషించగా, నిర్మాత ఆదినారాయణావు సంగీతాన్ని అందించారు.

1938లో రెంటచింతల సత్యనారాయణ, సురభి కమలాబాయి ప్రధాన పాత్రలుగా వచ్చిన చిత్రం అష్టపదులు వ్రాసిన 'భక్త జయదేవ'. ఇదే పేరుతో 1961లో పి.వి.రామారావు దర్శకత్వంలో రూపొందిన చిత్రంలో అక్కినేని, అంజలి ప్రధాన పాత్రలు పోషించగా, సాహిత్య, సంగీతాలను సముద్రాల, రాజేశ్వరరావు అందించారు. అద్దంకి శ్రీరామమూర్తి టైటిల్ రోల్ పోషించిన 'భోజ కాళిదాసు' చిత్రాన్ని 1940లో హెచ్.వి.బాబు దర్శకత్వంలో తయారైంది. ఇదే కథను మరింత పరిశోధన చేసి 'మహాకవి కాళిదాసు'గా 1960లో కమలాకర కామేశ్వరరావు దర్శకత్వంలో రూపొందించగా, దానికి రాష్ట్రపతి రజిత కమలం లభించింది. నాగమణి, సూరిబాబు నిర్మించిన ఈ చిత్రానికి పింగళి రచన, పెండ్యాల సంగీతం

ప్రధానం కాగా, టైటిల్ రోల్‌ను పోషించిన అక్కినేని నాగేశ్వరరావును మధ్యప్రదేశ్ ప్రభుత్వం 'కాళిదాస కౌస్తుభ' పురస్కారంతో సత్కరించింది.

ప్రఖ్యాత సంగీత దర్శకుడు బి.ఎన్.ఆర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మీరాబాయి'లో మిస్ చలం ప్రధాన పాత్ర పోషించారు. 1941లో నిర్మాత, దర్శకుడు, టాకీ పితామహుడు అయిన హెచ్.ఎమ్.రెడ్డి రూపొందించిన చిత్రం 'తెనాలి రామకృష్ణ'. ఇందులో హాస్యానికి ప్రాధాన్యత ఇచ్చారు. లక్ష్మణస్వామి రామకృష్ణునిగా నటించగా, ప్రముఖ దర్శకుడు ఎల్.వి.ప్రసాద్ తిమ్మరుసు పాత్ర పోషించారు. ఇదే కథకు రాజకీయ ప్రాధాన్యాన్ని, కవితా సౌరభాలతో కలగలిపి సముద్రాల రచనతో, ప్రముఖ నిర్మాత, దర్శకుడు బి.ఎస్.రంగా 1956లో తీసిన చిత్రం 'తెనాలి రామకృష్ణ'. టైటిల్ రోల్‌ను అక్కినేని నాగేశ్వరరావు, అతని భార్య కమల పాత్రను జమున, తిమ్మరుసుగా నాగయ్య, శ్రీకృష్ణదేవరాయలుగా ఎన్.టి.రామారావు, నెగెటివ్ టచ్ ఉన్న వ్యాంప్ కృష్ణసాని పాత్రను భానుమతి పోషించటం ఓ విశేషం. కేంద్రప్రభుత్వ పురస్కారాన్ని అందుకుందీ చిత్రం.

1942లో వాహిని సంస్థ కె.వి.రెడ్డిని దర్శకునిగా పరిచయం చేస్తూ రూపొందించిన చిత్రం 'భక్త పోతన'. ప్రధాన పాత్రను పోషించిన నాగయ్య కర్ణపేయమైన సంగీతాన్ని అందించారు. శ్రీనాథునిగా గౌరీనాథశాస్త్రి నటించగా, శ్రీరామునిగా సి.హెచ్.నారాయణరావు, సరస్వతీదేవిగా ప్రముఖ గాయని టంగుటూరి సూర్యకుమారి, అతిథులుగా నటించగా, ఆ చిత్రం అఖండ విజయాన్ని సాధించింది. ఇదే కథను 1966లో దర్శకుడు గుత్తా రామినీడు దర్శకత్వంలో గుమ్మడి, ఎస్.వి.రంగారావు ప్రధాన పాత్రలు పోషించగా, ఆ చిత్రం ప్రజాధరణకు నోచుకోలేదు. ఎన్.టి.రామారావు ఎంతగానో అభిమానించిన పాత్ర శ్రీనాథుడు. ఆ పాత్రను పోషించి, ఆయన ముళ్లపూడి వెంకట రమణ రచనతో, బాపు దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'శ్రీనాథ కవిసార్వభౌమ'. అదే ఎన్.టి.ఆర్ నటించిన చివరి చిత్రం. పింగళి రచనతో, పెండ్యాల సంగీతంతో ఎన్.టి.ఆర్ స్వీయదర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'చాణక్య-చంద్రగుప్త'. ఇందులో అక్కినేని చాణక్యునిగా, ఎన్.టి.ఆర్ చంద్రగుప్తునిగా, శివాజి గణేశన్ అలెగ్జాండర్‌గా, సత్యనారాయణ రాక్షసమంత్రిగా, జయప్రద విషకన్యగా నటించారు.

అక్బర్ కాలంనాటి ప్రేమకథను అంజలీ పిక్చర్స్ 'అనార్కలి' పేరుతో రూపొందించగా, అదే కథను 'అక్బర్-సలీమ్-అనార్కలి' పేరిట ఎన్.టి.ఆర్ స్వీయదర్శకత్వంలో నిర్మించారు. ఆయనే రూపొందించిన మరో చారిత్రిక చిత్రం 'శ్రీమద్‌విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర'. నటుడు పద్మనాభం, వాణిశ్రీ ప్రధాన పాత్రలో తీసిన చిత్రం 'కథానాయిక మొల్ల'.

సాయిబాబా మహిమలను తెలుపుతూ పలు చిత్రాలు రాగా, విజయచందర్ నటించిన సాయిబాబాకు ప్రశంసలు లభించాయి. ఇటీవల నాగార్జున హీరోగా, రాఘవేంద్రరావు రూపొందించిన చిత్రం 'షిరిడీ సాయి'.

ప్రముఖ వాగ్గేయకారుడు త్యాగయ్య కథను ఒక తపస్సులా భావించి, చిత్తూరు నాగయ్య ప్రధాన పాత్ర పోషించి స్వీయ దర్శకత్వంలో 1946లో రూపొందించగా, దానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తిరువాన్కూర్ రాజావారు బంగారు నాణాలతో నాగయ్యను సత్కరించారు. శంకరాభరణంతో స్టార్‌డమ్ పొందిన జె.వి.సోమయాజులు ప్రధాన పాత్రలో నవతా కృష్ణంరాజు, బాపు-రమణల కాంబినేషన్‌లో రూపొందిన రంగుల చిత్రాన్ని ప్రజలు తిప్పికొట్టారు.

నాగయ్య ప్రధాన పాత్రలో వాహిని సంస్థ కె.వి.రెడ్డి దర్శకత్వంలో 1947లో అందించిన 'యోగి వేమన' చిత్రం విమర్శకుల ప్రశంసలు పొందింది. ఇదే కథను నటుడు విజయచందర్ ప్రధాన పాత్ర పోషించి, రంగులలో 'వేమన చరిత్ర' పేరిట నిర్మించగా ఫలితాలు అంతంత మాత్రమే.

పలనాటి యుద్ధం కథ అందరికీ తెలిసిందే. ఆ కథను రసవత్తరమైన సినిమాగా రూపొందించాలనేది గూడవల్లి రామబ్రహ్మంగారి చిరకాల వాంఛ. చిత్రాన్ని ప్రారంభించి పూర్తి కాకుండానే కీర్తిశేషులయ్యారు. ఎల్.వి.ప్రసాద్ చిత్రాన్ని పూర్తి చేశారు. నాయకురాలు నాగమ్మగా కన్నాంబ, బ్రహ్మనాయుడుగా గోవిందరాజుల సుబ్బారావు, బాలచంద్రుడిగా నాగేశ్వరరావు, మాంచాలగా ఎస్.వరలక్ష్మి నటించగా ఆ చిత్రానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ఇదే కథను 1966లో గుత్తా రామినీడు దర్శకత్వంలో ఎన్.టి.ఆర్. భానుమతి, హరనాథ్, జమున కాంబినేషన్‌లో తీయగా, ఆర్థిక ఫలితాలు సంతృప్తినివ్వకపోయిన, కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రశంసా పత్రం లభించటం చెప్పుకోదగ్గ విశేషం.

1964లో నిర్మాత, దర్శకుడు సి.సీతారామ్ రూపొందించిన చిత్రం 'బొబ్బిలియుద్ధం'. ఎన్.టి.ఆర్, భానుమతి, ఎస్.వి.రంగారావు ప్రధాన పాత్రలు పోషించారు. ఇదే కథను 'తాండ్ర పాపారాయుడు' (1986) పేరిట నటుడు కృష్ణంరాజు ప్రధాన పాత్ర పోషించి, దాసరి నారాయణరావు దర్శకత్వంలో రూపొందించారు. ఈ రెండు చిత్రాలకు సాలూరు రాజేశ్వరరావు సంగీతాన్ని అందించటం చారిత్రాత్మకంగా చెప్పుకోదగ్గ విశేషం.

శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి కథానేపథ్యంతో రూపొందిన క్లాసిక్ 'మల్లీశ్వరి'. బి.ఎన్.రెడ్డి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, సాలూరు రాజేశ్వరావు తెర వెనుక కృషి చేయగా, తెర ముందు ఎన్.టి.రామారావు, భానుమతి, శ్రీవాత్సవ, బాలానందం న్యాపతి రాఘవరావు ప్రధానపాత్రలకు ప్రాణం పోశారు.

కృష్ణాజిల్లాలోని శ్రీకాకుళం పరిపాలించిన ఆంధ్రమహావిష్ణువు కథను ఎ.కె.శేఖర్ దర్శకత్వంలో, పింగళి రచనతో, పెండ్యాల సంగీతంతో రూపొందిన చిత్రం 'శ్రీకాకుళ ఆంధ్రమహావిష్ణువు కథ'. రామారావు, రంగారావు, జమున ప్రధాన పాత్రధారులు.

ఇరాక్ దేశానికి చెందిన ప్రేమకథను 'లైలా మజ్నూ'గా రూపొందించారు. ఏసుక్రీస్తు జీవితాన్ని నటుడు విజయచందర్ ప్రధాన పాత్ర పోషించిన 'కరుణామయుడు' చిత్రం సంచలన విజయం సాధించింది. ఆ కోవలోనే ఆయన రూపొందించిన మరో చిత్రం 'రాజాధిరాజు'. జయాపజయాలు ప్రసక్తి లేకుండా ఆయన రూపొందించిన మరో అద్భుత చారిత్రక చిత్రం 'ఆంధ్రకేసరి'.

తెలుగులో వచ్చిన చారిత్రాత్మక చిత్రాలన్నింటిలోనూ అగ్రతాంబూలం అందుకోదగ్గ అద్భుత చిత్రం 'అల్లూరి సీతారామరాజు'. ఇది హీరో కృష్ణ అపూర్వ సృష్టి. చారిత్రాత్మక నేపథ్యానికి తగ్గ వాతావరణం, సెట్స్, ఫొటోగ్రఫీ పాత్రలకు తగ్గ నటులు ముఖ్యంగా కృష్ణ – జగ్గయ్య (సీతారామరాజు, రూథర్‌పర్డ్) కాంబినేషన్ చిత్రాన్ని చిరస్మరణీయం చేశారు. రచనాపరంగా మహారథి, శ్రీశ్రీ, నారాయణరెడ్డి కృతార్థులైతే వాతావరణానికి తగ్గ నేపథ్య సంగీతాన్ని అందించిన ఆదినారాయణరావు, ఆర్ట్ డైరెక్టర్ భాస్కర్‌రాజు, కెమెరామన్ వి.యస్.ఆర్ స్వామి,

దర్శకులు వి.రామచంద్రరావు వీరంతా చరితార్థులు. ఈ చిత్రం నటుడిగా కృష్ణను చిరంజీవిని చేస్తే, ప్రేక్షకులు ఘనవిజయంతో పట్టంకట్టారు. రాష్ట్ర ప్రభుత్వం బంగారునందితో సత్కరించింది.

శ్రీకృష్ణదేవరాయల నాటి కాలంలో జరిగిన కథగా స్వామి భక్తి ఇతివృత్తంగా సాగిన చిత్రం 'విశ్వనాథ నాయకుడు'. ఇందులో శివాజీగణేషన్, కృష్ణ – తండ్రీ కొడుకులుగా అద్భుతంగా నటించారు. కొండముది శ్రీరామచంద్రమూర్తి రచనతో సాగిన ఈ చిత్రానికి దాసరి నారాయణరావు దర్శకులు.

చారిత్రక చిత్రాల రూపకల్పనకు పరిశోధన అవసరం. శిలాశాసనాలు, గ్రంథాలు, పురావస్తుశాలలు వీటికి సహకరిస్తాయి. కథాకాలం నాటి వేషభాషలు, ఆచారవ్యవహారాలు ఎలా వుండేవో తెలుసుకోవాలి. వాటి గురించి అధ్యయనం ఉండాలి. చరిత్రను వక్రీకరించని నిజాయితి నిర్మాత, దర్శకులు, రచయితల్లో వుండాలి. 'అల్లూరి సీతారామరాజు' చిత్రాన్ని రూపొందించినప్పుడు ఆ చిత్ర రచయిత మహారథి ఆ బాధ్యతను ఒక దీక్షగా, ఒక తపస్సుగా భావించి అరణ్యాల్లో చెట్టు నీడన కూర్చొని భావోద్వేగంతో రచన చేశారు. నటుడు కృష్ణ, దర్శకుడు వి.రామచంద్రరావు, కె.ఎస్.ఆర్.దాస్, కెమెరామెన్ వి.ఎస్.ఆర్.స్వామి తమ మెదడుకు పదును పెట్టి కృషి చేశారు. ఫలితంగా అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయ చారిత్రక చిత్రంగా మిగిలిపోయింది.

ఆ తరహా కృషినే కొనసాగించారు దర్శకులు కె.రాఘవేంద్రరావు, రచయిత జె.కె.భారవి, సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్.కీరవాణి, కథానాయకుడు నాగార్జున. ఆ సమష్టి కృషి ఫలితంగా రూపొందిన అద్భుత సంగీతభరిత చారిత్రిక చిత్రాలు 'అన్నమయ్య', 'శ్రీరామదాసు'.

ప్రేక్షకుల అభిరుచిలోనూ, కాలానుగుణంగా చిత్ర నిర్మాణంలోనూ వేగంపరంగా వచ్చిన మార్పులరీత్యా, చారిత్రిక నేపథ్యం గల చిత్రాలను రూపొందించడానికి నిర్మాత, దర్శకులు ముందుకు రాకపోవడం ఒక విధంగా బాధాకరమే.

❖ ❖ ❖

# జానపద చిత్రాలు

కాశీమజిలీకథలు, పేదరాశి పెద్దమ్మ కథలు, విక్రమార్కుని కథలు, అరేబియన్ నైట్స్ కథలు – ఇవి ఊహాలోకానికి చెందినవి. వీటిలో మాయలు, మంత్రతంత్రాలు, రాజ్యాధికారం కోసం కుట్రలు, కుతంత్రాలు, ఎత్తుకుపై ఎత్తులు, దేవతల, మునీంద్రుల శాపాలు, యక్ష కిన్నెర ఇంద్ర లోకాలు – ఇవన్నీ కథాగమనంలో చోటుచేసుకుంటాయి. అద్భుత రసాన్ని ఆవిష్కరించి, ప్రేక్షకుల్ని ఊహాలోకాల్లో విహరింపజేయడం వీటి లక్ష్యం. టక్కుటమార గజకర్ణ గోకర్ణ విద్యలూ, మాంత్రికుడూ, మంత్ర తంత్రాలు; వాడి ప్రాణ రహస్యం ఎక్కడో వుండటం, కథానాయకుడిని దుష్టశక్తులను బలియిచ్చి నాయికను పొందడం వాడి లక్ష్యం. కొన్ని సందర్భాల్లో దుష్ట సేనాని దుర్బుద్ధితో రాజును హింసించి లేక సంహరించి రాజ్యాన్ని దాంతోబాటు రాకుమారిని చేపట్టాలని ప్రయత్నించడం, వీరోచిత పోరాటంలో కథానాయకుడు వారిద్దరినీ సంహరించి రాకుమార్తెను పెళ్ళాడటం; ఇవీ ఆ జానపద కథల సారాంశం. ఈ జానపద చిత్రాల్లో గుర్రపు స్వారీలు, కత్తి యుద్ధ పోరాటాలు, ఆ పోరాటాల్లో చిత్ర విచిత్ర విన్యాసాలు పుష్కలంగా వుంటాయి.

1937లో విడుదలైన 'కనకతార' తొలి జానపద చిత్రం. హెచ్.వి.బాబు దర్శకత్వంలో తయారైన ఈ చిత్రంలో కన్నాంబ, దొమ్మేటి సూర్యనారాయణ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం ద్వారానే సముద్రాల రాఘవాచార్య రచయితగా సినీరంగానికి పరిచయం అయ్యారు. ఇదే కథను 1956లో రజనీకాంత్ దర్శకత్వంలో ఎస్.వరలక్ష్మి, ఎస్.వి.రంగారావు ప్రధాన పాత్రలతో రూపొందించారు.

ఆంధ్రదేశంలో ప్రాచుర్యం పొందిన నాటకం 'బాలనాగమ్మ'. దానిని అదే పేరుతో సి.పుల్లయ్య దర్శకత్వంలో 1942లో జెమినీ సంస్థ రూపొందించింది. కాంచనమాల, పుష్పవల్లి (హిందీ నటి రేఖ తల్లి), బందా కనకలింగేశ్వరరావు ప్రధాన పాత్రలు పోషించారు. దీనికి పోటీగా 'శాంత బాలనాగమ్మ' పేరుతో మరో చిత్రాన్ని నిర్మించారు. ఈ రెండింటికి ఎస్.రాజేశ్వరరావు సంగీతం

అందించడం విశేషం. ఇదే కథను 1959లో వేదాంతం రాఘవయ్య దర్శకత్వంలో ఎన్.టి.ఆర్, అంజలి, ఎస్.వి.ఆర్ కాంబినేషన్‌లో రూపొందించారు. ఆ తరువాత జమున, రామకృష్ణ, సత్యనారాయణ ప్రధాన పాత్రల్లో మరో బాలనాగమ్మ తీశారు.

అక్కినేని కథానాయకుడిగా నటించిన 'మాయాలోకం' (1945) చిత్రానికి గూడవల్లి రామబ్రహ్మం నిర్మాత, దర్శకుడు. ఇందులో నాగేశ్వరరావు సరసన ఎస్.వరలక్ష్మితో పాటు ఆయన కంటే వయసులో పెద్దవారైన శాంతకుమారి, ఎమ్.వి.రాజమ్మ కథానాయికలుగా నటించడం చెప్పుకోదగ్గ విశేషం. ఆ తరువాత ప్రతిభా అధినేత ఘంటసాల బలరామయ్య రూపొందించిన 'ముగ్గురు మరాఠీలు', 'బాలరాజు', 'స్వప్నసుందరి' చిత్రాల్లో నాగేశ్వరరావే కథానాయకుడు. ఆ మూడు చిత్రాలు అఖండ విజయాన్ని సాధించాయి. సంగీతపరంగా 'బాలరాజు' (గాలిపెంచల నర్సింహారావు, ఘంటసాల), 'స్వప్నసుందరి' (సి.ఆర్.సుబ్బరామన్) చెప్పుకోదగ్గవి. 1949లో షేక్స్పియర్ నాటకం 'కింగ్‌లియర్' ఆధారంగా కె.వి.రెడ్డి దర్శకత్వంలో వాహిని సంస్థ నిర్మించిన 'గుణసుందరి కథ', మీర్జాపురం రాజా రూపొందించిన 'కీలుగుర్రం' చిత్రాలు ప్రజాదరణ పొందాయి. 'గుణసుందరి కథ'లో విచిత్రమైన మకరద్వారం, సింహద్వారం, కమలద్వారం – కనువిందు చేయగా, 'కీలుగుర్రం'లో కథానాయకుడు ఆకాశంలో గుర్రంపై విహరిస్తూ– 'కాదు సుమా కల కాదు సుమా' అని యుగ గీతం పాడటం, అప్పట్లో వింతగా చెప్పుకున్నారు.

'అల్లా ఉద్దీన్ అద్భుతదీపం' కథలోని మూల అంశాన్ని తీసుకొని పింగళి రూపొందించిన అద్భుతమైన కథ 'పాతాళభైరవి'. జానపద చిత్రాలను ఓ మలుపు తిప్పడమే కాక, భవిష్యత్‌లో రూపొందిన ఎన్నో జానపద చిత్రాలకు స్ఫూర్తినిచ్చింది 'పాతాళభైరవి'. పింగళి నాగేంద్రరావు రచన, మార్కస్ బారెట్లే కెమెరా, ఘంటసాల సంగీతం, కళాధర్ గోఖలే సృష్టించిన సెట్స్, కథానాయకుడు తోటరాముడుగా ఎన్.టి.రామారావు సాహసాలు, నేపాళ మాంత్రికునిగా ఎస్.వి.రంగారావు ఆంగిక వాచికాభినయనం చిత్రాన్ని చిరస్మరణీయం చేశాయి.

తొలి దశలో జానపద కథానాయకునిగా పేరొందిన అక్కినేని నాగేశ్వరరావు 17, ఎన్.టి.రామారావు 47, ప్రతిజ్ఞతో హీరోగా పరిచయమైన కాంతారావు 50

జానపద చిత్రాల్లో కథానాయకులుగా నటించారు. ఆ తరువాత స్థానంలో దాదాపు ఓ డజను జానపద చిత్రాల్లో హీరోగా నటించారు నరసింహరాజు.

బహుముఖ ప్రజ్ఞాధురీణ భానుమతి కథ వ్రాసి, ద్విపాత్రాభినయనం చేసి, స్వీయదర్శకత్వంలో మూడు భాషల్లో రూపొందించిన జానపద చిత్రం 'చండీరాణి'. ఎన్.టి.ఆర్ కథానాయకుడు. సముద్రాల సీనియర్ రచన, సి.ఆర్.సుబ్బరామన్ సంగీత దర్శకులు.

సంగీత ప్రధానంగా సాగిన జానపద చిత్రాలు 'సువర్ణసుందరి, జయభేరి, జగదేకవీరుని కథ'. అంజలి పిక్చర్స్ నిర్మాత ఆదినారాయణరావు స్వతహాగా సంగీత దర్శకులు. ఆయన తొలిసారిగా సంగీతాన్ని అందించిన జానపద చిత్రం 'పల్లెటూరి పిల్ల' (1950 – దర్శకులు బి.ఎ.సుబ్బారావు). దీనికి పిజారో అనే నాటకం మూలం. ఇది మల్టీస్టారర్ చిత్రంగా చెప్పుకోవాలి. అంజలీదేవి, నాగేశ్వరరావు, ఎన్.టి.రామారావు, ఎ.వి.సుబ్బారావు ప్రధాన పాత్రధారులు. ప్రముఖ సంగీత దర్శకులు టి.వి.రాజు, దర్శకుడు తాపీ చాణక్య ఈ చిత్రానికి సహాయకులుగా పని చేయడమే కాక, సహాయ పాత్రలను పోషించారు. 'సువర్ణసుందరి' చిత్రానికి ఆదినారాయణరావే ఆదిత్యన్ పేరుతో కథను సమకూర్చారు. ఎన్నెన్నో మలుపులతో, శాపాలతో కూడిన కథ, దాంతోపాటు సంగీతపరంగా ప్రేక్షకులని అలరించడంతో ఆ చిత్రం అనూహ్య విజయం సాధించింది. హిందీలో కూడా ఈ చిత్రాన్ని వేదాంతం రాఘవయ్య దర్శకత్వంలో అంజలీ, నాగేశ్వరరావు కాంబినేషన్‌తో నిర్మించగా, ఉత్తర భారతంలో కూడా విజయభేరి మ్రోగించింది.

జానపద చిత్రాలకు కొత్త ఒరవడిని సృష్టించిన దర్శకుడు బి.విఠలాచార్య. దాదాపు ఓ పాతిక జానపద చిత్రాలు ఆయన దర్శకత్వంలో రూపొందాయి. ఇంచుమించు అన్నీ విజయాన్ని చవిచూశాయి. అందుకే ఆయన్ని జానపదబ్రహ్మగా కీర్తించారు. కత్తివీరుడుగా పేరొందిన కాంతారావు స్వయంగా 'సప్తస్వరాలు, గండరగండడు' అనే జానపద చిత్రాలను నిర్మించారు.

'మహాబలుడు, ఇద్దరు మొనగాళ్లు' వంటి జానపద చిత్రాల్లో నటించిన హీరో కృష్ణ స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే వ్రాసి, ద్విపాత్రాభినయనం చేసి

స్వీయదర్శకత్వంలో రంగులలో 70 ఎమ్.ఎమ్‌లో రూపొందించిన అద్భుత జానపద చిత్రం 'సింహాసనం'. తెలుగు చలన చిత్ర సీమలోని అతిరధ మహారధులు ఎందరో ఈ చిత్రంలో నటించారు. వారితో పాటు రచయిత మహారథి, హిందీ నటుడు అంజాద్‌ఖాన్, నాయిక వహీదా రెహమాన్ కీలకపాత్రలు పోషించడం విశేషం. మహారథి రచన, బప్పీలహరి సంగీతం అందించారు.

మహారథి రచనతో అద్భుతంగా రూపొందిన మరో రెండు జానపద చిత్రాలు, సుందర్‌లాల్ నెహతా, డూండీ నిర్మించిన 'బంధిపోటు', విశ్వశాంతి విశ్వేశ్వరరావు నిర్మించిన 'కంచుకోట' ఈ రెండు చిత్రాల కథాకథనాలు ఉత్కంఠ రేకెత్తించేలా రూపొందాయి. కథానాయకునిగా ఎన్.టి.ఆర్ అభినయం, ఆయన్ని సామాన్య ప్రేక్షకులకు దగ్గర చేసింది.

1938లో కాళ్లకూరి సదాశివరావు దర్శకత్వంలో వచ్చిన జానపదచిత్రం 'గులేబకావళి'. ఆ కథను ప్రేక్షకులకు తగ్గట్టుగా కొన్ని మార్పులు చేసి, ఎన్.టి.ఆర్ 1962లో గులేబకావళి కథ పేరిట నిర్మించారు. ఈ చిత్రం ద్వారానే గీత రచయితగా సి.నారాయణరెడ్డిని పరిచయం చేశారు. వారి రచనకు జోసఫ్, కృష్ణమూర్తి సంగీతాన్ని సమకూర్చారు.

నటుడు మోహన్‌బాబు కూడా విఠలాచార్య దర్శకత్వంలో 'వీరప్రతాప్' అనే జానపద చిత్రాన్ని నిర్మించారు.

ఉత్తమ అభిరుచితో సంగీత సాహిత్యాలకు ప్రాధాన్యత ఇచ్చి జానపద చిత్రాల్ని నిర్మించిన వారిలో ప్రముఖులు డి.వి.ఎస్.రాజు (మంగమ్మ శపథం, పిడుగు రాముడు, గండికోట రహస్యం), పింజల సుబ్బారావు (పేదరాశి పెద్దమ్మ కథ, లక్ష్మీకటాక్షం, త్రిలోకసుందరి), ఎన్.భావనారాయణ (తోటలో పిల్ల కోటలో రాణి, ఆకాశరామన్న, గోపాలుడు - భూపాలుడు)లను ముందుగా పేర్కొనాలి. విఠలాచార్య పై చెప్పిన చిత్రాల్లో కొన్నిటికి దర్శకత్వం వహించడమే గాక స్వయంగా ఎన్నో జానపద చిత్రాలు ఎన్.టి.ఆర్, కాంతారావు, నరసింహరాజులతో నిర్మించారు. జి. విశ్వనాథం కూడా 'గోపాలుడు భూపాలుడు, ఆకాశరామన్న' వంటి జానపద చిత్రాలకు దర్శకత్వం వహించారు.

వీటిలో 'త్రిలోకసుందరి' చిత్రానికి ఈ గ్రంథకర్తనైన నేను (ఎస్.వి.రామారావు) కథ వ్రాయడం, దానిని సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో, నరసింహరాజు కథానాయకుడుగా, మోహన్‌బాబు మాంత్రికుడుగా, పింజల సుబ్బారావు నిర్మించడం ఓ విశేషం.

ఇక రచనా పరంగా చెప్పాలంటే తొలి దశలో సముద్రాల సీనియర్, పింగళి నాగేంద్రరావు, మల్లాది రామకృష్ణశాస్త్రి, ఆరుద్ర, మలిదశలో సి.నారాయణరెడ్డి, మహారథి, వేటూరి, జి.కె.మూర్తి, ఆ తరహా భాషను, భావ సంపదను అందించారు. అలాగే ఆనాటి జానపద చిత్రాలకు నాటి సంగీత దర్శకులు పెండ్యాల (జయభేరి, భట్టివిక్రమార్క, జగదేకవీరుని కథ), ఘంటసాల (పాతాళభైరవి, పరమానందయ్య శిష్యుల కథ, రహస్యం), టి.వి.రాజు (చిక్కడు దొరకడు, మంగమ్మశపథం, పిడుగురాముడు, రాజనందిని), ఎస్.పి.కోదండపాణి (కాంతారావు చిత్రాలు) సమకూర్చిన సుమధురగీతాలు నేటికీ సినీ సంగీత విభావరుల్లో శ్రోతల్ని ఎంతగానో అలరించటమేగాక ఆ కేసెట్లను టాక్సీల్లోనూ, లారీల్లోనూ టేపు రికార్డుల్లో అమర్చి అసంఖ్యాక అభిమానులు విని ఆనందిస్తున్నారు.

జానపద చిత్రాల విజయానికి ఆ చిత్రాల్లోని హాస్యం పరోక్షంగా దోహదపడిందని నిస్సందేహంగా చెప్పొచ్చు. శివరావు, రేలంగి, రమణారెడ్డి, బాలకృష్ణ, పద్మనాభం, కనకం, రాజబాబు, మీనాకుమారి, సీత, సారథి, వీరంతా హాస్యాన్ని పండిస్తే విఠలాచార్య దెయ్యాలతో వంట చేయించటం, వింత జంతువుల పోరాటాలు, పరకాయ ప్రవేశం, ట్రిక్ ఫొటోగ్రఫితో మాయాజాలం సృష్టించడం ద్వారా ప్రేక్షకులకు వినోదాన్నిందించారు.

ఆనాటి కథానాయికలందరూ (భానుమతి, అంజలిదేవి, సావిత్రి, జమున, జానకి, కృష్ణకుమారి, దేవిక, రాజశ్రీ, వాణిశ్రీ, విజయలక్ష్మి, విజయలలిత) జానపద చిత్రాల్లో ప్రధాన పాత్రలు పోషించినవారే !

జానపద చిత్ర విజయానికి ముఖ్యంగా దోహదం చేసేది ఫొటోగ్రఫి, అవుట్‌డోర్ దృశ్యాలు, పోరాటాలు మాస్క్ మార్కు మాయాజాలం, ఇవన్నీ జాగ్రత్తగా చిత్రీకరించాలి. ఈ విషయంలో మార్కస్ బారెట్లీ (విజయావారి చిత్రాలు)

ఎస్.ఎస్.లాల్ (విఠలాచార్య చిత్రాలు), హెచ్.ఎస్.వేణు (పింజల సుబ్బారావు చిత్రాలు), రవికాంత్ నగాయిచ్ (మహాబలుడు) ముందుగా ప్రశంసించాలి. అలాగే పోరాట దృశ్యాలకు రూపకల్పన చేసిన స్టంట్ మాస్టర్ రాఘవులు, పరమశివన్, శివయ్య, సోము మొదలగువారిని ప్రత్యేకించి పేర్కొనాలి.

జయసింహలోని గండ్రగొడ్డలి యుద్ధం, కాగడాల పోరాటం, గులేబకావళి కథలోని అస్థిపంజరాల పోరాటం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకొన్నాయి.

జానపద చిత్రాల్ని నిశితంగా పరిశీలిస్తే స్వప్నసుందరి (ఘంటసాల బలరామయ్య), పాతాళభైరవి (కె.వి.రెడ్డి), రేచుక్క (పి.పుల్లయ్య), మనోహర (ఎల్.వి.ప్రసాద్), సువర్ణసుందరి (వేదాంతం రాఘవయ్య), సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి (ఎస్.డి.లాల్), పరమానందయ్య శిష్యుల కథ (సి.పుల్లయ్య), కంచుకోట (సి.ఎస్.రావు), గండికోట రహస్యం (విఠలాచార్య), తోటలో పిల్ల - కోటలో రాణి (జి.విశ్వనాధం), భైరవద్వీపం (సింగీతం శ్రీనివాసరావు); ఈ చిత్రాల కథలు, కథాకథన సంవిధానం అద్భుతం అని చెప్పుకోవాలి.

అభివృద్ధిచెందిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. ఈ దిశగా ఆలోచిస్తే 'భైరవద్వీపం'లో గగనమార్గాన కథానాయకుదు వింతపక్షితో పోరాడటం, అద్దాలగదిలో రాక్షసుల వంటి కదిలే యంత్రాలతో కత్తియుద్ధం - ఇవన్నీ విదేశీ చిత్రాల స్థాయిలో రూపొందించారు దర్శకులు సంగీతం శ్రీనివాసరావు. అలాగే ఇంగ్లీషులో వచ్చిన 'బెన్‌హూర్, హెలన్ ఆఫ్ ట్రాయ్, క్లియోపాత్రా' చిత్రాలస్థాయి ఎరీనా సెట్‌ను పద్మాలయా స్టూడియోలో రూపొందించి 'సింహాసనం' చిత్రంలో ఆ సెట్ మీద అద్భుతమైన సన్నివేశాలను చిత్రీకరించారు దర్శకులు కృష్ణ.

తెలుగులో సరాసరి నిర్మించిన జానపద చిత్రాలు దాదాపు 175, ఇతర భాషల నుంచి డబ్బింగ్ అయినవి సుమారు 75, అంటే మొత్తం మీద 250 జానపద చిత్రాలు వచ్చాయి.

ఇప్పట్లో నిర్మాణ వ్యయం పెరిగిన రీత్యా జానపద చిత్రాలు తీయడం రిస్క్ అనిపించడంతో ఆ తరహా చిత్రాలు కనుమరుగయ్యాయని చెప్పుకోవాలి.

❖ ❖ ❖

# సాంఘిక చిత్రాలు

సామాజిక వాతావరణంతో వర్తమాన కాలంలో జరుగుతున్న అంశాలను కథావస్తువులుగా తీసుకొని రూపొందేవి సాంఘిక చిత్రాలుగా వర్గీకరించవచ్చు. 1936లో తొలి సాంఘిక చిత్రం 'ప్రేమ విజయం' విడుదలయ్యింది. దానికి నిర్మాత, దర్శకుడు కృత్తివెంటి నాగేశ్వరరావు. ఆ సినిమా గురించి అంతకుమించిన ఆధారాలు అలభ్యం.

నాటి నుంచి నేటి దాకా దాదాపు ఆరువేల సాంఘిక చిత్రాలు విడుదలయ్యాయి. ఈ చిత్రాలకి ముందుగా నిర్మాత ఒక కథను ఎంపిక చేసుకొని, దర్శకుని నిర్ణయించుకుంటారు. తరువాత వారిద్దరు ఆ కథకు తగ్గ సంభాషణల రచయితను, గీత రచయితను ఎంపిక చేసుకుంటారు. ఆ తరువాత పాత్రధారుల ఎంపిక జరుగుతుంది. ఇక సినిమా నిర్మాణానికి అవసరమైన సాంకేతిక నిపుణులను అంటే కెమెరామెన్, ఎడిటర్, మేకప్‌మాన్, స్టంట్‌మాస్టర్, ఆర్ట్ డైరెక్టర్ మొదలగు వారిని నియమించుకొని, చిత్ర నిర్మాణాన్ని కొనసాగిస్తారు. వారిని గూర్చి రేఖామాత్రంగా తెలుసుకోవడానికి ముందుగా సాంఘిక చిత్రాలను రేఖామాత్రంగా పరిశీలిద్దాం. ఈ సాంఘిక చిత్రాలను పలు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. సామాజిక, సందేశాత్మక, కుటుంబ కథా చిత్రాలు
2. కళాత్మక చిత్రాలు
3. మహిళాభ్యుదయ చిత్రాలు
4. బాలల చిత్రాలు
5. నవలా, నాటక చిత్రాలు
6. హాస్య చిత్రాలు
7. విప్లవాత్మక చిత్రాలు
8. జేమ్స్‌బాండ్, కౌబాయ్, ఫ్యాక్షన్ తరహా చిత్రాలు
9. అనువాద చిత్రాలు

## సామాజిక, సందేశాత్మక, కుటుంబ కథా చిత్రాలు

1938లో వచ్చిన రెండు సాంఘిక చిత్రాలతో సాంఘిక చిత్రాల నిర్మాణం ప్రారంభమైందని చెప్పాలి. ఆ రెండు కూడా సామాజిక, సందేశాత్మక చిత్రాలే. మొదటిది టాకీ పితామహుడు హెచ్.ఎమ్.రెడ్డి స్వీయదర్శకత్వంలో నిర్మించిన 'గృహలక్ష్మి'. 'రంగూన్‌రౌడి' నాటకం ఆధారంగా రూపొందిన ఈ చిత్రానికి బి.ఎన్.రెడ్డి, సముద్రాల రాఘవాచార్య, తెర వెనుక కృషి చేయగా కన్నాంబ, రామానుజాచారి ప్రధాన పాత్రలు పోషించగా, ఈ చిత్రం ద్వారా సినీరంగానికి పరిచయమయ్యారు నాగయ్య. తాగుడుకు బానిసైన భర్త వల్ల కుటుంబానికి ఏ విధంగా హాని జరిగింది. ఆ కారణంగా భార్య ఏ విధంగా రోడ్డున పడి ఇబ్బందులు అనుభవించింది చూపించారు. తాగుడు వ్యసనాన్ని మానమని నాగయ్య సమాజానికి హితవు చెబుతూ - గానం చేసిన 'కల్లు మానండోయ్ బాబూ, కళ్లు తెరవండోయ్..' అన్న ప్రబోధగీతం ఎంతగానో ప్రాచుర్యం పొందింది.

సారధి పతాకంపై గూడవల్లి రామబ్రహ్మం దర్శకత్వంలో రూపొందిన 'మాలపిల్ల' చిత్రం ఎంతగానో సంచలనాన్ని సృష్టించింది. సమాజంలో చైతన్యాన్ని తీసుకురావడం కోసం ఉన్నత బ్రాహ్మణుల కుటుంబానికి చెందిన యువకుడు మాలపిల్లను ప్రేమించి పెళ్ళి చేసుకోవడం, అది గిట్టని కథానాయకుని తండ్రి ఆంక్షలు విధించడం, చివరికి మనసు మార్చుకొని కోడలను కుటుంబంలోకి ఆహ్వానించడంతో కథ సుఖాంతం అవుతుంది. హరిజనులకు ఆలయ ప్రవేశం అనే అంశం కూడా కథలో ప్రధాన ఘట్టం కావడంతో, ఆ రోజుల్లో ఒక వైపు విమర్శలు, మరోవైపు ప్రశంసలు లభించాయి. ఏమైనా కులాంతర వివాహాలను ప్రోత్సహిస్తూ - ఆ దిశగా సమాజంలో చైతన్యాన్ని దోహదం చేసిన చిత్రం 'మాలపిల్ల'.

వాహిని పతాకంపై నిర్మాత, దర్శకుడు బి.ఎన్.రెడ్డి రూపొందించిన చిత్రత్రయం 'వందేమాతరం' (1939), 'సుమంగళి' (1940), 'దేవత' (1941) ఈ మూడింటిలో సామాజిక చైతన్యం అంతర్లీనంగా ఉంది. విధవా పునర్వివాహం 'సుమంగళి' చిత్రంలోని ప్రధాన అంశం. ఆ రోజుల్లో గురజాడ, కందుకూరి చూపిన మార్గంలో ఈ చిత్ర కథ రూపొందింది. అయితే ఇదే తరహా కథాంశంతో

వై.వి.రావు రూపొందించిన 'మళ్ళీ పెళ్ళి' చిత్రం ఘన విజయాన్ని సాధించింది. అందులో నాటి సౌందర్యరాశి కాంచనమాల, వై.వి.రావు ప్రధాన పాత్రలు పోషించారు.

1945లో వాహిని సంస్థ బి.ఎన్.రెడ్డి దర్శకత్వంలో రూపొందించిన 'స్వర్గసీమ' చిత్రం ఓ సంచలనాన్ని సృష్టించింది. ఒక సామాన్య రచయిత, మరో సామాన్య నటి అభివృద్ధికి సహకరించి ఆమెతో అక్రమ సంబంధం పెట్టుకొని కుటుంబాన్ని విస్మరిస్తాడు. ఆ నటి ఉన్నత శిఖరాలకు చేరుకున్నాక, మరొకరినితో సంబంధం పెట్టుకొని కథానాయకుడిని విస్మరిస్తుంది. కనువిప్పు కలిగిన కథానాయకుడు మూర్తి గృహమే స్వర్గ సీమ అని గుర్తించి భార్య, బిడ్డలకు చేరువవుతాడు. నాగయ్య, భానుమతి, జయమ్మ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రంలోని 'ఓహోహో పావురమా..' (భానుమతి గానం, అభినయం) ఎంతో సంచలనాన్ని సృష్టించింది. ఈ చిత్రం ద్వారానే సినీరంగానికి గాయకునిగా పరిచయమయ్యారు ఘంటసాల వెంకటేశ్వరరావు.

1946లో ఎల్.వి.ప్రసాద్ దర్శకత్వంలో సారధి సంస్థ తీసిన సంచలన చిత్రం 'గృహప్రవేశం'. ఎల్.వి.ప్రసాద్ హీరోగా, భానుమతి కథానాయికగా నటించారు. మహిళాద్వేషి అయిన కథానాయకుణ్ణి తనవైపు తిప్పుకొని అతన్ని పెళ్లాడి, గృహస్థాశ్రమం స్వీకరించేలా చేస్తుంది కథానాయిక. బ్యాడ్మింటెన్ ఆడుతూ మహిళా సంఘాల ద్వారా సమాజంలో మార్పు కోసం మహిళల అభ్యుదయం కోసం తపించిన కథానాయికగా భానుమతి నటన ప్రశంసనీయం.

1950లో వచ్చిన రెండు చిత్రాలు సాంఘిక చిత్రాల యొక్క దిశా నిర్దేశాన్ని మార్చి వేశాయి. అవి విజయావారి 'షావుకారు', సాధనవారి 'సంసారం'.

'షావుకారు' ఇరుగు పొరుగు నివసించే రెండు కుటుంబాల కథ. ఎదుటివాని కొడుకుని నీవు కొడితే, నీ కొడుకుని దేవుడు కొడతాడు అనే సందేశంతో సాగిన కథ. చక్రపాణిగారి సంభాషణలు వాడుక భాషలో వుండి కొత్త ఒరవడిని సృష్టించాయి. అలాగే సముద్రాల సీనియర్ రాసిన పాటలకు ఘంటసాల సంగీతాన్ని అందించగా, వాటిని అత్యంత సహజంగా తెరపై చిత్రీకరించారు దర్శకులు

ప్రసాద్. ఎన్.టి.రామారావు, జానకి (ఇదే తొలి చిత్రం కావడంతో షావుకారు జానకిగా పాపులర్ అయ్యారు), శాంతకుమారి, గోవిందరాజుల సుబ్బారావు, శ్రీవాత్సవ, వల్లభజోస్యుల శివరాం, జోగారావు, సీత, ఎస్.వి.రంగారావు ప్రధాన పాత్రలు పోషించారు.

'సంసారం' చిత్రాన్ని మల్టీస్టారర్ చిత్రంగా పేర్కొనాలి. అక్కినేని నాగేశ్వరరావుకు ఇది తొలి సాంఘిక చిత్రం. ఎన్.టి.ఆర్, ఎ.ఎన్.ఆర్ అన్నదమ్ములు. అన్న ఒక సామాన్య గుమాస్తా. కుటుంబాన్ని పోషించడం కష్టం కావడంతో ఇల్లు వదిలి వెళ్ళిపోతాడు. కుటుంబ బాధ్యత ఇల్లాలిపై పడుతుంది. ఆ భూమికను లక్ష్మీరాజ్యం అత్యంత సహజంగా పోషించారు. ఆమె పిల్లలను కష్టపడి పెంచుతుంది. తమ్ముడు నాగేశ్వరరావును ఓ పట్నపు పిల్ల ప్రేమించి అతన్ని మోడరేట్‌గా మారుస్తుంది. ముందుగా కుటుంబమంతా నిండుగా కలిసి వుండటం, ఆ తరువాత విడిపోవడం, కష్టాలు పడటం, తిరిగి అందరూ కలుసుకోవడంతో కథ సుఖాంతం అవుతుంది. ఈ ఫార్ములాతో తరువాత వందలాది కుటుంబ కథా చిత్రాలు వచ్చాయి. సదాశివబ్రహ్మం రచన, సుసర్ల దక్షిణామూర్తి సంగీతం, ఎల్.వి.ప్రసాద్ దర్శకత్వం చిత్రాన్ని విజయవంతం చేశాయి.

1939లో వరకట్న దురాచారాన్ని నిరసిస్తూ రూపొందిన చిత్రం 'వరవిక్రయం'. కాళ్లకూరి నారాయణరావుగారి నాటకం ఆధారంగా రూపొందిన ఈ చిత్రానికి దర్శకుడు సి.పుల్లయ్య. ఈ చిత్రం ద్వారానే భానుమతి నటిగా సినీరంగ ప్రవేశం చేశారు. వరకట్నపు దురాచారాన్ని నిరసిస్తూ హాస్యపరంగా విజయా సంస్థ రూపొందించిన చిత్రం 'పెళ్లిచేసి చూడు'. అదే సంస్థ నిరుద్యోగం అనే అంశాన్ని ప్రధానంగా తీసుకొని రూపొందించిన చిత్రం 'మిస్సమ్మ'. ఇదే కథాంశాన్ని మరో రూపంలో బాపు-రమణలు తీర్చిదిద్దిన చిత్రం 'పెళ్లి పుస్తకం'.

1953లో భరణి రామకృష్ణ దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'బ్రతుకు తెరువు'. చదువుకున్న కథానాయకుడు ఉద్యోగం దొరక్క కుటుంబాన్ని పోషించాల్సి వచ్చిన పరిస్థితిలో పెళ్ళి కాలేదని అబద్ధమాడి, ఓ కోటీశ్వరుడి దగ్గర ఉద్యోగం సంపాదించడం, అతని కుమార్తె హీరోను ప్రేమించడం, కథానాయకుణ్ణి

వెతుక్కుంటూ ఆ కుటుంబమంతా టౌనుకి రావడం, ఇటు ప్రియురాలికి, అటు కుటుంబానికి మధ్య కథానాయకుడు సంఘర్షణ అనుభవించడం ఇతివృత్తం. నాగేశ్వరరావు, సావిత్రి, రంగారావు ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రంలో, సముద్రాల జూనియర్ వ్రాసిన 'అందమే ఆనందం' గీతాన్ని అటు ఘంటసాల, ఇటు లీల మధురాతిమధురంగా గానం చేశారు. ఈ చిత్రాన్నే తిరిగి 'భార్యాబిడ్డలు'గా తీసినప్పుడు అక్కినేనే హీరోగా నటించడం ఓ విశేషం.

వాహిని సంస్థ కె.బి.రెడ్డి దర్శకత్వంలో రూపొందించిన 'పెద్దమనుషులు'. బి.ఎన్.రెడ్డి దర్శకత్వంలో రూపొందించిన 'బంగారు పాప' చిత్రాలు ఆణిముత్యాలుగా పేర్కొనాలి. సంఘంలో బాధ్యతాయుతమైన ఉన్నత పదవుల్లో ఉన్న పెద్దమనుషులు ఏ విధంగా సమాజాన్ని దోచుకు తింటున్నది కళ్లకు కట్టినట్టుగా చిత్రీకరించిన 'పెద్దమనుషులు' చిత్రం ద్వారా రచయితగా పరిచయమ్యారు డి.వి.నరసరాజు. ఈ చిత్రానికి మూలం 'పిల్లర్స్ ఆఫ్ ది సొసైటీ' అనే ఇంగ్లీష్ నాటకం మాతృక. అలాగే 'సిలాస్ మారినర్' అనే కథ ఆధారంగా రూపొందిన 'బంగారు పాప' చిత్రం ద్వారా రచయితగా పరిచయమయ్యారు పాలగుమ్మి పద్మనాభం. పగ, ప్రేమ ఈ సంఘర్షణలో నలిగిపోయిన కోటయ్యగా అద్భుతంగా నటించారు ఎస్.వి.రంగారావు.

పల్లెటూరి ప్రజల జీవనశైలిని ఆవిష్కరిస్తూ తీసిన చిత్రం 'పల్లెటూరు' ద్వారా దర్శకునిగా పరిచయమయ్యారు తాతినేని ప్రకాశరావు. పల్లెటూరులో ఉండే ఆప్యాయతలు, అనురాగాలు ఒకవైపు, కక్షలు, కార్పాణ్యాలు మరోవైపు, యువకులు ఉత్సాహంతో పాడే గీతాలు, సంక్రాంతి వేడుకలు ఇటువంటి అంశాలు ఈ చిత్రంలో చోటు చేసుకున్నాయి. అలాగే పల్లెటూరు తరహా కథలకు నాంది పలికింది ఈ చిత్రం. శ్రీశ్రీ గీతం 'పొలాలనన్నీ హలాల దున్ని' వేములపల్లి శ్రీకృష్ణ గీతం 'చేయెత్తి జైకొట్టు తెలుగోడా...' ప్రాచుర్యం పొందాయి.

పల్లెటూరి రైతాంగం సమస్యలకు, వ్యవసాయానికి సంబంధించిన సమస్యలు, భూసంస్కరణలు ప్రధాన అంశంగా 1942లో సారథి పతాకంపై రామబ్రహ్మం 'రైతుబిడ్డ' చిత్రం నిర్మించగా, అదే స్ఫూర్తితో అదే సారథి సంస్థ 1955లో రూపొందించిన 'రోజులు మారాయి' సంచలన విజయాన్ని సాధించింది. రైతుల, జమీందారుల బంధాన్ని విశ్లేషించిన మరో చిత్రం 'నమ్మినబంటు'.

అన్నపూర్ణ సంస్థ నిర్మించిన 'దొంగరాముడు', 'తోడికోడళ్లు', 'మాంగల్యబలం', 'వెలుగు నీడలు', 'ఇద్దరు మిత్రులు' మొదలైనవి, ఎన్.టి.రామారావు రూపొందించిన 'ఉమ్మడి కుటుంబం', 'తల్లా - పెళ్లామా', 'కోడలు దిద్దిన కాపురం', సారథివారు రూపొందించిన 'కుంకుమరేఖ', 'భాగ్యదేవత', 'కులదైవం', 'కలిసి ఉంటే కలదు సుఖం', 'ఆత్మబంధువు', సుందర్‌లాల్ నెహతా డూండీ నిర్మించిన 'మంచి మనసుకు మంచిరోజులు', 'శభాష్ రాజా', 'శాంతినివాసం', 'గుడిగంటలు'; కె.బి.తిలక్ తీసిన 'అత్తా ఒకింటి కోడలే', 'ఎమ్.ఎల్.ఎ', 'ఉయ్యాలా - జంపాలా'; సాధన సంస్థ తీసిన 'సంతానం', 'సంకల్పం', 'తోబుట్టువులు'; జగపతి సంస్థ రూపొందించిన 'అన్నపూర్ణ', 'ఆరాధన', 'అంతస్తులు', 'ఆస్తిపరుడు'; సురేష్ రామానాయుడు నిర్మించిన 'రాముడు-భీముడు', 'స్త్రీ జన్మ', 'ద్రోహి'; రవీంద్రా ఆర్ట్స్ తీసిన 'లక్షాధికారి', 'జమీందారు', మురళీమోహన్ తీసిన 'వారాలబ్బాయి, ఓ తండ్రి తీర్పు'; ఈ సినిమాలన్నీ కుటుంబ కథా చిత్రాలుగానే పేర్కొనాలి.

నటుడు ఎస్.వి.రంగారావు ఉత్తమ అభిరుచితో స్వీయదర్శకత్వంలో రెండు చిత్రాలు రూపొందించారు. అవి 'చదరంగం', 'బాంధవ్యాలు'. అతి సున్నితమైన కుటుంబ సమస్యలు, అత్యంత సమర్థవంతంగా తెరపై ఆవిష్కరించారు రంగారావు.

ఇక సిస్టర్ సెంటిమెంట్‌తో రూపొంది విజయవంతమైన చిత్రాలు 'రక్త సంబంధం', 'బంగారుగాజులు', 'ఆడపడుచు', 'పూలరంగడు'.

నిర్మాత రాఘవ ప్రతాప్ ఆర్ట్ పతాకంపై ఎందరెందరో కొత్త దర్శకులను పరిచయం చేస్తూ - కుటుంబ కథా చిత్రాలను నిర్మించారు. వాటిలో చెప్పుకోదగ్గవి 'తాతా-మనవడు' (దాసరి నారాయణరావు), 'చదువు సంస్కారం' (రాజశ్రీ), 'ఇంట్లో రామయ్య - వీధిలో కృష్ణయ్య' (కోడి రామకృష్ణ), 'ఈ ప్రశ్నకు బదులేది' (ఆదిత్య), 'అంకితం' (ఈశ్వరరావు).

నిర్మాత అశ్వినీదత్ (అగ్నిపర్వతం, జగదేకవీరుడు - అతిలోకసుందరి); మురారి (సీతామాలక్ష్మి, త్రిశూలం); విలక్షణ చిత్రాలను నిర్మించారు.

✣ ✣ ✣

## కళాత్మక చిత్రాలు

చిత్ర నిర్మాణం వ్యాపారాత్మకమైనది. అందులో కళ అంతర్లీనమై ఉంటుంది. అయితే కళాత్మక విలువలకు ప్రాధాన్యత ఇచ్చి, వ్యాపార దృష్టిని కొద్దిపాటి దూరంగా వుంచి, అంటే జన సామాన్యపు ఆకర్షణకు అంతగా ప్రాధాన్యత లేకుండా, హృదయాలకు హత్తుకొని కలకాలం ప్రేక్షకుల మనస్సుల్లో చిరంజీవులుగా మిగిలిపోయిన చిత్రాలను ఈ వర్గం కింద ఉదహరించవచ్చు. సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, శిల్పం ఇటువంటి లలిత కళలకు కళాత్మక చిత్రాలలో ప్రాధాన్యత ఉంటుంది. వీటిల్లోని ఒకటి లేదా రెండు అంశాలు ఆలంబనగా చిత్రకథను రూపొందించుకుంటారు.

ఈ తరహా కళాత్మక చిత్రాలలో ప్రధమ తాంబూలం 1951లో విడుదలయిన వాహిని వారి 'మల్లీశ్వరి' చిత్రానికి దక్కుతుంది. చేనేత వృత్తుల కుటుంబం, ఆ కుటుంబానికి చెందిన సంగీత నృత్యాలు తెలిసిన కథానాయిక, శిల్ప కళ తెలిసిన కథానాయకుడు, వారి ఇరువురి ప్రణయగాథ, ఎడబాటు, శ్రీకృష్ణదేవరాయల కళా ప్రియత్వం - వీటి నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రాన్ని మహోన్నత కళాఖండంగా సినీపండిత ప్రకాండులు, విమర్శకులు గుర్తించారు. ఎస్.రాజేశ్వరరావు సమకూర్చిన సంగీతం, భానుమతి నృత్యాభినయం, ఎన్.టి.ఆర్ విషాదభావాలు, రాయల నాటి భవన సంపదను కళ్లకు కట్టునట్టు సెట్సు రూపొందించిన కళా దర్శకుడు శేఖర్, ఉదాత్త సాహిత్యాన్ని అందించిన దేవులపల్లి కృష్ణశాస్త్రి; వీరందరి కృషిని తెరపై అద్భుతంగా ఆవిష్కరించిన పద్మభూషణుడు బి.ఎన్.రెడ్డి చిరస్మరణీయులు.

1954లో వచ్చిన సంగీతభరిత చిత్రం 'అమరసందేశం'. దర్శకునిగా ఆదుర్తి సుబ్బారావుకు ఇది తొలి చిత్రం. శారదా సంగీత పీఠంతో ముడిపడిన కథ. పతాక సన్నివేశంలో తండ్రీ, కొడుకులిద్దరు సంగీతంలో పోటీ పడటం, కుమారుని చేతిలో తండ్రి పరాజితుడవడం ప్రేక్షకుల్ని కదిలించింది. ఈ చిత్రంలో ఎ.ఎమ్.రాజా గాయకునిగా తన ప్రతిభను ప్రదర్శించారు.

1959లో పి.పుల్లయ్య దర్శకత్వంలో వచ్చిన సంగీతభరిత చిత్రం 'జయభేరి'. ఈ చిత్ర కథ కూడా శారదా పీఠానికి చెందినదే. సంగీత కళాకారుని యొక్క ఉత్థాన పతనాలు చిత్ర కథాంశం. కళకు ఉన్నత కులం, నిమ్న జాతి అనే తేడాలు లేవని, కళాకారులంతా దైవాంశ సంభూతులని, దేవాలయ దర్శనానికి అందరూ అర్హులేనని, అందుకు ఉదాహరణగా నందుని చరిత్రను కథానాయకుడు వివరించి, నిమ్న కులాల వారికి ఆలయ ప్రవేశం కల్పించడం కథాంశంలోని ముఖ్య ఘట్టం. పెండ్యాల నాగేశ్వరరావు స్వరపరచిన మల్లాది గీతం 'రసికరాజు తగువారము కామా' అటు నాగేశ్వరరావు అభినయ ప్రతిభకు, ఘంటసాల సుమధుర గానానికి మెచ్చు తునక.

కళాతపస్వి కె.విశ్వనాథ్ తెలుపు, నలుపు చిత్రాలను దాటి రంగుల ప్రపంచంలోకి వచ్చాక రూపొందించినవి అధిక భాగం కళాత్మక చిత్రాలుగా పేరొందినవే. మూగ కథానాయిక అద్భుత నృత్యాన్ని ప్రదర్శించిన చిత్రం 'సిరిసిరిమువ్వ', ఉదాత్త సంగీతమే ప్రాణంగా రూపొందిన చిత్రం 'శంకరాభరణం', నృత్య ప్రధానంగా సాగిన 'సాగరసంగమం', 'స్వర్ణ కమలం'– కళాత్మక చిత్రాలుగా పది కాలాలపాటు నిలిచిపోతాయి.

దాసరి నారాయణరావు దర్శకత్వంలో రూపొందిన 'తూర్పు–పడమర' సంగీత ప్రధానమైన చిత్రమే. ఆయనే రూపొందించిన మరో మహోదాత్త చిత్రం 'మేఘసందేశం'. కవిత్వానికి, నృత్యానికి గల అవినాభావ సంబంధాన్ని ఉన్నత విలువలతో ఆవిష్కరించిన ఈ చిత్రంలో అక్కినేని, జయప్రద, జయసుధల అభినయంతో పాటు, రమేష్‌నాయుడు సంగీతం, జేసుదాసు గీతాలు చిత్రాన్ని ఉన్నత స్థాయిలో నిలబెట్టాయి.

ఉషాకిరణ్ అధినేత రామోజీరావు, సంగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో రూపొందించిన 'మయూరి' చిత్రంలో కృత్రిమ కాలుతో సహజంగా నటి సుధ నృత్య వైభవం ప్రేక్షకులని కట్టిపడేసింది.

జంధ్యాల తీర్చిదిద్దిన నృత్య సంగీత ప్రధాన చిత్రం 'ఆనందభైరవి'.

శిల్ప కళకు ప్రాధాన్యం ఇచ్చి బి.ఎస్.రంగా స్వీయదర్శకత్వంలో తీసిన చిత్రం 'అమరశిల్పి జక్కన్న'. ఇందులో కూడా నృత్య, సంగీతాలు పోటీ పడ్డాయి.

❖ ❖ ❖

## మహిళా చిత్రాలు

మహిళా పాత్రలకు ప్రాధాన్యం ఇచ్చి, వారి సమస్యలను హృదయాలకు హత్తుకొనేలా చిత్రీకరించిన సినిమాలను ఈ వర్గీకరణ కింద పరామర్శిద్దాం.

'స్వర్గసీమ'లోని సుజాత పాత్ర ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందిన మహామహిళ. 'మేడమ్' అని గౌరవంగా ఇండస్ట్రీలో అందరిచే పిలిపించుకున్న ఏకైక నటీమణి భానుమతి. ఒక రచయిత్రిగా భానుమతి 'చండీరాణి' చిత్రానికి కథను వ్రాసి, తొలిసారిగా ద్విపాత్రాభినయం చేసి, దర్శకత్వ పగ్గాలు చేపట్టిన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఒక్క దర్శకత్వమే కాక పలు చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించి, తాను నటించిన ప్రతి చిత్రంలో ఓ సంప్రదాయ కీర్తనకు చోటిచ్చిన విద్వాంసురాలు. ఎన్నో వైవిధ్య పాత్రలు ధరించిన భానుమతి, నట జీవితంలో 'బాటసారి' చిత్రంలోని మాధవి, మరపురాని, ఎన్నదగిన పాత్ర. కన్నాంబ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'చండిక'. ఎస్.వరలక్ష్మి చిత్రం 'బాలరాజు'.

మహిళా చిత్రాలు నిర్మించటంలో, స్త్రీలలోని ఔన్నత్యాన్ని వెలికితీయటంలో ప్రసిద్ధులు, కె.విశ్వనాథ్. వీరు రూపొందించిన 'ఓ సీతకథ'లో రోజారమణి ఆత్మవిశ్వాసంతో ఏ వ్యక్తి వలన తాను అవమానింపబడిందో ఆ వ్యక్తికే మారుతల్లిగా, వయసుకు మించిన పెద్దరికాన్ని తెచ్చిపెట్టుకొని ఆ వ్యక్తిని మార్చి, కుటుంబాన్ని తీర్చిదిద్దిన యువతి.

'సిరి సిరి మువ్వ'లో మూగపిల్ల హేమ (జయప్రద) తన మనోవేదన మువ్వలతోనూ, నాట్యంతోనూ మరచిపోయి, సాంబని సాయంతో ఆ కళలో ప్రావీణ్యం పొంది, చివరకు అతన్ని పెళ్ళాడుతుంది. 'సాగరసంగమం'లో మాధవి (జయప్రద) అపురూపం, అనిర్వచనీయమైన సాన్నిహిత్యం, సేవా, ఆరాధన మొదలైన అనేక షేడ్స్ ఉన్న పాత్ర. ఈ పాత్ర రూపకల్పనలో విశ్వనాథవారి ప్రతిభ, అభినయంలో జయప్రద సత్తా నిరూపితమైనాయి.

'స్వాతిముత్యం'లో లలితమ్మ (రాధిక) వితంతువుగా, అమాయకంగా తాళికట్టిన బాలూకు, తన కన్నకొడుకుకు బుద్ధిలో భేదం లేదని గ్రహించి, కొడుకుతో సమంగా రెండవభర్తను లాలించి, ప్రేమించి జీవితాన్ని పండించుకుటుంది.

ఇంకా 'శృతిలయలు'లో సీత (సుమలత), 'శుభసంకల్పం'లో సీతాలు (ఆమని), 'సిరివెన్నెల'లో సుహాసిని, మున్మున్‌సేన్, ప్రాచీన కళల ప్రాముఖ్యం లేనివని ఆధునికతను అగ్రులు చాచే మీనాక్షి (భానుప్రియ) 'స్వర్ణకమలం'లోనూ, 'స్వయంకృషి'లోని సీతాలు (విజయశాంతి), తన గురువును అవమానించిన వానిని చంపటానికి వెనుదీయని 'శంకరాభరణం' తులసి (మంజుభార్గవి) కుటుంబశ్రేయస్సు కోసం ప్రాణం త్యాగం చేసే లక్ష్మి (జమున) 'ఉండమ్మా బొట్టుపెడతా'లోనూ, ఇలా ఎన్నో, ఎన్నెన్నో చిత్రాలలో స్త్రీ పాత్రలకు ఎనలేని న్యాయం చేకూర్చినవారు దర్శకులు కె.విశ్వనాథ్.

మహిళా చైతన్యానికి చిరునామా అనదగ్గ వ్యక్తి తమిళ దర్శకుడైన కె.బాలచందర్. ఆయన దర్శకత్వంలో రూపొందిన 'అంతులేని కథ'లోని సరిత (జయప్రద) కుటుంబ బాధ్యతలు మోస్తూ, చెల్లెలు కోసం తన ప్రేమను కూడా వదులుకుంటుంది. పెళ్ళికాని ఉద్యోగినిగా మిగిలిపోయే అమ్మాయిలు మన సమాజంలో కన్పిస్తూనే ఉంటారు. పెద్దలమాటకు విలువనిచ్చి ప్రేమించిన వాడికి దూరంగా ఓ ఏడాది గడపాలనే షరతు అంగీకరించే ప్రేమికురాలు స్వప్న (సరిత) 'మరోచరిత్ర'లో మానసిక, శారీరక హింసలు పెట్టే శాడిస్టు భర్త నుంచి దూరంగా బ్రతుకుతూ, ఆమె కళ్ళ నుంచి కన్నీరు తెప్పించాలని, ఆమెకెంతో ఇష్టమయిన 'మోనాలిసా' చిత్రాన్ని కత్తితో భర్తగాయపరిచినా చలించని సుహాసిని (జయసుధ) 'ఇదికథ కాదు', తనను నిచ్చెనగా వాడుకొని ఉన్నతంగా, గాయకునిగా ఎదిగిన వ్యక్తిని క్షమించే మనసున్న కోకిలమ్మ (సరిత). ఆడవాళ్లలో ఉన్న లక్షణాలను వైవిధ్యభరితంగా చిత్రీకరించిన 'ఆడవాళ్లు మీకు జోహార్లు'; గుప్పెడు మనస్సు చిత్రంలో ఒక మాజీ నటీమణి హృదయస్పందన, రచయిత్రి, సెన్సార్ ఆఫీసర్ అయిన సుజాత ఏ విషయంలో అయితే అభ్యంతరం చెబుతుందో, అదే సంఘటన తన ఇంటిలో చోటుచేసుకోవడంతో తన అభ్యంతరాన్ని ఉపసంహరించుకుంటుంది. ఒక రచయిత్రికి, సామాన్య గృహిణికి మధ్య నలిగే సంఘర్షణ ఎంతో హృద్యంగా చిత్రీకరించారు, దర్శకులు కె.బాలచందర్.

మహిళల సమస్యల పట్ల, వారి హృదయ స్పందనలను ఆవిష్కరించే దిశగా చిత్రాలు రూపొందించిన మరో దర్శకులు దర్శకరత్న దాసరి నారాయణరావు.

స్వర్గం లాంటి ఇంటిని, భర్తను నరకంగా మార్చుకొన్న యువతిని, నరకంలాంటి ఇంటిని, వ్యసనపరుడైన భర్తను తనకు అనుకూలంగా మార్చుకున్న స్త్రీ వైనాన్ని 'స్వర్గం-నరకం' చిత్రంలో జయలక్ష్మి, అన్నపూర్ణ పోషించిన పరస్పర విరుద్ధమైన పాత్రల ద్వారా తెలియజేశారు. స్త్రీలకు సహజమైన భర్తల ముచ్చట్లు ఒకరితో ఒకరు పంచుకుని ఇంట్లో జరిగే సంఘర్షణలు 'శ్రీవారి ముచ్చట్లు'లోనూ, అప్రాప్తమనోహరి కోసం తపించే భర్తను, ఆదిశగా వెళ్ళనిచ్చి, చివరిలో అతను తన దగ్గరకు వచ్చినపుడు తపన పడే భార్య (జయసుధ) ఎవరి సాహచర్యం తన జీవనగతిని మార్చిందో అతనితోనే మానసికంగా శారీరకంగా సహగమనం చేసే (జయప్రద) స్త్రీల మనోవైరుధ్యాలను అద్భుతంగా తెరకందించారు 'మేఘసందేశం'లో.

సామాజిక చైతన్యానికి, మహిళా వ్యక్తిత్వానికి ప్రాముఖ్యమిచ్చే దర్శకులు రూపొందించిన మరికొన్ని చిత్రాలను పరికిస్తే....

కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'పదహారేళ్ళవయసు'. ఆ వయసులో ఆడపిల్ల భావాలు, ఆ వయసుదాటిన తరువాత పరిణతి చెందిన స్త్రీ ఎలా ప్రవర్తిస్తుందో, ఎంతో చక్కగా చిత్రీకరించారు. శ్రీదేవి అంత చక్కగాను నటించి, మెప్పించింది. 18 సంవత్సరాలకే, నూరేళ్ళు నిండుతాయన్న నిజం తెలుసుకున్న కథానాయిక, ప్రేమించినవాడిని కాదని, ఓ కుటుంబాన్ని చక్కదిద్దటానికి వయసు మళ్ళిన వాడిని భర్తగా చేపట్టిన 'జ్యోతి'గా జయసుధను, వితంతువుగా, పరిస్థితుల రీత్యా నటించవలసి వచ్చి, ప్రియుని ప్రేమను పొందలేని స్త్రీగా కల్పనలో 'జయచిత్ర'ను, 'ప్రేమలేఖలు'లో ఒకరిని ప్రేమించి, అతడు మంచివాడు కాదని తెలిశాక, ఒక గుణవంతునితో పెండ్లి జరిగాక, పాత ప్రియుడు పెట్టే హింసలు మౌనంగా భరించే జయసుధ. ఇలా ఎన్నెన్నో ప్రవృత్తులకు చెందిన దృశ్యాలు ఎంతో అందంగా చూపటమేకాక మహిళాచైతన్యానికి కృషి చేశారు.

వ్యక్తిత్వాన్ని సూచించే 'ముత్యాలముగ్గు', సీత భర్త దూరమైనా, అనుమానం తీరి అతను తన దగ్గరకు వచ్చే వరకూ ఎదురుచూచే వనిత. చుట్టు చీకటి నిండిన ప్రపంచంలో గోరంత వెలుగు అనే ఆశతో బ్రతకాలని తెలియచెబుతుంది. 'గోరంతదీపం'లో నాయిక వాణిశ్రీ. భర్తకు ఉద్యోగం లేనపుడు భార్య

కుటుంబపగ్గాలు చేపట్టి ఎలా సమర్ధవంతంగా నడుపుతుందో 'మిస్టర్ పెళ్ళాం'గా ఆమని, భార్యాభర్తలు కుటుంబ అప్పులకోసం, పెళ్ళికానివారిగా నాటకం ఆడినా చివరకు వివాహబంధం గొప్పతనాన్ని 'పెళ్ళిపుస్తకం'లో దివ్యవాణి ద్వారా అందంగా ఆవిష్కరించిన బాపుగారి భావుకత అద్భుతం.

నిర్మాత క్రాంతికుమార్, దర్శకత్వంలోని 'స్వాతి'లో సుహాసిని తన తల్లికి రెండవ పెళ్ళి చేయటానికి సిద్ధపడితే, భర్తకు వైద్యం చేయించటానికి దారిలేక సరోగేట్‌మదర్ (తన గర్భంలో వేరే వాళ్ళ బిడ్డను మోయటం)గా '9 నెలలు' చిత్రంలో సౌందర్య చెప్పుకోదగినవి. ఇలా చాలా చిత్రాలలో పాత్రల ద్వారా సమాజంలోని సహజ పాత్రలను తెరకు అనువదించారు కనుక అవి విజయం సాధించాయి.

టి.కృష్ణ వద్ద దర్శకత్వశాఖలో పనిచేసిన ముత్యాల సుబ్బయ్య దర్శకునిగా మారినతరువాత మహిళా సమస్యలకు ప్రాధాన్యం ఇస్తూ రూపొందించిన చిత్రాలు 'అరుణకిరణం', 'కలికాలం', 'నవభారతం', 'భారతనారి'.

సంప్రదాయాలకు విరుద్ధంగా ఆడది గడపదాటి వెళితే ఫలితం ఎలా వుంటుందో విశ్లేషించి చూపిన చిత్రం జయసుధ నటించిన 'లక్ష్మణరేఖ' (దర్శకుడు ఎన్.గోపాలకృష్ణ). అందుకు భిన్నంగా ఆడది శక్తిస్వరూపిణిగా మారి దుష్టశక్తులను ఎలా అంతమొందించిందో వివరించిన చిత్రాలు 'మా ఇలవేల్పు' (కె.ఆర్.విజయ), భద్రకాళి (జయప్రద).

ఈనాటి కథానాయికలకు తమ టాలెంట్ ప్రూవ్ చేసుకోగల పాత్రలు లభించకపోవటం ఓ ఎత్తయితే, వరుసగా ఓ పది తెలుగు చిత్రాలయినా హీరోయిన్‌గా నటించకపోవటం ఓ లోపం. ఉన్నవాళ్లలో స్నేహ (రామదాసు), భూమిక (మిస్సమ్మ, మై ఆటోగ్రాఫ్ స్వీట్ మెమోరీస్), అనుష్క (అరుంధతి, వేదం), జెనీలియా (బొమ్మరిల్లు) జ్యోతిక (చంద్రముఖి), లయ (ప్రేమించు), నయనతార (శ్రీరామరాజ్యం) - తమకు లభించిన అవకాశాలను ఉపయోగించుకుని తమ ప్రతిభ నిరూపించుకుంటున్నారు.

❖ ❖ ❖

## బాలల చిత్రాలు

బాలలకు చెందిన అంశాలను, సమస్యలను కథలుగా తీసుకొని లేదా బాల నటులే ప్రధాన పాత్రలు పోషించి కథ నడిపించిన చిత్రాలను బాలల చిత్రాలుగా వర్గీకరించవచ్చు.

1936వ సంవత్సరంలో బాల తారలతో సి.పుల్లయ్య రూపొందించిన చిత్రం 'అనసూయ- ధృవ' ఇందులో రెండు కథలను చిత్రీకరించారు. కృష్ణవేణి అనసూయగాను, గాయని రావు బాలసరస్వతి గంగగాను, జి.ఎన్.స్వామి ధృవునిగాను నటించారు. అప్పటికి వారి వయస్సు పదేళ్లలోపే.

తెలుగులో తొలి టాకీ 'భక్త ప్రహ్లాద' (1931) లో కథానాయకుడు ప్రహ్లాదుని పాత్రను బాల నటుడు మాస్టర్ కృష్ణారావు పోషించారు. 1942లో వచ్చిన 'భక్త ప్రహ్లాద'లో జి.వరలక్ష్మి ప్రహ్లాదునిగా నటించారు. ఇదే కథను 1958లో 'చెంచులక్ష్మి'గా తీసినప్పుడు నటి పుష్పవల్లి కుమారుడు, ప్రముఖ హిందీనటి రేఖ సోదరుడు అయిన మాస్టర్ బాబ్జి పోషించారు. 1967లో ఏ.వి.యం.వారు రంగులలో తీసిన 'భక్త ప్రహ్లాద'లో బేబీ రోజారమణి ఆ పాత్రను పోషించారు.

కె.ఎస్.ప్రకాశరావు నిర్మించిన పూర్తి బాలల చిత్రం 'బాలానందం'. అది మూడు చిన్నకథల (బూరెల మూకుడు, కొంటెకిష్టయ్య, రాజయోగం) సమాహారం. ఇందులో బాలానందం సభ్యులు ముఖ్యంగా కుందు, రేలంగి తనయుడు సత్యనారాయణ బాబు ప్రధానపాత్రలు పోషించారు.

అనుభవమున్న నటుల కంటె మిన్నగా బాలనటుడు సుధాకర్ ద్విపాత్రాభినయం చేసి మెప్పించిన చిత్రం బి.ఏ.సుబ్బారావు తీసిన 'రాజూ-పేద'.

శరత్ నవల 'బిందుగారబ్బాయి' ఆధారంగా తిలక్ తీసిన 'ముద్దుబిడ్డ'లో బాలనటుడే హీరో. ఆ పాత్రను మాస్టర్ వెంకటేష్ చాలా సహజంగా పోషించాడు.

బాలనటుడు మాస్టర్ బాబ్జి బాలనటుడుగా రాణించిన మూడు చిత్రాలు 'చిరంజీవులు', 'సువర్ణసుందరి', 'మామకు తగ్గ అల్లుడు'.

ఎన్.టి.రామారావు నిర్మించిన 'పాండురంగ మాహాత్మ్యం'లో 'హే కృష్ణాముకుందా మురారి' అనే గీతంలో బాలకృష్ణునిగా తళుక్కున మెరిశారు బాలనటిగా విజయనిర్మల.

తెలుగువారి హృదయాల్లో చెరగని ముద్రవేసిన చిత్రం 'లవకుశ' 1934 లోనూ, 1963లోనూ వచ్చిన రెండు చిత్రాలూ సి.పుల్లయ్య దర్శకత్వంలో తయారైనదే ! 1934వ సంవత్సరంలో తెలుపు నలుపుల్లో వచ్చిన చిత్రంలో మాస్టర్ భీమారావు లవునిగాను, మాస్టర్ మల్లీశ్వరరావు కుశునిగాను నటించగా 1963 రంగుల చిత్రంలో ఆ పాత్రలను మాస్టర్ సుబ్రహ్మణ్యం, మాస్టర్ నాగరాజు సమర్థవంతంగా పోషించారు. నేటికీ వారిద్దరూ లవకుశులుగా సన్మానసత్కారాలు అందుకుంటూనే వున్నారు. పిల్లల కోసం బి.ఆర్.పంతులు నిర్మించిన చిత్రం 'పిల్లలు తెచ్చిన చల్లని రాజ్యం'.

దర్శకుడు గుణ్ణం గంగరాజు రూపొందించిన 'లిటిల్ సోల్జర్స్' చిత్రంలో బాల నటుల చేత అద్భుతంగా నటింపజేశారు.

1966లో వచ్చిన 'లేత మనసులు' చిత్రంలో బేబీ కుట్టి పద్మిని ద్విపాత్రాభినయం చేసి ఆ చిత్ర విజయానికి సహకరించారు. వారిపై చిత్రీకరించిన గీతాలు 'పిల్లలూ దేవుడూ చల్లని వారే, కోడి ఒక కోనలో' హిట్ అయ్యాయి.

బాల నేరస్థులకు కనువిప్పు కలిగించే విధంగా అక్కినేని - ఆదుర్తి సంయుక్తంగా నిర్మించిన చిత్రాలు 'సుడిగుండాలు', 'మరో ప్రపంచం'.

అందరూ బాలనటీనటులతో కమలాకర కామేశ్వరరావు రంగులలో అద్భుతంగా రూపొందించిన చిత్రం 'బాల భారతం'. అంతకుముందు పలు చిత్రాలలో (భార్యాబిడ్డలు, బడిపంతులు, శ్రీమంతుడు) బాలనటిగా రాణించిన బేబి శ్రీదేవి ఈ చిత్రంలో దుస్సలగా నటించింది.

ప్రముఖ నిర్మాత ఎమ్.ఎస్.రెడ్డి, గుణశేఖర్ దర్శకత్వంలో అందరూ బాలనటీనటులతో రూపొందించిన చిత్రం 'రామాయణం' ప్రేక్షకుల అభిమానంతో పాటు ప్రభుత్వ పురస్కారం కూడా అందుకుంది.

నంది ఎవార్డులు : 1978వ సంవత్సరం నుంచీ ఉత్తమ బాలచిత్రానికి బాలనటీనటులకు ఆయా చిత్రదర్శకులకు నంది ఎవార్డులు యివ్వటం మొదలుపెట్టింది. ఆ క్రమంలో ఎవార్డు పొందిన చిత్రాల్లో కొన్ని : 'గంగాభవానీ, కొక్కొరొకో, ఛలో ఢిల్లీ, భద్రం కొడుకో, రామాయణం, నందిని, దీక్ష, స్వేతాసెవన్త్ ఎ'; బాలనటీనటులు : బేబీ తులసి, శ్రావణ్‌కుమార్, మాస్టర్ సంతోష్, మాస్టర్ ఆదిత్య, ఉదయ్, ఆనందవర్ధన్, స్వాతి, కృష్ణప్రదీప్, బేబీ నిత్య, సాయి సుధాకర్, జీవా, మహేంద్రన్, రామ్‌తేజ, మయూరి తమ నటనతో ఆ చిత్రాలకు ప్రానం పోశారు. డా.రామానాయుడు నిర్మించిన బాలల చిత్రం 'హరివిల్లు'కు దర్శకత్వం వహించిన బి.నరసింగరావు నంది ఎవార్డు పొందారు.

ఈ పదిహేనేళ్లలో వచ్చిన బాలల చిత్రాల్లో చెప్పుకోదగ్గవి 'కుచ్చికుచ్చి కూనమ్మా', 'లిటిల్‌హార్ట్స్', 'టక్కరిదొంగ', 'దీక్ష', 'ఆశల పల్లెకి' చెప్పుకోదగ్గవి. బాల నటీనటులుగా మాస్టర్ సాయిసుధాకర్, మాస్టర్ మహేంద్రన్, మాస్టర్ కౌశిక్‌బాబు, మాస్టర్ రామ్‌తేజ, ఎన్.శివన్, సన్ని, మాస్టర్ రాఘవ, బేబి జీవా, బేబీ నిత్య, బేబీ శ్వేత, మయూరి, బబిత, జ్యోతి, వర్షిణి, బేబీ శ్రీదివ్య – వీరందరు రాష్ట్ర ప్రభుత్వ నంది పురస్కారాలు అందుకున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహాన్ని పురస్కరించుకొని బాలల చిత్రాలు అంతగా తెలుగులో రూపొందకపోయినా 'అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవం' రాజధాని నగరంలో జరగటం ఆంధ్రులకు ఆనందదాయకం.

బాలల చిత్రాలకు సంబంధించి చెప్పుకోదగ్గ ప్రత్యేక అంశం 2011వ సంవత్సరానికి నంది అవార్డు అందుకున్న 'శిఖరం'. ఈ చిత్రంలోని ముఖ్య కథాంశం నాగరిక ప్రపంచానికి దూరంగా వున్న గిరిజన గ్రామంలోని కొందరు బాలలు అనారోగ్యంతో వున్న ఒక తల్లిని మంచంపై వుంచి కొండలు, కోనలు దాటించి పట్టణం తీసుకెళ్లి ఆమె ప్రాణాలను కాపాడుతారు. చొక్కాపు వెంకటరమణ రచనతో, నాగ్ గొట్టాప్ స్వీయదర్శకత్వంలో రూపొందించిన ఈ చిత్రానికి సంబంధించిన ప్రత్యేక విశేషం - ఇందులో నటించిన 13 మంది బాలనటుల్లో 11 మంది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే జువెనైల్ హోమ్స్ (బాలల సంక్షేమం, సంస్కరణ సేవల శాఖ)లోని బాలలే.

⁘ ⁘ ⁘

## నవలా, నాటక చిత్రాలు

తెలుగులోను, ఇతర భాషల్లోను ప్రాచుర్యం పొందిన నవలలను, నాటకాలను చిత్రాలుగా నిర్మించారు. వాటి గురించి తెలుసుకుందాం.

మొక్కపాటి నర్సింహశాస్త్రి - బారిస్టర్ పార్వతీశం (బారిస్టర్ పార్వతీశం); శరత్‌చంద్ర ఛటర్జీ - రాముని బుద్ధిమంతనం (దీక్ష), దేవదాసు (దేవదాసు), బిందుగారబ్బాయి (ముద్దుబిడ్డ), నిష్కృతి (తోడి కోడళ్లు), బడదీది (బాటసారి), వాగ్దత్త (వాగ్దానం); తారాశంకర బందోపాధ్యాయ - స్వయంసిద్ధ (అర్ధాంగి); ఆశా పూర్ణాదేవి - అగ్నిపరీక్ష (మాంగల్యబలం); కొవ్వలి నరసింహారావు - సిపాయి కూతురు (సిపాయి కూతురు), కోడూరి కౌసల్యాదేవి - చక్రభ్రమణం (డాక్టర్ చక్రవర్తి), ప్రేమనగర్ (ప్రేమనగర్), శంఖుతీర్థం (శంఖుతీర్థం); ద్వివేదుల విశాలాక్షి - వారధి (రెండు కుటుంబాల కథ), మునిపల్లె రాజు - పూజారి (పూజాఫలం); యద్దనపూడి సులోచనారాణి - విజేత (విచిత్ర బంధం), అగ్నిపూలు, బంగారు కలలు, సెక్రటరీ, రాధాకృష్ణ, మీనా, ప్రేమలేఖలు, గిరిజా కళ్యాణం, మధుర స్వప్నం, జీవనతరంగాలు; మాదిరెడ్డి సులోచనాదేవి - ప్రేమలు పెళ్ళిళ్లు, ఈ తరం మనిషి; సి.ఆనందారామం - జ్యోతి; ముప్పాళ్ల రంగనాయకమ్మ - బలిపీఠం; డి.కామేశ్వరి - న్యాయం కావాలి, కోరికలే గుర్రాలైతే; కావలిపాటి విజయలక్ష్మి - విధివిన్యాసాలు (తాసిల్దారుగారి అమ్మాయి); పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి - కౌసల్య (తల్లి తండ్రులు); కొండముది శ్రీరామచంద్రమూర్తి - చిరునవ్వుల మరుసవ్వడి (ఆనందభైరవి); గోపీచంద్ - గృహప్రవేశం; మైనంపాటి భాస్కర్ - వెన్నెల మెట్లు (అరుణ కిరణం); యండమూరి వీరేంద్రనాథ్ - డబ్బు టు ది పవర్ ఆఫ్ డబ్బు (ఛాలెంజ్), రాక్షసుడు, అభిలాష, మరణమృదంగం, వెన్నెల్లో ఆడపిల్ల (హలో ఐ లవ్యూ). ఉన్నవ వెంకట హరగోపాల్ (మానస) - నవ్వినా కన్నీళ్లే (సీతారామయ్యగారి మనవరాలు), బలభద్రపాత్రుని రమణి - రేపల్లెలో రాధ, నీకూ నాకు మధ్య (మధుమాసం), జనార్ధన మహర్షి - గుడి (దేవస్థానం), చంద్రశేఖర ఆజాద్ - ఏక్‌తారా (పాట), జీడిగుంట రామచంద్రమూర్తి - అమెరికా అబ్బాయి, పరుచూరి బ్రదర్స్ -

నల్లపూసలు (కార్తీక పౌర్ణమి), సంభవామి యుగేయుగే (సర్పయాగం); రామలక్ష్మి ఆరుద్ర – ఆడది (జీవనజ్యోతి), పి.శాంతాదేవి (చండీప్రియ, ఇదెక్కడి న్యాయం);

**నాటకాలు :**

కాళ్లకూరి నారాయణరావు – వరవిక్రయం, చింతామణి; గురజాడ అప్పారావు – కన్యాశుల్కం, భమిడిపాటి కామేశ్వరరావు – పెళ్ళి ట్రైనింగ్ (బావా బావా పన్నీరు); కోడూరి సరస్వతి రామారావు – రంగూన్‌రౌడీ (గృహలక్ష్మి); పినిశెట్టి శ్రీరామమూర్తి – పల్లెపడుచు, అన్నాచెల్లెలు (పరివర్తనం); ఆదివిష్ణువు – సత్యంగారి ఇల్లు (అహనా పెళ్లంటా), శివతాండవం (వివాహ భోజనంబు); గొల్లపూడి మారుతిరావు – కళ్లు; సి.ఎస్.రావు – ప్రాణం ఖరీదు, ఊరుమ్మడి బ్రతుకులు; చో – మహ్మద్‌బీన్ తుగ్లక్; కె.బాలచందర్ – సర్వంసుందరం, మేజర్ చంద్రకాంత్ (సుఖదుఃఖాలు); దాసం గోపాలకృష్ణ – చిల్లర కొట్టు చిట్టెమ్మ; భమిడిపాటి రాధాకృష్ణ – ఇదేమిటి (పొట్టి ప్లీడరు); మల్లాది వెంకట కృష్ణమూర్తి– ష్ గప్‌చుప్, విచిత్రం, నీకు నాకు పెళ్ళంటా, చంటబ్బాయి. పరుచూరి బ్రదర్స్– సమాధి కడుతున్నాం చందాలివ్వండి, ఇదుగో ప్రశ్న ఏది జవాబు (అగ్నిపుత్రుడు), మరోభారతం (కలియుగ మహాభారతం), సమస్యా నీకు వందేళ్లు (శ్రీకట్నలీలలు), పరుచూరి గోపాలకృష్ణ – ఈ చరిత్ర ఎర్రసిరాతో (ఈ చరిత్ర ఏ సిరాతో). కాశీవిశ్వనాధ్ – పూజకు పనికిరాని పువ్వు, బంగారులేడి (ఆశల సందడి), పొడికళ్లు తడి మనస్సు (ప్రేమనాటకం), ఎమ్.వి.ఎస్.హరనాధరావు – నాలుగు వారాల మనిషి (సగటు మనిషి), అరణ్యరోదన (ఇదా ప్రపంచం), లేడి చంపిన పులి నెత్తురు (ఎర్రమందారం), ఆకెళ్ళ – వ్యవస్థ (మగమహారాజు). పూసల వెంకటేశ్వరరావు – బ్రహ్మ నీరాత తారుమారు (ప్రేమించి చూడు). షేక్స్పియర్ నాటకం కింగ్‌లియర్ ఆధారంగా పింగళి నాగేంద్రరావు రూపొందించిన కథతో కె.వి.రెడ్డి నిర్మించిన చిత్రం 'గుణసుందరి కథ'.

ఇతర భాషల్లో వచ్చిన నవలల ఆధారంగా కూడా తెలుగులో చిత్రాలు రూపొందాయి. ఇందుకు ఉదాహరణగా తమిళంలో వచ్చిన 'పెన్‌మణం' అనే నవల ఆధారంగా దర్శకులు ప్రత్యగాత్మ రూపొందించిన చిత్రం 'భార్యాభర్తలు'.

✣ ✣ ✣

## హాస్య చిత్రాలు

నవరసాల్లో హాస్యానికి అటు సాహిత్యంలో, ఇటు చిత్రపరిశ్రమలో ఎంతో ప్రాధాన్యం కల్పించారు. మొదట్లో మూకీ చిత్రాలు, పౌరాణిక చిత్రాల్లో హాస్యపాత్రలు తమ అభినయం ద్వారా ప్రేక్షకుల్ని అలరించాయి.

తెలుగు చిత్రపరిశ్రమలో ఉన్నంతమంది హాస్యనటీనటులు, రచయితలు, దర్శకులు మరే చిత్రపరిశ్రమలోను లేరని చెప్పవచ్చు. ఇది తెలుగువారికి గర్వకారణం. రచయిత పింగళి నాగేంద్రరావు చిత్ర కథలోనే అంతర్లీనంగా హాస్యం వుండేలాగా కథను రూపొందించేవారు. ఇందుకు వారి 'పాతాళభైరవి, మాయాబజార్, జగదేకవీరుని కథ' మంచి ఉదాహరణ. చిత్ర హాస్య రచనలో చేయి తిరిగిన రచయితలుగా డి.వి.నరసరాజు, ముళ్లపూడి వెంకటరమణ, భమిడిపాటి రాధాకృష్ణ, గొల్లపూడి మారుతిరావు, జంధ్యాల, అప్పలాచార్య, కాశీ విశ్వనాధ్, సత్యానంద్ - ఇటీవల తరానికి చెందినవారిలో జనార్ధనమహర్షి, వెలుగొండ శ్రీనివాస్ చెప్పుకోదగినవారు. ఇక నాటికి, నేటికి హాస్యగీత రచయితగా కొసరాజు రాఘవయ్య చౌదరి పాత్ర చిరస్మరణీయం. వారి గీతాల్లో హాస్యం, వ్యంగ్యం, చతురోక్తులు, ఛలోక్తులు ఎన్నెన్నో వుండేవి.

దర్శకుల పరంగా ఎల్.వి.ప్రసాద్ ఆహ్లాదకరమైన, ఆరోగ్యవంతమైన హాస్యాన్ని తమ చిత్రాల ద్వారా అందించారు (పెళ్ళిచేసి చూడు, మిస్సమ్మ, అప్పుజేసి పప్పుకూడు). సి.పుల్లయ్యగారి దర్శకత్వంలో రూపొందిన హాస్య చిత్రం 'పక్కింటి అమ్మాయి'. వారే రూపొందించిన హాస్యరస ఫాంటసీ చిత్రం 'దేవాంతకుడు'. దాని స్ఫూర్తితో తాతినేని రామారావు రూపొందించిన చిత్రం 'యమగోల'. పూర్తి హాస్యరస చిత్రాలను అందించడంలో ప్రముఖులుగా చెప్పుకోదగ్గ కొందరు దర్శకులు : వేదాంతం రాఘవయ్య (మామకు తగ్గ అల్లుడు), యోగానంద్ (పెళ్ళిసందడి), కట్టా సుబ్బారావు (మొగుడుకావాలి, వయ్యారి భామలు-వగలమారి భర్తలు), కె.వాసు (పక్కింటి అమ్మాయి, గోపాలరావుగారి అబ్బాయి), ఎమ్.ఎస్.కోటారెడ్డి (సంసారంలో సరిగమలు), రేలంగి నరసింహారావు (కొంటె కాపురం, నేను మా ఆవిడ, ఎదురింటి మొగుడు -పక్కింటి పెళ్ళాం, చలాకి మొగుడు - చాదస్తం పెళ్లాం), బాపు (అందాల రాముడు), ఇ.వి.వి.సత్యనారాయణ

(ఆ ఒక్కటి అడక్కు, ఎవరిగోల వారిది), శివనాగేశ్వరరావు (మనీ, పట్టుకోండి చూద్దాం), వంశీ (లేడీస్ టైలర్, ఏప్రిల్ 1 విడుదల), ఎస్.వి.కృష్ణారెడ్డి (రాజేంద్రుడు-గజేంద్రుడు, యమలీల), సి.ఎస్.రావు (పెళ్లికాని పిల్లలు, జల్సారాయుడు).

జంధ్యాల గురించి హాస్యబ్రహ్మగా ప్రత్యేకించి చెప్పుకోవాలి. దాదాపు 300 చిత్రాలకు రచన చేసిన జంధ్యాల ఓ 40 చిత్రాలకు దర్శకత్వం వహించారు. వాటిల్లో అధికశాతం హాస్య చిత్రాలు. 'మాయాబజార్' చిత్రంలోని పాటల పల్లవులు 'అహనా పెళ్లంట', 'చూపులు కలసిన శుభవేళ', 'వివాహభోజనంబు', 'హైహై నాయకా' వీటిని సినిమా టైటిల్స్‌గా ఎంపిక చేయడం స్పెషాలిటి. 'నాలుగు స్తంభాలాట' చిత్రం ద్వారా వేలు, వీరభద్రరావులను సుత్తి జంటగా పరిచయం చేశారు. 'చంటబ్బాయి' చిత్రంలో మెగాస్టార్ చిరంజీవి చేత హాస్యనటన పండించారు. 'ష్ గప్‌చుప్' చిత్రంలో గీత రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు చేత తిట్ల దండకం వ్రాయించడం ఓ వెరైటీ.

చక్రపాణి 'పెళ్ళి చేసి చూడు', 'మిస్సమ్మ' చిత్రాలకు గిలిగింతలు పెట్టే హాస్య సన్నివేశాలు సృష్టించి, సంభాషణలు వ్రాశారు. ఎస్.వి.కృష్ణారెడ్డి చిత్రాలకు హాస్య రచనలు అందించిన ప్రముఖుడు దివాకరబాబు. 'యమలీల' చిత్రంలో ఐస్‌క్రీమ్‌ను - హిమక్రిములు అని చమత్కరించారు.

ఇక నటీనటుల పరంగా హాస్యాభిషేకం చేసినవారి వివరాలను గమనిస్తే:

చిత్ర విచిత్రమైన సినీ పరిశ్రమలో నటులుగా ప్రవేశించి, కొందరు విలన్‌లుగా, కొందరు హీరోలుగా, హాస్యనటులుగా, సహాయ నటులుగా రాణించారు. అవకాశం వచ్చినప్పుడు విలన్‌లు కథానాయకులుగా, కథానాయకులు విలన్‌లుగా హాస్యనటులు కథానాయకులుగా మెప్పించారు. ప్రేక్షకులికి వీరు తమ నటనలోని మరో కోణాలను వెలుగులోకి తెచ్చి ఓ వెరైటీ సృష్టించారు. సమర్థుడైన నటుడు ఏ పాత్ర ధరించినా కన్పించేది పాత్రే కాని నటులు కాదని నిరూపించుకున్నారు. ప్రేక్షకుల ఆదరాన్ని పొందారు. అదే పంథాలో హాస్యనటులు కథా నాయకులుగా విజయం సాధించిన చిత్రాలను అవలోకిద్దాం.

1934 తర్వాత బొండాంపెళ్లి, చల్‌మోహనరంగా వంటి హాస్య చిత్రాలు వచ్చినా, తొలి తెలుగు హాస్య చిత్రంగా ప్రముఖ రచయిత మొక్కపాటి నరసింహశాస్త్రి రాసిన 'బారిస్టర్ పార్వతీశం' నవల ఆధారంగా నిర్మించబడిన బారిస్టర్ పార్వతీశం సినిమా. నవల ఎంత పాపులర్ అయిందో, ఈ చిత్రం కూడా ప్రేక్షకుల్ని రంజింపజేసింది. ఆ చిత్రంలో పార్వతీశంగా నటించిన లంక సత్యం తొలిసారి తెలుగు హాస్యనటుడు కథానాయకునిగా నటించిన ఖ్యాతిని పొందారు. ఆయనకు జంటగా జి.వరలక్ష్మి నటించారు. వీరిద్దరి కాంబినేషన్‌లో 'చదువుకున్న భార్య' తరువాత నిర్మించబడింది.

1941లో నిర్మించిన 'భలే పెళ్ళి' చిత్రంలో డా.శివరామకృష్ణయ్య, హేమలత నాయక నాయికలుగా నటించారు. పింగళి రచయితగా పరిచయమయ్యారు.

'వరవిక్రయం' ద్వారా హాస్యనటునిగా పరిచయమైన కస్తూరి శివరావు స్టార్ కమెడియన్‌గా పేరు పొందారు. గాయకునిగా, నిర్మాతగా, దర్శకునిగా రాణించారు శివరావు. వాహినివారు 1949లో నిర్మించిన 'గుణసుందరి కథ'లో జూనియర్ శ్రీరంజనితో కలిసి కథానాయకునిగా నటించారు. 1950లో లక్ష్మిరాజ్యం, శివరావు నాయికా నాయకులుగా 'పరమానందయ్య శిష్యులు'లో నటించారు. దీనికి నిర్మాత, దర్శకుడు కస్తూరి శివరావు.

ప్రముఖ హాస్యనటులు రేలంగి వెంకట్రామయ్య ప్రముఖ కథానాయిక అంజలీదేవితో జంటగా 'పక్కింటి అమ్మాయి'లో నటించారు. మహానటి సావిత్రితో కలిసి కథానాయకునిగా 'మామకు తగ్గ అల్లుడు' చిత్రంలో నటించడమే కాక, అందులో ఓ ఆడవేషం కూడా వేసి మెప్పించారు. అంతకుమునుపు 'పాతాళ భైరవి' చిత్రంలో ఓ నృత్య సన్నివేశంలో ఆడవేషంలో కొద్దిసేపు కనిపించారు రేలంగి.

'పాతాళభైరవి' చిత్రంలో డింగరీగా ప్రాచుర్యం పొందిన హాస్యనటుడు పద్మనాభం తొలిసారి వాణిశ్రీ హీరోయిన్‌గా కథానాయకుడిగా 'పొట్టి ప్లీడర్' చిత్రంలో నటించారు. తరువాత 'జాతకరత్న మిడతం బొట్లు', శ్రీశ్రీ మర్యాద రామన్న చిత్రాల్లోనూ, హిందీ చిత్రం కువారా బాప్ ఆధారంగా నిర్మించబడిన

'పెళ్లికాని తండ్రి' చిత్రాల్లో హీరోగా నటించి ప్రశంసలు పొందారు.

మరో హాస్యనటుడు, ఆంధ్రా దిలీప్‌కుమార్‌గా పేరుపొందిన చలం, సూర్యకళతో కలిసి, 1954లో వచ్చిన 'జాతకఫలం' చిత్రంలో హీరోగా నటించారు. 1957లో బి.విఠలాచార్య నిర్మించిన 'వద్దంటే పెళ్లి' చిత్రంలో చలంతోపాటు నాయికగా కృష్ణకుమారి నటించారు. కృష్ణకుమారితోనే హీరోగా 'నిత్యకళ్యాణం - పచ్చతోరణం' చిత్రంలోను, బి.సరోజాదేవితో రెండవ కథానాయకునిగా 'పెళ్లి సందడి' చిత్రంలో నటించారు. తరువాత చలం హీరోగా చాలా చిత్రాలు వచ్చాయి. స్వయంగా చలం రమణాచిత్ర బ్యానర్‌పై కొన్ని హాస్య చిత్రాలు నిర్మించారు. 'బుల్లెమ్మ బుల్లోడు' (విజయనిర్మల, విజయలలిత), 'మట్టిలో మాణిక్యం'లో జమునతో, 'సంబరాల రాంబాబు'లో శారదతో, 'లంబడోళ్ల రాందాసు', 'తోటరాముడు' చిత్రాలలో కథానాయకుడుగా నటించారు. ఇంకా సత్తెకాలపు సత్తెయ్య, పట్టిందల్లా బంగారం వంటి చాలా చిత్రాల్లో హీరోగా నటించారు.

'సమాజం' చిత్రం ద్వారా తెలుగు పరిశ్రమకు పరిచయమైన హాస్యనటుడు రాజబాబు. హాస్యనటునిగా ఎంతో ప్రాముఖ్యం పొందారు కెఎస్‌రెడ్డి దర్శకత్వంలో కథానాయకునిగా 'పిచ్చోడిపెళ్లి', దాసరి నారాయణరావు నిర్దేశకత్వంలో బాబ్ అండ్ బాబ్ క్రియేషన్స్‌పై 'ఎవరికి వారే యమునా తీరే', 'మనిషి రోడ్డున పడ్డాడు', తిరుపతి చిత్రాలలో నటించి మెప్పించారు.

దర్శకుడు జంధ్యాల ద్వారా తెలుగు చిత్రసీమలో ప్రవేశించి హాస్యనటుడిగా తనదైన ముద్ర వేసుకున్నాడు బ్రహ్మానందం. రేలంగి, అల్లురామలింగయ్యతోపాటు పద్మశ్రీ పొందిన హాస్యనటుడీయన. బ్రహ్మానందం, లతాశ్రీ నాయికా నాయకులుగా రూపొందిన చిత్రం 'సరసాల సోగ్గాడు', ఎవిఎస్, బ్రహ్మానందం హీరోలుగా రామానాయుడు నిర్మించిన చిత్రం 'సూపర్ పోలీస్', 'జంధ్యాల దర్శకత్వంలో కిన్నెర నాయికగా, బ్రహ్మానందం నాయకునిగా నటించిన చిత్రం 'బాబాయ్ హోటల్'లో కరుణరసంతో కూడిన కథానాయకునిగా మెప్పించారు. ఇంకా పెళ్ళామా మజాకా, జోకర్ మామ-సూపర్ అల్లుడు చిత్రాల్లో కథానాయకునిగా నటించారు. హాస్యనటునిగానే కాక కథానాయకునిగా ఎక్కువ చిత్రాల్లో నటించిన

ఘనత అలీ కైవసం చేసుకున్నాడు. ఎస్.వి.కృష్ణారెడ్డి దర్శకత్వంలోని యమలీలలో ఇంద్రజతో నాయకునిగా నటించి ఘన విజయం సాధించారు. ఇంకా 'హైక్లాస్ అత్తలోక్లాస్ అల్లుడు, సర్కస్ సత్తిపండు, ఆడాళ్లా మజాకా, అల్లరిపెళ్ళి, ఆషాడం పెళ్ళికొడుకు, చిన్నబ్బులు, అమ్మాయికాపురం, ఆలీబాబా అద్భుతదీపం, పిట్టలదొర, మిస్టర్ మాయగాడు, గన్‌షాట్' మొదలైన చాలాచిత్రాలు, రోజాతో 'ఘటోత్కచుడు' మళ్లీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో హిట్ సాధించిన చిత్రంగా చెప్పుకోవచ్చు.

బాబూమోహన్ కథానాయకునిగా రేలంగి నరసింహారావు దర్శకత్వంలో 'సుందరవదనా – సుబ్బలక్ష్మి మొగుడా'లో నటించారు. కృష్ణభగవాన్, రఘుబాబు కలిసి 'దొంగచచ్చినోళ్లు' రంభతోను, కృష్ణభగవాన్ 'జాన్ అప్పారావు 40+లో' సిమ్రాన్‌తో కథానాయకునిగాను, ఇంకా బ్రహ్మానందం డ్రామా కంపెనీ చిత్రంలో నాయకునిగా నటించారు.

వేణుమాధవ్ హీరోగా హంగామా, సినిమా పిచ్చోళ్లు, భూకైలాస్ (ఎకరం యాభైలక్షలు), ప్రేమాభిషేకం నిర్మించబడ్డాయి. ఆకారం ఎలా వున్నా డాన్సులు, స్టెప్పులు అదరగొట్టే హాస్యనటుడు సునీల్ కథానాయకునిగా, ఆర్తీ అగర్వాల్ కథానాయికగా నిర్మించిన 'అందాలరాముడు' ఫర్వాలేదనిపించింది. ఇండస్ట్రీలో దర్శక మగధీరుడుగా నిరూపించబడిన రాజమౌళి,రాయలసీమ కథాంశంతో ఎంతో క్రియేటివిటీతో సలోని కథానాయికగా నిర్మించి హిట్ చేసిన చిత్రం 'మర్యాదరామన్న'. ఈ చిత్రంలో హీరోగా తన సత్తా నిరూపించుకోవడానికి ఆహార్యంతో సహా కఠిన నియమాలు పాటించి ఆ చిత్ర సక్సెస్‌కు సునీల్ తనవంతు సహకారం అందించడమే కాక రాంగోపాల్‌వర్మలాంటి దర్శకునితో 'కథ స్క్రీన్‌ప్లే, దర్శకత్వం : అప్పలరాజు' అనే మరో వెరైటీ చిత్రంలో నటించారు.

హీరోగా నటించే చంద్రమోహన్, రాజేంద్రప్రసాద్, నరేష్, అల్లరి చిత్రం ద్వారా పాపులర్ అయిన ఇ.వి.వి కుమారుడు అల్లరి నరేష్ అనేక చిత్రాల ద్వారా ప్రేక్షకుల్ని అలరిస్తున్నారు.

మన సినిమాలలో తొలి నుంచి జంట హాస్యం అంటే ఇద్దరు హాస్యనటులు జంటగా హాస్యాన్ని పండించారు. దీనికి స్ఫూర్తి ఇంగ్లీషులోని లారెల్ – హార్డి

జంటగా అందించిన హాస్యమే. తొలిదశలో రేలంగి, గోబేరు సుబ్బారావు (గుణసుందరి కథ), తరువాత నల్లరామ్మూర్తి, సీతారామ్ (పల్లెటూరి పిల్ల), బాలకృష్ణ, పద్మనాభం (పాతాళభైరవి), సుత్తివేలు, వీరభద్రరావు (జంధ్యాల చిత్రాలు).

అదే విధంగా హాస్యజంటలు నవ్వులు పండించిన సందర్భాలు గమనిస్తే- ఒకప్పుడు శివరావు- కనకం, తరువాత రేలంగి-గిరిజ, ఆ తరువాత పద్మనాభం-గీతాంజలి, నిన్నటి తరంలో రాజబాబు-రమాప్రభ, ఇక ఇప్పుడు బ్రహ్మానందం-శ్రీలక్ష్మి, కోవై సరళ, తెలంగాణా శంకుతల - కొండవలస లక్ష్మణరావు చెప్పుకోదగ్గ హాస్యజంటలు. ప్రధాన విలన్స్ పక్కన చెవిలో జోరీగలాగ హాస్యాన్ని విలనీతో రంగరించి సన్నివేశాలను పండించారు అల్లు రామలింగయ్య.

హాస్య పాత్రలపై చిత్రీకరించిన గీతాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. 'వినవే బాల నా ప్రేమ గోల.. (పాతాళభైరవి)', 'సుందరి నీవంటి దివ్య స్వరూపం... (మాయాబజార్)', 'ఏరా మనతోటి గెలిచేటి వీరులెవ్వరురా... (సువర్ణసుందరి)', 'పొరిగింటి మీనాక్షమ్మను చూశారా... (సంబరాల రాంబాబు), 'వినరా సూరమ్మకూతురు మొగుడా.... (ఇల్లు-ఇల్లాలు)', 'భద్రం బీకేర్ ఫుల్ బ్రదరు..., వారెవా ఏమి ఫేసు... (మనీ)', 'ముత్యాలు వస్తావా... (మనుషులంతా ఒక్కటే)', 'చూచి కళ్ళు కాయలే కాచాయి...., కనకమా చిట్టి కనకమా.... (భార్యాభర్తలు), 'నా మనసే గోదారి - నీ మనసే కావేరి... (అదృష్టవంతులు)', 'బావా బావా పన్నీరు... (పాండవ వనవాసం)', 'ఆశ ఏకాశ.... (జగదేకవీరునికథ)', 'కాశీకి పోయాను రామాహరి... (అప్పుచేసి పప్పుకూడు)', 'చెక్కిలిమీద చెయ్యివేసి చిన్నదాన....(మాంగల్యబలం)'. చెప్పుకోదగ్గ విశేషం ఏమిటంటే హాస్యగీతాలు ఆలపించడంలో మాధవపెద్ది సత్యం, పిఠాపురం నాగేశ్వరరావు ప్రముఖులైనప్పటికీ ఘంటసాల కొన్నింటిని పాడటం విశేషం. 'ఎవడిగోల వాడిది'లో హాస్యనటులపై పేరడీగీతాలను చిత్రీకరించారు.

ముగ్గురు హాస్యనటులకు (రేలంగి, అల్లు రామలింగయ్య, బ్రహ్మానందం) పద్మశ్రీ పురస్కారం లభించడం తెలుగుసినిమాకు గర్వకారణం.

❖ ❖ ❖

## విప్లవాత్మక, చైతన్య చిత్రాలు

బడుగు, బలహీన వర్గాలు, కూలీ నాలీ చేసుకొనే బ్రతికే సామాన్యులు, కార్ఖానాల్లోను, పరిశ్రమల్లోను, గనుల్లోను జీవనోపాధి కోసం పని చేసే శ్రామిక జీవులు, శ్రమకు తగ్గ ఫలితాన్ని పొందక నిరాశ నీడలో జీవించే రైతు కూలీల అగచాట్లు - ఈ తరహా బాధలన్నింటికీ వెండితెరపై రూపాన్నిచ్చి, సమాజాన్ని చైతన్య పరచడానికి, బూర్జువా పెత్తందారి వర్గాల నుంచి శ్రామిక జీవులను ఉద్ధరించడానికి సినిమా మీడియాను చక్కగా ఉపయోగించుకున్న వ్యక్తి - వన్ మాన్ ఆర్మీగా పేరొందిన ఆర్.నారాయణమూర్తి. ఆయన తొలి చిత్రం 'అర్ధరాత్రి స్వతంత్రం'. దానికి ఆయనే కథకుడు, నిర్మాత, దర్శకుడు మరియు ప్రధాన పాత్రధారి. ఆయన రూపొందించిన ఇతర చిత్రాలు 'ఆలోచించండి', 'భూపోరాటం', 'అడవి దివిటీలు', 'స్వతంత్ర భారతం', 'లాల్ సలామ్', 'దండోరా', 'ఎర్రసైన్యం', 'ఒరేయ్ రిక్షా', 'చీమలదండు', 'దళం', 'చీకటి సూర్యుడు', 'కూలన్న', 'రైతురాజ్యం', 'చెలో అసెంబ్లీ', 'ఊరు మనదిరా', 'వేగుచుక్కలు', 'గంగమ్మ జాతర', 'అమ్మ మీద ఒట్టు', 'పీపుల్స్‌వార్'.

నారాయణమూర్తి టీమ్‌లో రచయితలు వంగపండు ప్రసాదరావు, సుద్దాల అశోక్‌తేజ, సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాసరావు, ప్రజా గాయకుడు గద్దర్, నటుడు నర్రా వెంకటేశ్వరరావు కీలకపాత్ర పోషించేవారు. 'ఒరేయ్ రిక్షా' అఖండ విజయాన్ని సాధించింది. ఆ లాభాల్లో కొంత భాగాన్ని రిక్షా కార్మికుల సంక్షేమానికి అందించి, వారిని ఆదుకున్న ఉదారశీలి ఆర్.నారాయణమూర్తి.

నారాయణమూర్తి కంటే ముందే ఆ తరహా చిత్రాలను రూపొందించిన ఘనత మాదాల రంగారావుకు దక్కుతుంది. ఆయన రూపొందించిన చిత్రాలు 'స్వరాజ్యం', 'ప్రజా శక్తి', 'జనం-మనం', 'ఎర్రమల్లెలు', 'యువతరం కదిలింది'. ఇదే తరహాలో పి.ఎల్.నారాయణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఊరేగింపు'. దర్శకరత్న దాసరి నారాయణరావు ఈ కేటగిరిలో రూపొందించిన చిత్రాలు 'ఒసేయ్ రాములమ్మా' (విజయశాంతి ప్రధానపాత్రధారి), 'మేస్త్రి'.

సమాజాన్ని జాగృతపరిచి, చైతన్యస్ఫూర్తితో ముందుకు నడిపించే దిశగా

చిత్రాలు రూపొందించిన వారిలో వేజెళ్ళ సత్యనారాయణను పేర్కొనాలి. ఆయన దర్శకత్వంలో తయారైన మూడు అద్భుత చిత్రాలు – 'మార్చండి మన చట్టాలు', 'మరోమలుపు', 'ఈ చరిత్ర ఏ సిరాతో'. 'నిజంగా సమాజంలో ఆరోగ్యకరమైన మార్పును కోరి త్రికరణశుద్ధిగా చిత్రాలు రూపొందించిన దర్శకుడు వేజెళ్ళ సత్యనారాయణ' అని కేరెక్టర్ ఆరిస్టు గుమ్మడి వెంకటేశ్వరరావు ప్రశంసించారు.

అదే విధంగా సామాజిక చిత్రాలు ఒక తపనతో, ఒక లక్ష్యంతో రూపొందించిన దర్శకుడు టి.కృష్ణ. ఇందుకు ఉదాహరణగా ఆయన రూపొందించిన 'వందేమాతరం', 'నేటి భారతం', 'ప్రతిఘటన', 'దేవాలయం', 'రేపటి పౌరుడు', 'దేశంలో దొంగలు పడ్డారు' చిత్రాలను ఉదహరించవచ్చు.

ప్రముఖ నటుడు టి.చలపతిరావు, అతని మిత్రుడు కె.రాధాకృష్ణతో కలిసి తమ్మారెడ్డి భరద్వాజ దర్శకత్వంలో, శారద ప్రధాన పాత్రలో రూపొందించిన చిత్రం 'కడప రెడ్డెమ్మ'.

రికార్డుస్థాయిలో 300కు పైగా చిత్రాలకు పదునైన సంభాషణలు అందించిన పరుచూరి బ్రదర్స్, చైతన్యస్ఫూర్తితో రూపొందించిన చిత్రాలు 'ప్రజాస్వామ్యం', 'రేపటి స్వరాజ్యం'.

సమకాలీన రాజకీయ రంగంలో ఉన్న విశేషాలను విశ్లేషిస్తూ – నటుడు ఎమ్.ప్రభాకరరెడ్డి రూపొందించిన చిత్రాలు 'గండిపేట రహస్యం', 'మండలాధీశుడు'.

ప్రముఖ నిర్మాత విశ్వశాంతి విశ్వేశ్వరరావు సామాజిక స్పృహతో స్వీయదర్శకత్వంలో రూపొందించిన చిత్రాలు 'తీర్పు', 'మార్పు', 'కీర్తి,కాంత,కనకం', 'హరిశ్చంద్రుడు'. సామాజిక న్యాయాన్నికోరుతూ నిర్మాత, దర్శకుడు కె.బి.తిలక్ రూపొందించిన చిత్రం 'భూమికోసం'. ప్రముఖ హిందీ నటుడు అశోక్‌కుమార్ ఈ చిత్రంలో జమీందారుగా నటించడం ఓ విశేషం.

రచయిత మహారథి రైతు సమస్యలకు దర్పణంగా రూపొందించిన చిత్రం 'రైతుభారతం'.

✣ ✣ ✣

## జేమ్స్‌బాండ్, కౌబాయ్, ఫ్యాక్షన్ తరహా చిత్రాలు

1965 ప్రాంతంలో ఇంగ్లీషులో వచ్చిన చిత్రం 'ప్యానిక్ ఇన్ బ్యాంకాక్' అది అఖండ విజయాన్ని సాధించిన జేమ్స్‌బాండ్ చిత్రం. దాని స్ఫూర్తితో ఆరుద్ర వ్రాసిన కథతో 'గూఢచారి 116' అనే బాండ్ తరహా చిత్రాన్ని సుందర్‌లాల్ నెహతా డూండీ నిర్మించారు. అప్పుడప్పుడే పరిచయమైన కథానాయకుడు కృష్ణ ఇందులో బాండ్ తరహా పాత్రను తొలిసారిగా పోషించాడు. అది కొత్త తరహా కథనంతో అఖండ విజయాన్ని సాధించింది. ఆ తరువాత ఆ తరహాలో 'ఏజెంట్ గోపి', 'గూఢచారి 117', 'గూఢచారి నెంబర్ 1' (చిరంజీవి), 'బుల్లెట్' (కృష్ణంరాజు), నేనే మొనగాణ్ణి (ఎన్.టి.ఆర్), 'జేమ్స్‌బాండ్ 777' వంటి చిత్రాలు నిర్మించారు.

గుప్త నిధులు, వాటి కోసం రెండు మూడు బృందాలు ప్రయత్నించడం, ఆ ప్రయత్నంలో ఎత్తులు పైఎత్తులు, కొండ ప్రాంతాల్లో గుర్రపు స్వారీలు, రివాల్వర్‌తోను, తుపాకీలతోను పోరాటాలు - ప్రధానాంశాలుగా రూపొందిన వాటిని కౌబాయ్ చిత్రాల కోవలోకి వస్తాయి. ఇవి ఆంగ్ల వాతావరణానికి చెందినవి. ఆ దిశగా సూపర్‌హిట్ అయిన హాలీవుడ్ చిత్రాలు 'మెకన్నాస్ గోల్డ్', 'గుడ్ బాడ్ అండ్ అగ్లీ'. ఈ రెండు చిత్రాల స్ఫూర్తితో ఆరుద్ర రూపొందించిన కథతో, కథానాయకుడు కృష్ణ కె.ఎస్.ఆర్.దాస్ దర్శకత్వంలో రంగులలో రూపొందించిన చిత్రం 'మోసగాళ్లకు మోసగాడు'. ఇందులోని కథా కథనాలు కొత్తగా వుండటంతో ప్రేక్షకులు నీరాజనం పట్టారు. దాంతో ఆ తరహాకు చెందిన పలు చిత్రాలు రూపొందాయి. వాటిలో చెప్పుకోదగ్గవి 'మంచివాళ్లకు మంచివాడు', 'చలాకీ రాణి -కిలాడి రాజా', 'పగ సాధిస్తా', 'టక్కరి దొంగ- చక్కని చుక్క', 'పంచ కళ్యాణి - దొంగలరాణి', 'హంతకులు - దేవాంతకులు', 'పిల్లా - పిడుగా'; కథానాయికకు ప్రాధాన్యత ఇచ్చి ఈ తరహాలో రూపొందించిన చిత్రాలు 'రౌడీ రాణి', 'రివాల్వర్ రాణి'. జయసుధ ప్రధానపాత్ర పోషించిన చిత్రం 'ఆడపులి', భానుప్రియ నటించిన 'ఝాన్సీరాణి' చిత్రాలను ఈ కోవలో పేర్కొనవచ్చు. సిల్క్‌స్మిత ప్రధానపాత్రలో పి.సి.రెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రాలు 'లేడీ జేమ్స్‌బాండ్', 'ఖైదీరాణి'.

కె.ఎస్.ఆర్.దాస్ దర్శకత్వంలో అర్జున్ కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'కౌబాయ్ నెం. 1'.

కన్నడ రంగానికి చెందిన ప్రముఖ కెమెరామెన్ జానకిరామ్ కృష్ణ హీరోగా రూపొందించిన కౌబాయ్ చిత్రం 'నిజం నిరూపిస్తా'. కొమ్మినేని శేషగిరిరావు దర్శకత్వంలో రూపొందిన తొలి సినిమాస్కోప్ చిత్రం 'దేవతలారా దీవించండి' కూడా ఓ విభిన్న వాతావరణంలో నిర్మించబడిన సస్పెన్స్ కథే ! ప్రేక్షకులలో ఉత్కంఠ కల్గించిన సస్పెన్స్ చిత్రాలలో చెప్పుకోతగ్గవి 'ఆమె ఎవరు?, అవేకళ్లు'. వీటికి ప్రేరణ హిందీలో నిర్మించబడ్డ సస్పెన్స్ చిత్రాలు 'బీస్‌సాల్ బాత్, కొహరా, ఓ కౌన్‌థీ' ఈ చిత్రాల్లో ప్రేక్షకులను భయభ్రాంతులను చేసే నేపథ్యసంగీతానికి ఎంతో ప్రాముఖ్యం వుండేది.

20వ శతాబ్దం ముగింపు దశలో రాయలసీమ ప్రాంతంలోని ఫ్యాక్షనిజం ప్రధానాంశంగా బి.గోపాల్ దర్శకత్వంలో, పరుచూరి బ్రదర్స్ రచనతో, బాలకృష్ణ అభినయంతో ప్రేక్షకుల్ని రంజింపజేసిన చిత్రం 'సమరసింహారెడ్డి'. అందులోని సవాళ్లు, టాటాసుమోలు గాలిలోకి లేచి పేలిపోవడం, వేటకొడవళ్లతో ప్రత్యర్థులను మట్టుపెట్టడం – ఈ తరహా కథాకథనాలు ప్రేక్షకుల్ని విపరీతంగా ఆకర్షించాయి. దాంతో రచయితలు విజయేంద్రప్రసాద్, చిన్ని కృష్ణ, పరుచూరి సోదరులు ఆ తరహా కథలను రూపొందించడం, వాటిల్లో బాలకృష్ణ, చిరంజీవి, వెంకటేష్, నాగార్జునలతో పాటు నవతరం కథానాయకుడు మహేష్‌బాబు, జూనియర్ ఎన్.టి.ఆర్, రామ్‌చరణ్‌తేజా, అల్లు అర్జున్ రాణించారు.

దర్శకులు వి.వి.వినాయక్, పూరి జగన్నాథ్, రాజమౌళి, బోయపాటి శీను, శీను వైట్ల వంటి దర్శకులు ఆ తరహా చిత్రాలను పోటీపడి రూపొందించారు.

కొన్నింటిలో కథానాయకులతో సమానంగా మహిళా ఫ్యాక్షనిస్టులు పాత్రలను కూడా సృష్టించారు. నర్సింహనాయుడు, చెన్నకేశవరెడ్డి, విజయేందర్‌రెడ్డి, ఇంద్ర, సింహాద్రి, మురారి, ఆది – వంటి చిత్రాలు కొన్ని సంచలన విజయాలు సాధించగా, మరికొన్ని ప్రేక్షకుల దగ్గరకు చేరలేకపోయాయి.

✣ ✣ ✣

## అనువాద చిత్రాలు

ప్రపంచ భాషల్లో ఏ భాషలో నిర్మించిన చిత్రాలైనా హక్కులు కొనేసి మూలకథ - సన్నివేశ ప్రభావం అర్థమయ్యేలా హాయిగా తెలుగులోకి అనువదించబడు తున్నాయి. మనకు అర్థమయ్యే మన భాషలో ఆ చిత్రాన్ని చూసి ఆనందించగల్గుతున్నాడు సగటు సినిమా ప్రేక్షకుడు. ఇది డబ్బింగ్ అనే ప్రక్రియ సామాన్య ప్రేక్షకుడికి యిచ్చిన వరం.

ఈ ప్రక్రియకు నాంది పలికింది నిర్మాత వాసిరెడ్డి నారాయణరావు. (ఈయన 'జయభేరి' చిత్ర నిర్మాత). నీరా ఔర్ నందా అనే హిందీ చిత్రాన్ని 1950 ప్రాంతంలో 'ఆహుతి' అనే పేరిట తెలుగులోకి డబ్ చేశారు (అనువదించారు). అనువాద చిత్రానికి రచయిత ప్రాణం వంటివాడు. పెదవుల కదలికలకు తగ్గట్టు పరభాషలోని భావం చెడకుండా మన భాషలోకి మాటల్ని వ్రాసి మెప్పించాలి. అప్పటికే ప్రగతిశీల భావాలతో కవితా సృష్టి చేసి 'మహాప్రస్థానం' ద్వారా తన సామర్థ్యాన్ని నిరూపించుకొన్న శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు) 'ఆహుతి' చిత్రానికి రచన చేశారు. రాజేశ్వరరావు సంగీతం అందించారు. ఆ చిత్రం విజయం సాధించకపోయినా, ఆ ప్రక్రియ తరువాత కొనసాగింది.

డబ్బింగ్‌కు సంబంధం వున్న మరో పద్ధతి ట్రాక్ ఛేంజి. అంటే మూలభాషకు తగ్గట్టు సంభాషణలు - అలాగే పాటలు వ్రాయగా వాటి ఆధారంగా షూటింగ్ జరపటం - ఈ ప్రక్రియకు చక్కని వుదాహరణలు మనోహర, ప్రేమలేఖలు - చిత్రాలు. సుమారుగా 1955 నుంచీ యీ డబ్బింగ్ ప్రక్రియ వూపందుకుంది. నాటి నుంచి నేటి దాకా సుమారు పదహారు వందల అనువాద చిత్రాలు వచ్చాయి.

ఇంతగా డబ్బింగ్ చిత్రాలు నిర్మాణం కావటానికి మూలకారణం ఆలోచిస్తే రిస్క్ తక్కువ. ఫలితం ఎక్కువ, ఇతర భాషల్లో విజయవంతమైతే ఆ హక్కులు పొందితే షూటింగ్ బెడద లేకుండా డబ్ చేసి మినిమమ్ గ్యారంటీతో వ్యాపారం చెయ్యొచ్చు.

తమిళ చిత్రరంగంలో పేరొందిన చిత్రాల్ని తెలుగులోకి అనువదించగా ప్రేక్షకుల ఆదరణకు నోచుకొని నిర్మాతలకి లాభాలు చేకూర్చిన వాటిల్లో కొన్ని : కొండవీటి దొంగ, ఆలీబాబా నలభైదొంగలు, రత్నగిరి రహస్యం, వీరప్రతాప్,

కొండవీటి సింహం, విజయకోటవీరుడు, పాపపరిహారం, మన్మథలీల, నాగబాల, ఘర్షణ, భారతీయుడు, భామనే సత్యభామనే, ప్రేమదేశం, ప్రేమలేఖ, నరసింహ, నాయకుడు, అపరిచితుడు, దశావతారం, రోబో మొదలైనవి.

అలాగే కన్నడం (శ్రీకృష్ణదేవరాయలు, బడిపంతులు, ఉపేంద్ర), మళయాళం (అతను ఎవరు, వైశాలి), హిందీ (జంబో, రామభక్త హనుమాన్, ప్రేమపావురాళ్లు) భాషల నుంచి పలు చిత్రాలు తెలుగులోకి అనువాదం అయ్యాయి. గత దశాబ్ద కాలంగా ఇంగ్లీషులో వచ్చిన భారీ చిత్రాలు తెలుగులో దర్శనమిస్తున్నాయి.

డబ్బింగ్ రచయితలు మూలభావం చెడకుండా స్వతంత్రించి లిప్‌సింక్ (పెదవుల కదలిక)కు తగ్గట్టుగా సంభాషణలు వ్రాసి విజయవంతమైన సందర్భాలు చాలా వున్నాయి. శ్రీశ్రీ, ఆరుద్ర, అనిసెట్టి, మహారథి, గబ్బిట వెంకట్రావు, రాజశ్రీ, వసంతకుమార్, శ్రీరామకృష్ణ, వెన్నెలకంటి, ఘంటసాల రత్నకుమార్, భారతిబాబూ మొదలైనవారు డబ్బింగ్ రచయితలుగా పేరొందారు.

డబ్బింగ్ ప్రక్రియలో అతి ముఖ్యమైన అంశం గాత్రదానం. అంటే ఇతర భాషలో ఏ రస ప్రధానంగా భాష పలికిందో దానిని తు.చ తప్పకుండ ఆ నటుని కంఠస్వరానికి దగ్గరగా వుండేలా లిప్‌సింక్ చూసుకొని భావయుక్తంగా మాట్లాడగలగటం గొప్పకళ. ఈ కళలో జగ్గయ్య, చంద్రు సూర్యనారాయణ, చక్రవర్తి, పి.జె.శర్మ, కాశీనాథ్ తాతా, భూసారపు వెంకటేశ్వరరావు, వసంతకుమార్, సాయికుమార్, రవిశంకర్, టి.జి.కమలాదేవి, వీరమాచనేని సరోజని, సునీత, – డబ్బింగ్ ఆర్టిస్టులుగా పేరొందారు. ఈ ప్రక్రియ ఫలితంగా తెలుగులో తీసిన కొన్ని సినిమాలు తమిళ, హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి డబ్ అయిన సందర్భాలు కూడా వున్నాయి.

ఇతర భాషలతో ఏ మాత్రం పరిచయం లేని సగటు తెలుగు ప్రేక్షకుడికి ఆ సినిమా ఒరిజినల్స్ చూసి ఆనందించే అవకాశం వుండదుకాబట్టి యీ డబ్బింగ్ చిత్రాల పుణ్యమా అని యితర భాషా చిత్రాల దర్శకుల స్థాయిని, కథల స్థాయిని, సాంకేతిక విలువల్ని చూసి ఆనందించగల్గుతున్నాడు. నిజంగా యిది డబ్బింగ్ ప్రక్రియ సామాన్య ప్రేక్షకుడికి యిచ్చిన ఒక వరం.

⁂ ⁂ ⁂

## సాంకేతిక రంగం

చిత్ర నిర్మాణం పలు అంశాలతో ముడిపడి ఉంది. అందులో ప్రధానమైనది సాంకేతిక రంగం. ఈ రంగంలోని కొన్ని ముఖ్య శాఖలను గూర్చి ఈ ప్రకరణలో రేఖామాత్రంగా తెలుసుకుందాం.

### దర్శకులు

ఒక నిర్మాత సినిమా తియ్యటానికి నిర్ణయించుకున్న తర్వాత ముందుగా నిర్ణయించుకొనేది దర్శకుణ్ణి. సినిమా నిర్మాణానికి కెప్టెన్ వంటి అతి కీలకమైన వ్యక్తి దర్శకుడు. అన్ని శాఖలను (సంగీతం, సాహిత్యం, అభినయం, నృత్యం, కళ, పోరాటాలు, ఎడిటింగ్) సమన్వయపరుచుకుంటూ చిత్ర ప్రారంభం నుంచి ముగింపు దాకా ముఖ్య పాత్ర నిర్వహించే ప్రధాన వ్యక్తి. నిర్మాత కోరుకున్న కథను అతను రూపొందించుకున్న బడ్జెట్ పరిధి మేరకు చిత్రాన్ని అందించడం దర్శకుని ప్రధాన బాధ్యత. ఇందులో రకరకాల పద్ధతులున్నాయి. కొందరు సీనియర్ల దగ్గర పనిచేసిన అసిస్టెంట్లు, దర్శకులయ్యారు. మరికొందరు వివిధ శాఖల్లో ప్రావీణ్యం సంపాదించి దర్శకులైనారు. ఇంకొందరు యెవ్వరి దగ్గర పనిచేయకుండా పరిశీలనా దృక్పథంతో చిత్ర నిర్మాణం పట్ల అవగాహన పెంచుకొని దర్శకులయినారు.

1931లో తొలి తెలుగు టాకీ 'భక్త ప్రహ్లాద'కు దర్శకత్వం వహించిన వారు హెచ్.ఎమ్.రెడ్డి. తొలి దశకంలో (1931–40) దర్శకులుగా పరిచయమై, విశిష్ట చిత్రాలు అందించిన వారిలో ముఖ్యులు సి.పుల్లయ్య. వీరు తీసిన చిత్రాలలో చెప్పుకోదగ్గవి 'లవకుశ', 'పక్కింటి అమ్మాయి', 'దేవాంతకుడు', 'పరమానందయ్య శిష్యులు కథ'. పి.పుల్లయ్య దర్శకత్వంలో వచ్చిన చిత్రాలు 'సారంగధర', 'శ్రీ వెంకటేశ్వర మాహాత్మ్యం', 'అర్ధాంగి', 'బండరాముడు', 'జయభేరి', 'కన్యాశుల్కం'.

హెచ్.ఎం.రెడ్డి వద్ద పనిచేసిన వారు హెచ్.వి.బాబు, బి.ఎన్.రెడ్డి, గూడవల్లి రామబ్రహ్మం, ఎల్.వి.ప్రసాద్, వై.ఆర్.స్వామి. హెచ్.వి.బాబు రూపొందించిన చిత్రాలు 'ద్రౌపదీ వస్త్రాపహరణం', 'కృష్ణప్రేమ', 'దేవసుందరి'.

బి.ఎన్.రెడ్డి వాహిని సంస్థను స్థాపించి 'వందేమాతరం', 'సుమంగళి', 'దేవత', 'స్వర్గసీమ', 'మల్లీశ్వరి', 'బంగారుపాప', 'రాజమకుటం' చిత్రాలు అందించారు.

గూడవల్లి రామబ్రహ్మం సారధి పతాకంపై 'మాలపిల్ల', 'రైతుబిడ్డ' వంటి సమస్యాత్మక చిత్రాలను అందించారు. ఎల్.వి.ప్రసాద్ తొలిసారిగా 'గృహప్రవేశం' చిత్రానికి దర్శకత్వం వహించడమే కాక, అందులో కథానాయకుని పాత్రను పోషించారు. సాంఘిక సమస్యను హాస్యంతో రంగరించి చిత్రాలు తియ్యడం వీరి ప్రత్యేకత. 'మనదేశం', 'సంసారం', 'పరదేశి', 'మిస్సమ్మ', 'అప్పుచేసి పప్పుకూడు' చిత్రాలను ఉదహరించవచ్చు. వీరు రూపొందించిన అద్భుత జానపద చిత్రం 'మనోహర'. ఎల్.వి.ప్రసాద్ తాను స్వయంగా హిందీలో కొన్ని చిత్రాలు రూపొందించి, మరికొన్ని చిత్రాలను వారి శిష్యుల దర్శకత్వంలో నిర్మించారు. అన్ని వసతులతో కూడిన స్టూడియోలను, లేబరేటర్లను – మద్రాసు, హైదరాబాద్, బొంబాయి, బెంగుళూరు, భువనేశ్వర్ నగరాలలో నిర్మించారు. ప్రేక్షకుల రుణం తీర్చుకోవడం కోసం అన్ని వసతులతో కూడిన ప్రసాద్ కంటి ఆసుపత్రిని హైదరాబాద్‌లో నెలకొల్పారు.

హైచ్.వి.బాబు వద్ద దర్శకత్వ శాఖలో పని చేసిన పి.ఎస్.రామకృష్ణారావు, నటి భానుమతిని వివాహం చేసుకొని, వారి అబ్బాయి భరణి పేరుపై భరణీ స్టూడియోను నిర్మించి, భరణీ పిక్చర్స్ పతాకంపై 'లైలామజ్నూ', 'విప్రనారాయణ', 'వివాహబంధం', 'బాటసారి' వంటి విలువైన చిత్రాలను అందించారు.

బందర్‌కు చెందిన చిత్రపు నారాయణమూర్తి తొలిసారిగా 'మార్కండేయ' (1938) చిత్రానికి దర్శకత్వం వహించారు. ఆ తరువాత వారి చిత్రాల్లో చెప్పుకోదగ్గవి 'నా చెల్లెలు', 'నాగులచవితి', 'భక్తప్రహ్లాద'.

వాహిని సంస్థలో అకౌంటెంట్‌గా పనిచేసే కె.వి.రెడ్డి తొలిసారిగా దర్శకత్వం వహించిన చిత్రం 'భక్త పోతన'. ఆ తరువాత వారందించిన అద్భుత చిత్రాలు 'యోగి వేమన', 'గుణసుందరి కథ', 'పాతాళభైరవి', 'పెద్దమనుషులు', 'దొంగరాముడు', 'మాయాబజార్', 'పెళ్ళినాటి ప్రమాణాలు', 'జగదేకవీరుని కథ', 'హరిశ్చంద్ర', 'భాగ్యచక్రం', 'శ్రీకృష్ణార్జునయుద్ధం'. వీరి వద్ద పనిచేసిన కమలాకర

కామేశ్వరరావు ప్రామాణికంగా రూపొందించిన చిత్రాలు 'పాండవవనవాసం, నర్తనశాల, మహామంత్రి తిమ్మరుసు, మహాకవి కాళిదాసు, గుండమ్మకథ'.

కె.వి.రెడ్డిగారి వద్ద దర్శకత్వంలో సహాయకునిగా పనిచేసిన సింగీతం శ్రీనివాసరావు నీతినిజాయితీ (1972) ద్వారా దర్శకులుగా పరిచయమై ఆహా అనిపించే హాయిగొలిపే చిత్రాలకు దర్శకత్వం వహించారు. తెలుగు సంస్కృతిని చాటిచెప్పిన 'అమెరికా అమ్మాయి', అద్భుత రసాన్ని కలిపిన సోషియో ఫాంటసీ 'ఆదిత్య 369' మాటలు లేని సినిమా పుష్పక్ - విజయస్థాయిని గుర్తు చేసిన 'భైరవద్వీపం' ప్రత్యేకంగా పేర్కొనాలి.

ప్రతిభా పతాకం మీద నిర్మాత, దర్శకుడు ఘంటసాల బలరామయ్య, అక్కినేని నాగేశ్వరరావును హీరోగా పరిచయం చేస్తూ తీసిన పౌరాణిక చిత్రం 'సీతారామజననం' (1944). ఆ తరువాత వారందించిన చిత్రాలలో చెప్పుకోదగ్గవి 'ముగ్గురు మరాఠీలు', 'బాలరాజు', 'శ్రీలక్ష్మమ్మకథ', 'స్వప్నసుందరి'.

మీర్జాపురం రాజా శోభనాచల పతాకంపై తీసిన చిత్రాలలో అఖండ విజయం సాధించినది 'కీలుగుర్రం'. తెలుగు నుంచి తమిళంలోకి అనువదింపబడ్డ తొలి చిత్రం 'కీలుగుర్రం'. తమిళంలో దీని పేరు 'మాయాకుదరై'.

శోభనాచల సంస్థలో పనిచేసిన బి.ఎ.సుబ్బారావు దర్శకత్వంలో వచ్చిన చిత్రాలలో చెప్పుకోదగ్గవి 'పల్లెటూరి పిల్ల', 'రాజు-పేద', 'చెంచులక్ష్మి', 'భీష్మ'.

సి.పుల్లయ్య కుమారుడు సి.ఎస్.రావు తొలిసారిగా దర్శకత్వం వహించిన చిత్రం 'శ్రీకృష్ణతులాభారం'. ఈయన అన్ని తరహా చిత్రాలకు (శాంతినివాసం, కంచుకోట, వాల్మీకి దర్శకత్వం నెరపి ఆల్‌రౌండర్ అనిపించుకున్నారు. వీరు రూపొందించిన 'కీలుబొమ్మలు' చిత్రం రష్యాలో ప్రదర్శించబడింది. సరదాగా 'పక్కింటి అమ్మాయి', 'ఇంట్లో రామయ్య-వీధిలో కృష్ణయ్య' వంటి కొన్ని చిత్రాలలో నటించారు.

ప్రసాద్‌గారి దర్శకత్వంలో ద్రోహి నిర్మించిన కె.ఎస్.ప్రకాశరావు, స్వీయదర్శకత్వంలో ప్రకాష్ ప్రొడక్షన్స్ పేరిట మొదటిరాత్రి, కన్నతల్లి నిర్మించారు. ప్రకాశరావు దర్శకత్వం వహించిన చిత్రాల్లో ప్రేమనగర్, తాసిల్దార్‌గారి అమ్మాయి, సెక్రటరీ చిరకాలం గుర్తుండిపోయేవి.

కె.ఎస్.ప్రకాశరావు వద్ద దర్శకత్వ శాఖలో పనిచేసిన ఆదుర్తి సుబ్బారావు (1921-75) తొలిసారిగా దర్శకత్వం వహించిన సంగీత భరిత చిత్రం 'అమరసందేశం'. ఆ తరువాత ఆయన అన్నపూర్ణ సంస్థకు (తోడికోడళ్లు, ఇద్దరుమిత్రులు, డా.చక్రవర్తి), బాబూ మూవీస్‌కు (మంచి మనసులు, మూగమనసులు) ఎన్నో చిత్రాలు అందించారు. రచయిత, నిర్మాతలతో కలిసి స్క్రిప్టు క్షుణ్ణంగా చర్చించి కొత్తదనంతో చిత్రం తీయటానికి తపన పడేవారు. స్వతహాగా ఎడిటర్ కావటం వలన తీయవలసిన సన్నివేశం ముందుగానే మనసులో వూహించుకొని తీయటం, ముఖ్యంగా పాటల్ని చిత్రీకరించాల్సి వచ్చినప్పుడు ఆయన ప్రతిభ తెలిసేలా చిత్రీకరించేవారు.

ఆదుర్తి వద్ద అన్నపూర్ణ వారి చిత్రాలకు దర్శకత్వశాఖలో పనిచేసిన కె.విశ్వనాథ్ తొలిసారిగా దర్శకత్వం వహించిన చిత్రం 'ఆత్మగౌరవం'. ఆ తర్వాత ఓ సీతకథ, సీతామాలక్ష్మి, సిరిసిరిమువ్వ చిత్రాల్లో ఆయన ప్రతిభ కనపర్చినా, శంకరాభరణం చిత్రం ఆయన్ను దర్శకునిగా శిఖరాగ్రాన నిలబెట్టింది. అసలు శంకరశాస్త్రి పాత్రకు సోమయాజుల్ని, నర్తకి పాత్రకు మంజుభార్గవిని ఎంపిక చేయటంలోనే ఆయన ఆంతర్యం అర్థమౌతుంది. అమలిన శృంగారం, బాహ్య ఆకర్షణకు అతీతమైన ఆరాధనా భావం ఆయన తీర్చిదిద్దిన పాత్రల్లో కన్పిస్తుంది. బహుశాః ఆదుర్తి వారి సహచర్యంలో 'మూగమనసులు' తాలూకు ప్రభావం యిందుకు దోహదం చేసి వుండొచ్చు. సన్నివేశాల్ని నటించి చూపించి మంచి ఫలితాలు సాధిస్తారు. ఈయన చక్కని నటుడు అని కూడా 'శుభసంకల్పం' నిరూపించింది. తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే సంగీత, సాహిత్య, నృత్యాలకు విశ్వనాధుని చిత్రాలు ప్రతిరూపం.

కె.ఎస్.ప్రకాశరావు, తాతినేని ప్రకాశరావు, ఆదుర్తి సుబ్బారావుల వద్ద దర్శకత్వ శాఖలో పనిచేసిన వీరమాచినేని మధుసూదనరావు. తొలిసారిగా ఒక పౌరాణిక చిత్రం 'సతీ తులసి' (1959)కి దర్శకత్వం వహించారు. ఆ తరువాత ఆయన దర్శకత్వం వహించిన వాటిల్లో ఎనభై శాతం హిట్ చిత్రాలే. ముఖ్యంగా జగపతి వారికి ఆయన తీసినవన్నీ మేలిముత్యాలే! సన్నివేశాన్ని పాటల్ని అర్థవంతంగా థ్రిల్లింగ్‌గా తీయటం ఆయన ప్రత్యేకత. ఆర్టిస్టులు ఒక విధంగా వీరి వద్ద వళ్ళు దగ్గిరపెట్టుకొని నటించేవారు. అంతటి క్రమశిక్షణ, శక్తి సామర్థ్యాలు ఆయనవి.

స్వయంగా నటించి చూపించేవారు. ఈయన వద్ద పనిచేసేవారు ఎందరో దర్శకులైనారు. రక్తసంబంధం, ఆత్మబలం, అదృష్టవంతులు, ఆరాధన, కళ్యాణమంటపం, భక్త తుకారాం, వీరాభిమన్యు- కొన్ని వుదాహరణలు మాత్రమే.

మధుసూదనరావుగారి వద్ద సహాయకులుగా పనిచేసి దర్శకులుగా వినుతికెక్కిన వారిలో ముందుగా చెప్పుకోవాల్సింది కె.రాఘవేంద్రరావు (కె.ఎస్.ప్రకాశరావు గారి అబ్బాయి). ఆయన తొలిచిత్రం బాబు (1975) నుంచీ ఇటీవలి ‘శిరిడీ సాయి’ (2012) వరకూ రూపొందించిన శతాధిక చిత్రాలలో నవ రసాలను సమపాళల్లో అందించి, చిత్రాలను థ్రిల్లింగ్‌గాను, పాటలను కనువిందుగాను చిత్రీకరించి ప్రేక్షకుల్ని సుందర స్వప్న లోకాల్లో విహరింపజేశారు.

కె.రాఘవేంద్రరావు దగ్గర పనిచేసిన బి.గోపాల్ దర్శకత్వంలో రూపొందించిన చిత్రాలలో చెప్పుకోదగ్గవి ‘ప్రతిధ్వని, బొబ్బిలిరాజా, సమరసింహారెడ్డి, ఇంద్ర’.

మధుసూదనరావు మరో శిష్యుడు పి.చంద్రశేఖరరెడ్డి గ్రామీణ వాతావరణంతో కూడిన కథాచిత్రాలను (ఇల్లు-ఇల్లాలు, పాడిపంటలు) అత్యంత సహజంగా చిత్రీకరించారు. వీరి వద్ద సహాయకులుగా పని చేసిన వారిలో దాదాపు 40 మందికి పైగా దర్శకులయ్యారు.

ఇంకో శిష్యుడు ఏ.కోదండరామిరెడ్డి సంధ్యతో దర్శకునిగా మారి, చిరంజీవితో (ఖైదీ, ఛాలెంజి, రాక్షసుడు), కృష్ణకు (కిరాయి కోటిగాడు), శోభన్‌బాబుకు (శ్రావణసంధ్య), అక్కినేనికి (శ్రీరంగనీతులు, అనుబంధం) - ఎన్నో హిట్స్ ఇచ్చారు.

వేదాంతం రాఘవయ్య నృత్య దర్శకునిగా సినిరంగ ప్రవేశం చేసి గరుడ గర్వభంగంలో నటించి, బాలరాజు, లైలామజ్నూ, స్వప్నసుందరి చిత్రాలకు నృత్య దర్శకత్వం వహించి, 1951లో వినోదా పతాకంపై స్త్రీ సాహసం చిత్రానికి దర్శకత్వం వహించారు. సహజంగా నృత్యదర్శకుడు గావటం చేత యీయన చిత్రాల్లో (సువర్ణసుందరి, అనార్కలీ, రహస్యం, భలేరాముడు) నృత్యాలకు ప్రాధాన్యత వుండేది. దేవదాసు ఈయన రూపొందించిన గొప్ప చిత్రంగా పేర్కొనాలి.

యల్.వి.ప్రసాద్‌గారి వద్ద సహాయకునిగా పనిచేసిన తాతినేని ప్రకాశరావు (1924-92) తొలిసారిగా దర్శకత్వం వహించిన చిత్రం పల్లెటూరు (1952). ఆ తరువాత ఆయన తెలుగు, తమిళ, హిందీ భాషల్లో యెన్నో చిత్రాలకు దర్శకత్వం నెరిపారు. జయం మనదే, ఇల్లరికం చిత్రాలు సూపర్ హిట్స్.

తాతినేని ప్రకాశరావు వద్ద సహాయకునిగా పనిచేసిన కె.ప్రత్యగాత్మ తొలిసారిగా పి.ఏ.పి.వారి 'భార్యాభర్తలు' చిత్రానికి దర్శకునిగా పనిచేశారు. వీరు రూపొందించిన చిలకా గోరింక చిత్రం ద్వారా కృష్ణంరాజును హీరోగా పరిచయం చేశారు. అర్థవంతమైన ఆలోచనలు ప్రేక్షకుడిలో రేకెత్తించే విధంగా కొత్త తరహాలో ఆలోచించి చిత్రీకరించటం ఆయనలోని స్పెషాలిటీ.

ప్రత్యగాత్మ గారి వద్ద పనిచేసిన తాతినేని రామారావు తొలిసారిగా దర్శకత్వం వహించిన చిత్రం పి.ఏ.పి. వారి నవరాత్రి. ఈయన రూపొందించిన యితర చిత్రాల్లో చెప్పుకోదగ్గవి 'భార్యాబిడ్డలు, యమగోల'. తాతినేని రామారావు దగ్గర పనిచేసిన ఎ.మోహన్‌గాంధి దర్శకత్వంలో రూపొందిన చిత్రాలు 'అర్ధాంగి, కర్తవ్యం'.

గుత్తా రామినీడు తొలిచిత్రం 'మా యింటి మహాలక్ష్మి'ని ఎంతో అనుభవమున్న దర్శకునిలా చిత్రీకరించారు. ఆయన తీర్చిదిద్దిన మరో ఉత్తమ చిత్రం 'చివరకు మిగిలేది'.

జానపద చిత్రాలను తీయడంలో ఓ ప్రత్యేక శైలిని చూపి, తనదైన ముద్రతో ప్రేక్షకులకు వినోదాన్ని అందించిన దర్శకుడు బి.విఠలాచార్య తొలి చిత్రం సాంఘికం (కన్యాదానం). సాంఘిక చిత్రాలు అంతగా కలిసి రాకపోవడంతో జానపదాలపై దృష్టి సారించి తొలిసారిగా 'జయవిజయ'తో విజయం సాధించారు. ఆ తరువాత ఇటు కాంతారావుతో, అటు ఎన్.టి.ఆర్‌తో తరువాతి కాలంలో నరసింహరాజుతో పలు జానపద చిత్రాలు నిర్మించి, జానపద చిత్ర బ్రహ్మగా పేరొందారు.

కన్నడ రంగంలో జానపద చిత్రాలు తీయటంలో సిద్ధహస్తుడు, విఠలాచార్యకు అంతే వాసి అయిన జి.విశ్వనాథం దర్శకత్వంలో చెప్పుకోదగ్గవి 'తోటలో పిల్ల-కోటలో రాణి', 'గోపాలుడు- భూపాలుడు'.

ఎడిటర్ అయిన కె.ఎస్.ఆర్.దాస్ నిర్మాత భావన్నారాయణ తొలిసారిగా "లోగుట్టు పెరుమాళ్ళకెరుక" చిత్రం ద్వారా అవకాశం కల్పించారు. ఒక విధంగా దాస్ ట్రెండ్ సెట్టర్‌గా చెప్పాలి. దీనికి ఆయన దర్శకత్వంలో వచ్చిన కౌబోయ్ చిత్రం "మోసగాళ్ళకు మోసగాడు" పేర్కొనాలి. ఈయన స్కోర్ వందకు పైనే!

నిర్మాత పి.గంగాధరరావు సోదరుడు పి.సాంబశివరావు అర్ధరాత్రి చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమై, వంశోద్ధారకుడు, కుమారరాజా, ఇంటింటి రామాయణం వంటి వైవిధ్య చిత్రాలు అందించారు.

కె.వి.నందనరావు దగ్గర దర్శకత్వంలోను, పాలగుమ్మి పద్మరాజు వద్ద రచనా రంగంలోనూ మెళుకువలు తెలుసుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి దాసరి నారాయణరావుకు తొలిసారిగా 'తాతా-మనవడు' చిత్రం ద్వారా అవకాశమిచ్చి ప్రోత్సహించారు ప్రతాప్ ఆర్ట్స్ అధినేత కె.రాఘవ. ఆ తరువాత ఆయన లోబడ్జెట్ చిత్రాలను, అగ్రకథానాయకులతో హిట్ చిత్రాలను రూపొందించారు. మెలో డ్రామాతో పాటు గుండెల్ని కదిపివేసే సెంటిమెంటుకు పెద్దపీట వేస్తారు. డైలాగ్స్‌తో ఆయన చేసినన్ని ఫీట్లు మరెవ్వరూ చెయ్యలేరు. దర్శకునిగా ఆయన స్కోర్ 150 చిత్రాలకు పైగానే.

దాసరి వద్ద పనిచేసిన అనేకమంది శిష్య ప్రశిష్యులు ఎందరో దర్శకులయ్యారు. వారిలో ప్రముఖంగా పేర్కొనవల్సిన వ్యక్తి పాలకొల్లుకు చెందిన కోడి రామకృష్ణ. స్వతహాగా నాటకరంగం నుంచి వచ్చిన వ్యక్తి అవటం చేత స్వయంగా నటించి ఆర్టిస్టుల వద్ద నుంచి కావల్సింది రాబట్టుకొనే సత్తా వుంది. అడపాదడపా వేషాలు వేసిన సందర్భాలు కూడా వున్నాయి. ఈయన తొలిచిత్రం 'ఇంట్లో రామయ్య- వీధిలో కృష్ణయ్య'. దర్శకునిగా ఈయన స్కోరు కూడా 100 దాటింది.

తమిళనాడు స్టేజి నుండి తెరకు వచ్చిన కె.బాలచందర్ మొదటి చిత్రం 'అంతులేని కథ'తో ఆంధ్రులకు అభిమానపాత్రుడైనాడు. అందులో మధ్యతరగతి మహిళా జీవితాల్ని ఆవిష్కరిస్తూ 'మరో చరిత్ర'లో చక్కని ప్రేమకథను సెల్యులాయిడ్‌పై చూపించి చరిత్ర సృష్టించారు. ఆయన రూపొందించిన మరో మూడు గొప్ప చిత్రాలు గుప్పెడు మనసు, ఇది కథకాదు, ఆకలి రాజ్యం.

సూపర్‌స్టార్ కృష్ణలో మంచి దర్శకత్వపు స్పార్క్ వుందని రుజువు చేసిన చిత్రాలు 'సింహాసనం, కొడుకుదిద్దిన కాపురం'. సింహాసనం చిత్రానికి ఆయన కథ, స్క్రీన్‌ప్లే, ఎడిటింగ్ కూడా నిర్వహించారు.

రచయితలుగా పేరొందిన కొందరు అప్పుడప్పుడు దర్శకత్వం చేపట్టిన సందర్భాలు వున్నాయి. వాటిని పరిశీలిస్తే డి.వి.నరసరాజు (కారుదిద్దిన కాపురం), ఆత్రేయ (వాగ్దానం), రాజశ్రీ (చదువు-సంస్కారం), పరుచూరి బ్రదర్స్ (కాయ్ రాజా కాయ్), వీటూరి (భారతి), పేరాల సుబ్రహ్మణ్యం (మావూరి పెద్దమనుషులు), గోపిచంద్ (పేరంటాలు), సముద్రాల (వినాయకచవితి), పాలగుమ్మి పద్మరాజు (బికారి రాముడు), జి.కె.మూర్తి (అడవి మనుషులు), ధర్మవరపు సుబ్రహ్మణ్యం (తోకలేని పిట్ట), యండమూరి వీరేంద్రనాథ్ (స్టూవర్ట్‌పురం పోలీసు స్టేషన్), అనిశెట్టి (కన్నులపండుగ), ఓంకార్ (పందిరి మంచం), జనార్ధనమహర్షి (దేవస్థానం), తనికెళ్ళభరణి (మిధునం).

వాస్తవ చిత్రాలు తీసిన దర్శకులుగా మృణాళ్‌సేన్ (ఒక వూరికథ), ఎ.కుటుంబరావు (తోడు, భద్రం కొడుకో), బి.నరసింగరావు (రంగుల కల, దాసి), శ్యాంబెనగల్ (అనుగ్రహం), గౌతమ్‌ఘోష్ (మాభూమి) పేర్కొనాలి.

మహిళా విభాగానికి వస్తే, 1953 సంవత్సరంలోనే భరణీ పతాకంపై నిర్మించబడిన 'చండీరాణి'కి సంగీత దర్శకత్వం నిర్వహిస్తూ, క్లిష్టమైన ద్విపాత్రాభినయం చేశారు. నటశిరోమణి సావిత్రి దర్శకత్వం చేపట్టి (మాతృదేవత) ఆమె టాలెంట్‌ని నిరూపించుకొన్నారు. తొలినాటి చిత్రాల్లో పాటలు పాడి నటించిన జి.వరలక్ష్మి 'మూగజీవులు' అనే చిత్రానికి దర్శకత్వం వహించారు.

కథానాయికగా పేరొందిన విజయనిర్మల 'మీనా' చిత్రంతో ప్రారంభించి, 40కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించి ప్రపంచ రికార్డు సాధించి గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు చేసుకున్నారు. ఆమె చిత్రాల్లో చెప్పుకోదగ్గవి 'దేవదాసు, హేమాహేమీలు, సంఘం చెక్కిన శిల్పాలు'. ఇటీవల దర్శకులుగా పరిచయమైన బి.జయ, నందినిరెడ్డి తమ ప్రతిభను ప్రదర్శించారు.

❖ ❖ ❖

## రచయితలు

టాకీల తొలిదశలో సినిమా రచన అంటే కథ, మాటలు, పాటలు అన్నీ ఇంచుమించుగా ఒక్కరే రాసేవారు. క్రమానుగతంగా కథను తయారుచేసేది ఒకరు, మాటలు మరియొకరు, పాటలు ఇంకొకరు రాయటం దాని తరువాత కామెడి ట్రాక్‌లు రాసేవారు గీతాల్లోనే హాస్యగీతాలు, ప్రేమగీతాలు, విషాదగీతాలు, విప్లవ గీతాలు ఇలా పలు విభజనలు జరిగి, ఒక్కొక్కరు ఒక్కో తరహాలో కృషి చేశారు. చరిత్రను పరిశీలిస్తే తొలి టాకీ చిత్రం 'భక్త ప్రహ్లాద' (దీనికి ఆధారం ధర్మవరం రామకృష్ణమాచార్యులు గారి నాటకం)కు గీత రచన చేసిన చందాల కేశవదాసునే తొలి సినిమారచయితగా పేర్కొంటారు.

సినిమా రచనా ప్రక్రియను మూడు విభాగాలుగా చూస్తే - మొదటిది ఉభయ కవిమిత్రులు అనగా అటు డైలాగ్స్, ఇటు పాటలు రాసి సవ్యసాచి అనిపించుకున్నవారు. రెండోది కేవలం మాటలు మాత్రమే రాసినవారు (ఇందులో కథారచన చేసిన వారిని కూడా చేర్చవచ్చు), మూడవది కేవలం పాటలు మాత్రమే రాసినవారు. అయితే ఒక రంగంలో విశేషకృషి చేసి రెండో రంగాన్ని అరుదుగా స్పృశించిన వారు కూడా ఉన్నారు.

సముద్రాల రాఘవాచార్య (సీనియర్) 'కనకతార' (1937) చిత్రం ద్వారా రచయితగా ప్రవేశించి, దాదాపు 80 చిత్రాలకు రచన చేసి ఆ చిత్ర విజయాలకు కారణభూతులయ్యారు. ఆయన వ్రాసిన విషాదాంత చిత్రాలు లైలామజ్ను, అనార్కలి, దేవదాసు, బాటసారి; భక్తిరస ప్రధాన చిత్రాలు విప్రనారాయణ, భక్త రఘునాథ్ పౌరాణిక చిత్రాలు; నర్తనశాల, పాండవవనవాసం చారిత్రాత్మక చిత్రాలు; తెనాలి రామకృష్ణ, అమరశిల్పి జక్కన - ఆయన బహుముఖ ప్రజ్ఞకు, ప్రతిభకు దర్పణాలు.

తాపీ ధర్మారావునాయుడు తొలి చిత్రం 'మోహినీరుక్మాంగద' (1937). ఆ తరువాత పత్ని, కృష్ణప్రేమ, కీలుగుఱ్ఱం, ద్రోహి, పల్లెటూరుపిల్ల మొదలైన చిత్రాలకు పని చేశారు. బలిజేపల్లి లక్ష్మీకాంత కవి 'భక్త మార్కండేయ' (1938) ద్వారా పరిచయమై మళ్ళీపెళ్ళి, భూకైలాస్, విశ్వమోహిని, బాలనాగమ్మ, తహసిల్దార్, సంక్రాంతి చిత్రాలకు రచన చేశారు.

హెచ్.ఎం.రెడ్డి గారి తెనాలిరామకృష్ణ (1941) ద్వారా పరిచయమైన వెంపటి సదాశివబ్రహ్మం (1905-68), స్వతహాగా అవధాన విద్యలో దిట్ట. ఈయన రచన చేసిన చిత్రాలలో చెప్పుకోదగ్గవి భలేరాముడు, చరణదాసి, సంసారం, లవకుశ, రహస్యం, పరమానందయ్య శిష్యులకథ, భామావిజయం మొదలైనవి కాగా జిగిబిగి ఉండేలా కథల్ని తీర్చిదిద్దడంలో ఈయన చెయ్యి తిరిగిన రచయిత. ఆ కారణంగా ఈయన్ని కథా శివబ్రహ్మంగా కూడా ఆత్మీయులు చెప్పుకొనేవారు.

జగన్నాథ్ పిక్చర్స్ భలేపెళ్ళి (1941) ద్వారా పరిచయమైన రచయిత పింగళి నాగేంద్రరావు (1901-71) తొలుత నాటకరచయితగా పేరొంది సినీరంగ ప్రవేశం చేసిన తరువాత 'గుణసుందరికథ' చిత్రంతో ఓహో అనిపించుకున్నారు. వీరి రచనతో రూపొందిన విజయా వారి పాతాళభైరవి (1951) ఘనవిజయం సాధించటంతో ప్రజలనాడి తెలిసిన రచయితగా గుర్తింపు పొందారు. విజయా వారి చిత్రాలన్నిటికి దాదాపుగా ఆయనే పాటలు వ్రాశారు. పౌరాణిక, జానపద, చారిత్రక చిత్రాలకు రచన చేశారు. మాయాబజార్, శ్రీకృష్ణార్జునయుద్ధం, జగదేకవీరునికథ, మహామంత్రి తిమ్మరుసు, మహాకవి కాళిదాసు చిత్రాలుఈయనలో నిక్షిప్తమైన అపార సాహితీ సంపదకు ఉదాహరణలు.

1950లో పక్షిరాజా వారి 'బీదలపాట్లు' చిత్రం ద్వారా పరిచయమైన ఆరుద్ర (1925-97 అసలు పేరు భాగవతుల శంకరశాస్త్రి) ఆ తరువాత శతాధిక చిత్రాలకు రచన చేశారు. కొన్ని చిత్రాలకు కథలు, మాటలు (గూఢచారి 116, ఇల్లరికం) మరికొన్నిటికి పాటలు వ్రాశారు. అర్థవంతమైన అంత్యప్రాసలు ఆరుద్ర ప్రత్యేకముద్రతో ఆకట్టుకున్నాయి. ముత్యమంతా పసుపు ముఖమంత చాయ, ఎదగటానికెందుకురా తొందరా; - నీలిమేఘాలలో గాలికెరటాలలో, ముక్కోటి దేవతలు ఒక్కటైనారు, ఊహలు గుసగుసలాడే, యమునా తీరమున, గాంధి పుట్టిన దేశమా ఇది... ఇలా అనేక వైవిధ్య గీతాలు మానసోల్లాసాన్ని కలిగించాయి.

కె.ఎస్.ప్రకాశరావుగారి 'దీక్ష' (1951) చిత్రం ద్వారా పరిచయమైన ఆచార్య ఆత్రేయ (కిళాంబి నరసింహాచార్య 1921-89) రచనల్లో క్లుప్తత ఆప్తత, ఆర్ద్రత కనిపిస్తాయి. పాట వ్రాసినా మాట వ్రాసినా ఒక ప్రయోజనం ఉండాలి.

వందలకొద్ది చిత్రాలకు మాటలు, వేలాది పాటలు వ్రాసినా యీ సూత్రాన్ని ఆయన మరచిపోలేదు. సినిమాదృశ్య ప్రాధాన్యం కాబట్టి భావ ప్రకటనకు అవకాశం ఎక్కువ భాష తక్కువగా వాడాలి అనేది ఈయన పద్ధతి. ఈ మేరకు ఆయన స్క్రిప్టులోనే నోట్సు వ్రాసేవారు. ఆత్రేయ చిత్రాలలో చిరస్మరణీయమైనవి 'మూగమనసులు, ప్రేమనగర్, ఆకలిరాజ్యం'.

బి.ఎన్.రెడ్డిగారి మల్లీశ్వరి (1951) ద్వారా పరచయమైన రచయిత దేవులపల్లి వెంకటకృష్ణశాస్త్రి (1897-1980) ఆ చిత్రానికి పూర్తిగా మాటలు, పాటలు వ్రాసి తరువాత గీతాలపై మాత్రమే దృష్టి కేంద్రీకరించి ఉండమ్మా బొట్టు పెడతా! నాయిల్లు, బంగారుపాప, పూజాఫలం, రంగులరాట్నం, రాజమకుటం మొదలగు చిత్రాలకు సుమధుర సాహిత్యం అందించారు. మల్లీశ్వరి గీతాలన్నీ భావపరిపుష్టితో భాషాసౌందర్యంతో నాటికి నేటికి నిత్యనూతన గీతసుమాలై సుగంధాలను అందిస్తూనే వున్నాయి. భారత ప్రభుత్వం వీరిని పద్మభూషణ్ బిరుదుతో సత్కరించింది.

ప్రతిభా బలరామయ్యగారి 'చిన్నకోడలు' (1952) చిత్రం ద్వారా పరిచయమైన మల్లాది రామకృష్ణశాస్త్రి (1905-65) బహుభాషాకోవిదులు. దేశ విదేశాలకు చెందిన యాబది భాషల్లో ఆయనకు ప్రవేశం ఉంది. తేటతెలుగు మాటలతో తీయతీయని పాటలు అల్లటంలో ఆయన సిద్ధహస్తుడు. రాజనందిని, చిరంజీవులు, రేచుక్క వంటి బహుకొద్ది చిత్రాలకు మాటలు వ్రాశారు. రసికరాజతగువారము కామా, రాగమయిరావే (జయభేరి), రహస్యంలోని గిరిజాకళ్యాణం యక్షగానం, చిరంజీవులులోని కనుపాప కరువయిన కనులెందుకు, తెల్లవార వచ్చే తెలియక నాస్వామి, రేచుక్కలోని అన్ని పాటలు ఆయన ప్రతిభకు చెప్పుకోదగ్గవి.

వినోదావారి 'శాంతి' (1952) ద్వారా పరిచయమైన సముద్రాల రామానుజం (జూనియర్ 1923-85) ఆ మరు సంవత్సరం 'బ్రతుకు తెరువు' పాట 'అందమె ఆనందం - ఆనందమే జీవిత మకరందం'తో హిట్ కొట్టేసి ఆ తరువాత సుందరలాల్ నహతా నిర్మించిన అనేక అర్జంటు చిత్రాలకు (శభాష్‌రాముడు, శాంతి నివాసం, మంచిమనసుకు మంచిరోజులు) రచన చేశారు. ఈ రచనతో

చిరస్మరణీయమైన చిత్రాలు ఎన్.టి.రామారావు రూపొందించిన 'జయసింహ', 'పాండురంగ మాహాత్మ్యం'.

ఎ.వి.ఎమ్ వారి చిత్రాలకు (జీవితం, సంఘం) రచన చేసిన తోలేటి వెంకటరెడ్డి, చలం చిత్రాలకు (మట్టిలో మాణిక్యం, బుల్లెమ్మ బుల్లోడు) రచన చేసిన రాజశ్రీ, విశ్వశాంతి చిత్రాలకు (కంచుకోట, దేశోద్ధారకులు) రచన చేసిన మహారథి, విఠలాచార్య చిత్రాలకు (మధనకామరాజు కథ) రచన చేసిన జి.కె.మూర్తి, వీటూరి (చిక్కడు దొరకడు) - పాటలు, మాటలు వ్రాసి తమ ప్రతిభను నిరూపించుకున్నారు.

ప్రాధమికంగా కేవలం మాటలు మాత్రమే వ్రాసి పేరొందిన వారిలో.....

గాలివాన కథతో అంతర్జాతీయ ఖ్యాతి నొందిన పాలగుమ్మి పద్మరాజు బంగారుపాప (1954) చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేసి, భాగ్యరేఖ, బంగారుపంజరం, రంగులరాట్నం చిత్రాలకు రచన చేశారు.

1954లో వాహిని వారి పెద్దమనుషులు చిత్రం ద్వారా మాటల రచయితగా పరిచయమైన డి.వి.నరసరాజు, ఆ తరువాతి కాలంలో సాంఘిక (దొంగరాముడు, గుండమ్మకథ), పౌరాణిక (భక్తప్రహ్లాద), జానపద (రాజమకుటం), చిత్రాలకు సమసామర్థ్యంతో రచన చేశారు. వ్యంగ్య ధోరణితో హాస్యాన్ని రంగరించి గిలిగింతలు పెట్టే సంభాషణలు వ్రాయటంలో అందె వేసిన చెయ్యి.

సినిమాలపై సమీక్షలు, వందలాది వ్యాసాలు వ్రాసిన ముళ్ళపూడి వెంకటరమణ అమాంతం సినిమారచయితగా అవతారమెత్తి రక్తసంబంధంలో పవర్‌ఫుల్ డైలాగ్స్ అంతకుమించి పవర్‌ఫుల్ కామెడి డైలాగ్సు ఎడాపెడరాసేసి వ్యంగ్య హాస్యరసాలని మేళవించి రచన చేసిన సినిమాలు అనేకం. ముత్యాలముగ్గు, అందాలరాముడు, భక్త కన్నప్ప, శ్రీనాథ కవిసార్వభౌమ కొద్ది ఉదాహరణలు.

నాటకరంగంలో రచయితలుగా పేరొంది శతాధిక చిత్రాలకు రచన చేసినవారు గొల్లపూడి మారుతిరావు (ఇంట్లో రామయ్య-వీధిలో కృష్ణయ్య), భమిడిపాటి రాధాకృష్ణ (కథానాయకుడు), గణేష్‌పాత్రో (ఇదికథ కాదు), రావికొండలరావు (భైరవద్వీపం), కొర్రపాటి గంగాధరరావు (ఇద్దరు మిత్రులు),

ఎమ్.వి.ఎస్.హరినాథరావు (ప్రతిఘటన), ఆదివిష్ణు (కన్నెవయసు), దివాకరబాబు (రాజేంద్రుడు–గజేంద్రుడు), కాశీవిశ్వనాథ్ (ప్రేమనాటకం), మోదుకూరి జాన్సన్ (మరో ప్రపంచం), ఎన్.ఆర్.నంది (పుట్టినిల్లు –మెట్టినిల్లు).

హైద్రాబాదు ఏ.జి ఆఫీసులో పనిచేసిన పరుచూరి వెంకటేశ్వరరావు చలిచీమలకు, ఉయ్యూరు కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేసిన పరుచూరి గోపాలకృష్ణ చండశాసనుడుకు రచన చేశాక ఆ ఇద్దరు కలిసి రచన చేసిన అనురాగదేవతకు ఇద్దరి పేర్లు కలిసి వచ్చేలా పరుచూరి బ్రదర్స్ అని నామకరణం చేసారు యన్.టి.రామారావు. ఆనాటి నుంచి ఎన్నెన్నో హిట్స్... ఖైదీ, బొబ్బిలిబ్రహ్మన్న, మహాసంగ్రామం, బ్రహ్మరుద్రులు – అలా మూడు వందల చిత్రాలకు పైగా రచన చేసి రికార్డు సృష్టించారు.

ఆదుర్తి సుబ్బారావు మేనల్లుడు సత్యానంద్ 'మాయదారి మల్లిగాడు' చిత్రం ద్వారా రచయితగా పరిచయమై రెండు వందల చిత్రాలకు రచన చేశారు. రామానాయుడుగారి 'దేవత'కు రచన చేసిన సత్యమూర్తి, 'పోలీస్ బ్రదర్స్' ద్వారా పరిచయమైన పోసాని కృష్ణమురళి, 'మామగారు' చిత్రానికి రచన చేసిన తోటపల్లి మధు, విశ్వనాథ్ చిత్రాలకు రచన చేసిన ఆయన సోదరుడు సాయినాథ్ – ఇంకా పూసల వెంకటేశ్వరరావు (వారాలబ్బాయి), తనికెళ్ల భరణి (శివ), ఆకెళ్ళ (ఓ భార్యకథ), భీశెట్టి (భోళాశంకరుడు), జీడిగుంట రామచంద్రమూర్తి (అమెరికా అబ్బాయి), ఎస్.వి.రామారావు (త్రిలోకసుందరి), కొండముది శ్రీరామచంద్రమూర్తి (విశ్వనాథ నాయకుడు), ఎ.ఎస్.మూర్తి (మోహనరాగం), అజయ్ శాంతి (సొగసు చూడ తరమా), జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు (భారత్‌బంద్), దాసం గోపాలకృష్ణ (చిల్లరకొట్టు చిట్టెమ్మ), ఎల్.బి.శ్రీరామ్ (ఆ ఒక్కటి అడక్కు), పృధ్విరాజ్ (నిన్నే పెళ్ళాడతా),– ఇంకా పేరాల, సంజీవి, రాజా శివనంద, మరుదూరి రాజా, కృష్ణేశ్వరరావు, రాజేంద్రకుమార్ మొ॥ వారు రచయితలుగా వెలుగొందారు.

'తోడు' చిత్రానికి పాటలు, 'పాతనగరంలో పసివాడు' చిత్రానికి సంభాషణలు వ్రాసి సహదర్శకత్వం చేసిన రచయిత్రి ఓల్గా.

సినిమాకి ప్రాణం పాటలు. కేవలం పాటలు మాత్రమే వ్రాసి గీత రచయితలుగా పేరొందిన ప్రముఖులు :

'రైతుబిడ్డ' (1939) చిత్రానికి గీతాలు వ్రాసిన రచయిత కొసరాజు రాఘవయ్య చౌదరి. హాస్యగీతాలు, వ్యసనాల మీద (పేకాట, సిగరెట్టు) వ్రాసిన గీతాలు ఎంతగానో ప్రాచుర్యం పొందాయి. ఈయన వ్రాసిన ఉదాత్తగీతాల్లో చెప్పుకోదగ్గవి 'మత్తువదలరా...', 'ఏ నిముషానికి ఏమి జరుగునో...'.

అన్నపూర్ణ సంస్థ (ఇద్దరు మిత్రులు) ద్వారా పరిచయమైన గీత రచయిత దాశరథి. వీణ పాటలు వ్రాయటంలో స్పెషలిస్ట్ అనిపించుకున్నారు.

'గులేబకావళి కథ' చిత్రంతో గీత రచయితగా సినీరంగ ప్రవేశం చేసిన ఆచార్య సి.నారాయణరెడ్డి మూడు వేలకు పైగా విలక్షణ గీతాలను వ్రాశారు. దేవులపల్లి తరువాత సినీ కవుల్లో మరో పద్మభూషణుడయ్యాడు. మరో ఎత్తు ఎదిగి జ్ఞానపీఠాన్ని అందుకున్నారు.

'ఓ సీతకథ'తో విశ్వనాథుని గోల్డెన్ టచ్‌తో గీత రచయితగా ఆరంగేట్రమ్ చేసిన సాహితీ స్రష్ట వేటూరి సుందరరామ్మూర్తి అటు క్లాస్‌ను ఇటు మాస్‌ను సమసామర్థ్యంతో మెప్పించగల మేధావి. 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను హరీ..' అంటూనే 'దొరకునా ఇటువంటి సేవా...' అని కీర్తించటం, 'పాడవే పాడవే కోయిలా..., రాలేటి పూలరాగాలతో..., పూచేటి పూల గంధాలతో...' అంటూ పూలబాలలతో సయ్యాటలాడటం, కోయిలమ్మ పెండ్లికి కోనంత పందిరి వేయటం ఆయనకే చెల్లింది.

కళాతపస్వి మరో డిస్కవరీ (1986-సిరివెన్నెల) సీతారామశాస్త్రి ఈయన కూడా పండిత, పామరజనరంజకంగా రచన చేయటంలో సిద్ధహస్తుదనిపించు కున్నాడు.

విజయాబాపినీడు తీసిన 'నాకూ పెళ్ళాం కావాలి' ద్వారా రంగ ప్రవేశం చేసిన భువనచంద్ర హిందీ సినిమా పాటల సాహితీ సౌరభాల్ని జీర్ణం చేసుకొని వాటి సారాంశాన్ని తెలుగువారికి అందించిన విశిష్ట రచయిత.

'ముద్దాయి' చిత్రంతో గేయ రచయితగా పరిచయమైన వెన్నెలకంటి ఎక్కువగా అనువాద చిత్రాల రచన చేసినా 'స్వాతికిరణం'కు రాసిన 'కొండా కోనల్లో గోదారి గంగమ్మా పాయల్లో...', 'ఆదిత్య 369'కు వ్రాసిన రసరమ్యగీతం 'రాసలీల వేళ

రాయబారమేల...' చెప్పుకోదగినవి. 'చిల్లరకొట్టు చిట్టెమ్మ' రచయిత దాసం గోపాలకృష్ణకు పేరు తెచ్చిన పాట 'జోరుమీదున్నావు తుమ్మెద...' (శివరంజని). సుద్దాల అశోక్‌తేజ 'నమస్తే అన్న'తో పరిచయమై పలు గీతాలు వ్రాసి 'కంటే కూతుర్నే కను' చిత్రానికి వ్రాసిన 'ఆడకూతురా నీకు అడుగడుగున వందనం...' పాటకు ఎవార్డు పొందారు. సురేష్ వారి 'తాజ్‌మహల్' ద్వారా పరిచయమైన చంద్రబోస్ ఆ చిత్రంలో వ్రాసిన 'మంచుకొండల్లో చంద్రమా...' 'మాస్టర్' చిత్రానికి వ్రాసిన 'తిలోత్తమా...' పాటలు ప్రాచుర్యం పొందాయి. 'మౌనంగానే ఎదగమని' గీతానికి పురస్కారం లభించింది.

నాటి తరం నుంచి నేటి తరం దాకా తక్కువ పాటలు వ్రాసిన గుర్తింపుపొందిన రచయితలు :

చిలకమర్తి నరసింహం, దైతా గోపాలం, కొప్పరపు సుబ్బారావు, వేలూరి శివరామశాస్త్రి, బాలాంత్రపు రజనీకాంతరావు (స్వర్గసీమ), నళినీకాంతారావు, ప్రయాగ, కొండముది గోపాలరాయశర్మ (ప్రేమ), మల్లాది వెంకటకృష్ణ శర్మ, ముద్దుకృష్ణ (జయం మనదే), ఎడవల్లి లక్ష్మీనారాయణ, న్యాపతి రాఘవరావు, కామేశ్వరి (బాలానందం), పసుమర్తి యజ్ఞ నారాయణశాస్త్రి, రావూరు వెంకట సత్యనారాయణరావు, చక్రపాణి, కొండేపూడి లక్ష్మీనారాయణ, కొనకళ్ళ వెంకట రత్నం, రాంచంద్ (వద్దంటే పెళ్ళి), జాషువా, తాంద్ర సుబ్రహ్మణ్యం, గబ్బిట వెంకటరావు (విష్ణుమాయ), బైరాగి, నారపరెడ్డి (దొంగల్లో దొర), నాగరాజు, కనకమేడల, గుంటూరు శేషేంద్రశర్మ (ముత్యాలముగ్గు), ఎం.వి.ఎల్.కోపెల్లె శివరాం (కొత్తనీరు), చిల్లర భావన్నారాయణ, ఆచార్య తిరుమల, అదృష్టదీపక్, ఓంకార్, సామవేదం షణ్ముఖశర్మ, దేవీప్రియ, సాయికృష్ణ యాచేంద్ర, పైడిపాల, జి.విజయరత్నం (కథానాయకురాలు), భుజంగరాయశర్మ (రంగులరాట్నం టైటిల్ సాంగ్), జాలాది (తూర్పు వెళ్ళే రైలు), డా॥ నెల్లుట్ల (వేజెళ్ళ చిత్రాలు). రసరాజు (అసెంబ్లీరౌడి), వడ్డేపల్లి కృష్ణ (భైరవద్వీపం), గురుచరణ్ (అల్లుడుగారు). ఇలా ఎందరో సాహితీమూర్తులు తెలుగుపాటకు జిలుగువెలుగులందించారు.

∴ ∴ ∴

# సంగీతం

టాకీల తొలి దశలో నాటకాలే ఎక్కువగా సినిమాలుగా రూపొందటం వల్ల ఆ నాటక పద్యాలే సినిమాలో కూడా వుండేవి. అయితే నటీనటులు పాడుతూ వుంటే సమాంతరంగా వేరొక ట్రాలీ మీద వాయిద్యాలను వుంచి పలికించి, అవి కనిపించకుండా చిత్రీకరించేవారు. 1940 ప్రాంతాల్లో ప్లేబాక్ పద్ధతి అమలులోకి వచ్చాక నటీనటులకు వేరే గాయనీగాయకులు గాత్రదానం చేసే ప్రక్రియ ప్రారంభమైంది. దాంతో నేపథ్య గాయనీగాయకులకు ప్రోత్సాహం లభించింది.

తొలి తెలుగు టాకీ 'భక్తప్రహ్లాద'లో యథాతథంగా నాటకపద్యాలు వాడినా దానికి సంగీతం అందించినది. హెచ్.ఆర్. పద్మనాభశాస్త్రి, ఆ కారణంగా ఆయన్నే తొలిసినీ సంగీత నిర్దేశకునిగా పేర్కొనటం సబబు. ఆ తరువాత వచ్చిన 'తహసిల్దారు', 'పేదరైతు' ఆయన ఇతర చిత్రాలు.

స్వంత బాణీలు కట్టి పాటలను హిట్ చేసిన 'లవకుశ' (1934) సంగీత దర్శకుడు ప్రభల సత్యనారాయణ (అనసూయ, గృహలక్ష్మి). అదే సంవత్సరం వచ్చిన 'సీతా కళ్యాణం'కు సంగీతం అందించిన మహనీయ వ్యక్తి గాలిపెంచల నరసింహారావు తరువాత ప్రతిభా వారి 'గరుడ గర్వభంగం', 'మాయాలోకం', 'బాలరాజు', ఎన్.టి.ఆర్ రూపొందించిన 'సీతారామకళ్యాణం' (1961) చిత్రాలకు సంగీత రచన చేశారు. ఈయన స్వరపరచిన 'సీతారాముల కళ్యాణం చూతమురారండి...' ప్రతి పెళ్లిపందిట్లోను మారుమ్రోగుతుంది.

1936లో పోటీగా నిర్మించబడ్డ 'ద్రౌపదీ వస్త్రాపహరణం' సంగీత దర్శకుడు భీమవరపు నరసింహారావు (బి.ఎన్.ఆర్) ఆయన ఆ తరువాత పలు చిత్రాలకు జనరంజక బాణీలు అందించారు. వాటిల్లో చెప్పుకోదగ్గవి 'మాలపిల్ల', 'రైతుబిడ్డ', 'అర్ధాంగి'. వీరు 'దొంగలున్నారు జాగ్రత్త' చిత్రానికి దర్శకత్వం వహించారు. ప్రముఖ నటుడు చిత్తూరు వి.నాగయ్య వాహినీ వారి 'వందేమాతరం'తో ప్రారంభించి 'దేవత, పోతన, స్వర్గసీమ, వేమన' చిత్రాలకు, స్వయంగా స్వీయదర్శకత్వంలో నిర్మించిన 'త్యాగయ్య, నా యిల్లు, రామదాసు' చిత్రాలకు సంగీతం అందించారు.

ఓగిరాల రామచంద్రరావు సంగీతంతో రూపొందిన చిత్రాలు 'మళ్ళీ పెళ్ళి, విశ్వమోహిని, పరమానందయ్య శిష్యులకథ (శివరావు తీసినది), పెద్దమనుషులు, గుణసుందరి కథ' ఈయన స్వరపరచిన 'శ్రీ తులసీ జయ తులసీ జయమునియ్యవే..' గీతాన్ని ఇప్పటికీ తెలుగింట గృహిణులు పాడుకుంటూనే వున్నారు.

సంగీత దర్శకుడిగా ఎస్.రాజేశ్వరరావు తొలిచిత్రం 'జయప్రద' (1939) నాటి నుంచి 115 చిత్రాలకు అద్భుతమైన సంగీతాన్ని అందించారు. మెలోడి ప్రాధాన్యతతో స్వరాలు సమకూర్చటం ఆయన ప్రత్యేకత. 'మల్లీశ్వరి' గీతాలన్నీ మానసోల్లాస సంగీత సౌరభాల్ని వెదజల్లినవే! అన్నపూర్ణవారి 'ఇద్దరుమిత్రులు, డాక్టర్ చక్రవర్తి', పి.ఎ.పి.వారి 'భార్యాభర్తలు, కులగోత్రాలు', బి.ఏ.సుబ్బారావు గారి 'రాజు–పేద, చెంచులక్ష్మి, భీష్మ', విక్రంవారి 'అమరశిల్పి జక్కన', విజయావారి 'మిస్సమ్మ, అప్పుచేసి పప్పుకూడు', భరణీవారి 'విప్రనారాయణ' – ఇలా ఎన్నో... స్వతహాగా గాయకుడైన నాగయ్యకు రాజేశ్వరరావు 'బొబ్బిలియుద్ధం' చిత్రంలో ప్లేబాక్ పాడటం ఓ విశేషం.

ఆర్.సుదర్శనం, గోవర్ధనం ఇద్దరూ కలిసి ఎ.వి.యం వారి చిత్రాలకు (సంఘం, భూకైలాస్) పని చేశారు. తరువాత విడివిడిగా కొన్ని సినిమాలకు సంగీతాన్ని అందించారు.

సి.ఆర్.సుబ్బరామన్ సంగీత దర్శకుడిగా టైటిల్‌పడ్డ మొదటి చిత్రం 'రత్నమాల'. ఆ తరువాత ఆయన అమృతతుల్యమైన సంగీతాన్ని అందించిన చిత్రాలు – 'లైలామజ్ను, స్త్రీసాహసం, స్వప్నసుందరి, ధర్మదేవత, రూపవతి, ప్రేమ, దాసి, అమ్మలక్కలు, దేవదాసు'. వినోదా సంస్థ రూపొందించిన చిత్రాల నిర్మాణంలో ఆయన భాగస్తుడు కూడా.

సి.ఆర్.సుబ్బరామన్ వద్ద వాద్యగోష్ఠిలో పనిచేసిన ఎం.ఎస్.విశ్వనాథం, రామ్మూర్తి చాలాకాలం జంటగా 'మాగోపి, తెనాలి రామకృష్ణ, మంచీ–చెడు, పెళ్ళి తాంబూలం' వంటి చిత్రాలకు పనిచేసిన ఆపై విడిపోయిన తరువాత రామ్మూర్తి గూర్చి వినిపించకపోయినా ఎం.ఎస్.విశ్వనాధన్, కె.బాలచందర్

రూపొందించిన 'అంతులేనికథ, మరోచరిత్ర, ఆకలిరాజ్యం, ఇది కథకాదు, గుప్పెడు మనసు' వంటి చిత్రాలకు కదిలించే రాగాల్ని శ్రావ్యంగా అందించారు.

'నారదనారది' చిత్రం ద్వారా పరిచయమైన సుసర్ల దక్షిణామూర్తి మంచి గాయకుడు కూడా. 'ఇలవేల్పు' చిత్రంలో రేలంగికి ప్లేబాక్ పాడారు. ఆయన చిత్రాలలో శాస్త్రీయ సంగీతపు అంశ ఎక్కువగా వుండేది. ఆయన సంగీతం అందించిన చిత్రాలలో ఎన్నదగినవి 'సంసారం, సంతానం, నర్తనశాల'. 'సంతానం' చిత్రంలో లతామంగేష్కర్ చేత 'నిదురపోరా తమ్ముడా...' పాడించిన ఘనుడు.

సుసర్ల వద్ద పనిచేసిన ఎస్.పి.కోదండపాణి తొలిసారిగా సంగీతాన్ని అందించిన చిత్రం 'కన్నకొడుకు'. ఈయన చిత్రాలలో చెప్పుకోదగ్గవి 'గోపాలుడు-భూపాలుడు, పండంటి కాపురం, దేవత'. కాగా 'శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న' చిత్రం ద్వారా ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యంను పరిచయం చేశారు.

'ద్రోహి' చిత్రం ద్వారా పరిచయమైన పెండ్యాల నాగేశ్వరరావు చిత్రాలలో చెప్పుకోదగ్గవి – 'దొంగరాముడు, వెలుగునీడలు, జయభేరి, జగదేకవీరునికథ, మహామంత్రి తిమ్మరుసు, బావా మరదళ్లు, శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం, శ్రీ కృష్ణార్జునయుద్ధం, దానవీర శూరకర్ణ' చిరస్మరణీయ చిత్రాలు. ఆయన స్వరపరచిన వందలాది గీతాల్లో 'జయభేరి'లోని 'రసికరాజతగువారముకామా...', 'జగదేకవీరుని కథ'లోని 'శివశంకరి శివానందలహరి...' గీతాలు సంగీతంలో ఘనపాఠీలుగా చెల్లుబాటవుతున్న వారందరు ఒకసారైనా పాడి తరించాలనే తలపు కలిగించే గీతాలుగా చెప్పుకోవచ్చు. 'కన్నతల్లి' చిత్రం ద్వారా సుశీలను, 'ఎమ్.ఎల్.ఎ' చిత్రం ద్వారా జానకిని సినీరంగానికి పరిచయం చేశారు.

గంధర్వ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 1949లో నటి, గాయని కృష్ణవేణి రూపొందించిన మూడు చిత్రాలకు (కీలుగుర్రం, మనదేశం, లక్ష్మమ్మ) సంగీతాన్ని అందించారు. శతాధిక చిత్రాలకు స్వరాలు సమకూర్చారు. వాటిల్లో 'పల్లెటూరు, పెళ్ళిచేసి చూడు, చిరంజీవులు, మాయాబజార్, పెళ్ళినాటి ప్రమాణాలు, పెళ్లిసందడి, శాంతినివాసం, గుండమ్మకథ, బందిపోటు, లవకుశ,

పాండవ వనవాసం, పరమానందయ్య శిష్యులకథ, రహస్యం, రక్తసంబంధం' చెప్పుకోవాలి. స్వయంగా 'పరోపకారం, సొంతవూరు, భక్తరఘునాథ్' చిత్రాలను నిర్మించి చేదు అనుభవాల్ని చవిచూశారు. వేలాది పాటలు పాడిన ఘంటసాల వెంకటేశ్వరరావును భారత ప్రభుత్వం పద్మశ్రీ బిరుదుతో సత్కరించింది.

1950లో 'పల్లెటూరి పిల్ల' చిత్రానికి సంగీత దర్శకునిగా పరిచయమైన పి.ఆదినారాయణరావు విలక్షణ సంగీత స్రష్ట. మంచికథకుడు. అంజలి పతాకంపై నిర్మించిన చిత్రాలకు (పరదేశి, అనార్కలి, సువర్ణసుందరి, స్వర్ణమంజరి, భక్త తుకారామ్, మహాకవి క్షేత్రయ్య) చిరస్మరణీయ సంగీతం అందించారు. ఆ చిత్రాల్లోని పాటలన్నీ సూపర్ హిట్స్. ఆయన ఇతర సంస్థలకు పనిచేసిన చిత్రాలు చెప్పుకోదగ్గవి కృష్ణ నిర్మించిన 'మోసగాళ్లకు మోసగాడు, అల్లూరి సీతారామరాజు'.

ఆదినారాయణరావు వద్ద సహాయకునిగా పనిచేసిన టి.వి.రాజు మొదటి చిత్రం 'టింగురంగ'. ఆయన ఇతర చిత్రాల్లో 'జయసింహ, రాజనందిని, బాలనాగమ్మ, శ్రీకృష్ణావతారం, భలే తమ్ముడు, శ్రీకృష్ణమాయ, ఉమ్మడి కుటుంబం, కోడలుదిద్దిన కాపురం, చిక్కడు-దొరకడు' మొదలైనవి. ఆయన్ని చరితార్థుని చేసిన భక్తిరస చిత్రం 'పాండురంగమాహాత్మ్యం'.

అటు ఆదినారాయణరావు వద్ద ఇటు టి.వి.రాజు వద్ద సహాయకునిగా పనిచేసిన సత్యం 'పాలమనసులు' ద్వారా సంగీత దర్శకునిగా పరిచయమయ్యారు. నటుడు చలం రూపొందించిన (బుల్లెమ్మ-బుల్లోడు, మట్టిలో మాణిక్యం, తోటరాముడు). నిర్మాత భావన్నారాయణ నిర్మించిన 'బాలమిత్రుల కథ, కన్నె వయస్సు' (ఈ చిత్రంలోని స్మరణీయ గీతం 'ఏ దివిలో విరిసిన పారిజాతమో') చిత్రాలకు మధురమైన సంగీతాన్ని అందించారు.

1950లో పక్షిరాజా వారి 'బీదలపాట్లు' ద్వారా పరిచయమైన అశ్వత్థామ జీవితంలో 'కలిమిలేములు, చివరకు మిగిలేది, పక్కింటి అమ్మాయి, రేచుక్క' చెప్పుకోదగిన చిత్రాలు.

1953లో డాక్టర్ రాజారావు 'పుట్టిల్లు' ద్వారా పరిచయమైన ప్రజానాట్యమండలి సంగీత దర్శకుడు టి.చలపతిరావు సంగీతంతో రూపొందిన

చిత్రాలు 'ఇల్లరికం, నవరాత్రి, మనుషులు మమతలు'. తమ్మారెడ్డి కృష్ణమూర్తి చిత్రాలు 'లక్షాధికారి, జమీందారు, బంగారుగాజులు'.

పల్లెటూరి వాతావరణానికి చెందిన సంగీతాన్ని అందించడంలో తన ప్రత్యేకతను చాటుకున్నారు మాస్టర్ వేణు (రోజులు మారాయి, తోడికోడళ్లు).

'దాంపత్యం' (1957) చిత్రం ద్వారా పరిచయమైన రమేష్‌నాయుడు స్వరకల్పనతో రాణించిన చిత్రాలు 'అమ్మ మాట, శివరంజని, తూర్పుపడమర, దేవుడు చేసిన మనుషులు'. 1982లో 'మేఘసందేశం' చిత్రానికి ఉత్తమ సంగీత దర్శకునిగా కేంద్ర ప్రభుత్వ బహుమతి పొందారు.

'దొంగలున్నారు జాగ్రత్త' చిత్రంతో పరిచయమైన కె.వి.మహదేవన్ ఐదు వందల పైచిలుకు చిత్రాలకు సంగీతాన్ని అందించారు. బాబూ మూవీస్‌కు (మంచి మనసులు, మూగ మనసులు, తేన మనసులు), జగపతి పిక్చర్స్‌కు (ఆత్మబలం, అంతస్తులు, దసరాబుల్లోడు), సురేష్ పిక్చర్స్‌కు (ప్రేమ్‌నగర్, సెక్రటరీ), విశ్వనాథ్ చిత్రాలకు (శంకరాభరణం, సిరిసిరిమువ్వ), మురారి చిత్రాలకు (గోరింటాకు, త్రిశూలం), విశ్వశాంతి చిత్రాలకు (కంచుకోట, దేశద్రోహులు) అద్భుతమైన గీతాలను స్వరపరచి, సినీ సంగీత గగనాన చంద'మామ'గా నిలిచిపోయారు.

రికార్డు స్థాయిలో ఏడు వందల పైచిలుకు చిత్రాలకు సంగీతాన్ని అందించిన ఘనుడు చక్రవర్తి. అటు రాఘవేంద్రరావు (వేటగాడు, జస్టిస్ చౌదరి), ఇటు దాసరి నారాయణరావు (ప్రేమాభిషేకం, ఏడంతస్తుల మేడ) రూపొందించిన చిత్రాలకు అందించిన సంగీతం ఆ చిత్ర విజయాలకు సహకరించింది. సరదాగా అప్పుడప్పుడు వేషాలు కూడా వేశారు చక్రవర్తి (పక్కింటి అమ్మాయి).

కన్నడ రంగంలో పేరొందిన రాజన్ నాగేంద్ర - విఠలాచార్య సినిమాలకు (వరలక్ష్మీ వ్రతం, కనకదుర్గ పూజా మహిమ), నవతా కృష్ణంరాజు సినిమాలకు (పంతులమ్మ, ఇంటింటి రామాయణం) హాయిగొలిపే సంగీతాన్ని అందించారు. వీరి వద్ద పనిచేసిన ఇళయరాజా నేటి యువతకు కావల్సిన స్పీడుతో పాటు పాతతరం కోరుకునే మెలోడీని మేళవించి సంగీతంలో కొత్త ప్రయోగాలు చేసి (ఛాలెంజ్, రాక్షసుడు, సీతాకోకచిలుక, సాగరసంగమరం, సితార, గీతాంజలి)

మంచి ఫలితాలు సాధించారు. 1983లో 'సాగరసంగమం'కు, 1988లో 'రుద్రవీణ'కు ఉత్తమ సంగీత దర్శకునిగా ప్రభుత్వ బహుమతి పొందారు.

ఇంకా కన్నడరంగంలో పేరొందిన టి.జి.లింగప్ప (గాలిమేడలు), హంసలేఖ (ముత్యమంత ముద్దు), జి.కె.వెంకటేష్ (అమెరికా అమ్మాయి). తెలుగువారికి తమ ప్రతిభను తెలియజేశారు.

యస్.రాజేశ్వరరావుగారి అబ్బాయిల్లో ముగ్గురు సినీసంగీత దర్శకులుగా పరిచయమయ్యారు. రామలింగేశ్వరరావు 'రాధమ్మమొగుడు', వాసురావు 'పోలీస్ ఆఫీసరు'తో ప్రారంభించి 'నాకు పెళ్ళాం కావాలి' వంటి హిట్స్ అందించారు. ఇంకో అబ్బాయి కోటేశ్వరరావు టి.వి.రాజుగారి అబ్బాయి రాజ్‌తో కలసి రాజ్–కోటి పేరుతో 'ప్రళయగర్జన'తో మొదలుపెట్టి పలు చిత్రాలకు పని చేశారు. విడిపోయిన తరువాత రాజ్ చేసిన వాటిల్లో చెప్పుకోదగినది 'సిసింద్రీ'. కోటి చేసిన వాటిల్లో 'హలో బ్రదర్, పెదరాయుడు, నువ్వేకావాలి, అరుంధతి' చిత్రాలు యెన్నదగినవి.

గాయకుడిగా పరిచయమైన బాలు సంగీతాన్ని అందించిన చిత్రాలు 'తూర్పుకు వెళ్లే రైలు', 'పడమటి సంధ్యారాగం', 'మయూరి'.

యం.యం.కీరవాణి యీ చివరి దశాబ్దంలో చేసిన సంగీత విన్యాసాలు అపూర్వంగా వైవిధ్యభరితంగా ఉన్నాయి. 'అల్లరిప్రియుడు, పెళ్ళిసందడి, అన్నమయ్య, సీతారామయ్యగారి మనవరాలు' బహుకొద్ది ఉదాహరణలు. ఈయన మంచి గాయకుడు కూడా. 'అన్నమయ్య' చిత్రానికి ఉత్తమ సంగీత దర్శకునిగా కేంద్ర ప్రభుత్వ బహుమతి పొందారు.

వీరి సోదరి శ్రీలేఖ పిన్నవయసులోనే సంగీత దర్శకత్వం వహించారు (తాజ్‌మహల్). సంగీత కుటుంబానికి చెందిన మాధవపెద్ది సురేష్, హాయిగొలిపే సంగీతాన్ని అందించిన చిత్రాలు 'బృందావనం, భైరవద్వీపం'.

వందేమాతరం శ్రీనివాస్ గాయకుడిగా జీవితాన్ని ప్రారంభించి ఆ తరువాత ఆర్.నారాయణమూర్తి మార్క్ చిత్రాలకు సంగీతం అందించి ఆ కోవలో దాసరి తీసిన 'ఒసేయ్ రాములమ్మ' హిట్ చేశారు. ఆయన మెలోడీతో విజయవంతమైన చిత్రం 'స్వయంవరం'.

తన సంగీత ప్రభంజనంతో దేశాన్ని వుర్రూతలూగిస్తున్న ఎ.ఆర్.రెహమాన్ తెలుగులో సంగీతం అందించిన చిత్రాలు 'సూపర్ పోలీసు, గ్యాంగ్ మాస్టర్, పల్నాటియుద్ధం'.

మ్యూజిక్ డైరెక్టర్ ఆఫ్ ది సీజన్‌గా గుర్తించబడ్డ మణిశర్మ చిత్రాలు (చూడాలని వుంది, రాజకుమారుడు), సందీప్ చౌత (నిన్నే పెళ్లాడతా), శశిప్రీతమ్ (గులాబి), రమణగోగుల (తమ్ముడు), ఎస్.ఎ.రాజ్‌కుమార్ (సూర్యవంశం), చక్రి - ఇలా ఎందరో...

గాయకులుగా రాణించిన వారిలో ఘంటసాల తరువాత చెప్పుకోదగ్గ గుర్తింపు పొందినవారు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, పి.బి.శ్రీనివాస్, ఎ.ఎమ్.రాజా, మాధవపెద్ది సత్యం, పిఠాపురం నాగేశ్వరరావు, రామకృష్ణ, కె.జె.జేసుదాసు, జి.ఆనంద్, రాజ్‌సీతారామ్, మంగళపల్లి బాలమురళీకృష్ణ, నూకల చినసత్యనారాయణ, కె.బి.కె.మోహనరాజు, చిత్తరంజన్ మొదలగువారు.

ఇతర భాషా గాయకులు ఉన్ని కృష్ణన్, ఉదిత్ నారాయణ్, హరిహరన్, సురేష్ పీటర్, తెలుగు భాషలో తెలుగుపాటకు ప్రాణం పోయడానికి ప్రయత్నిస్తున్నారు. గాయనీమణుల్లో ఆర్.బాలసరస్వతి, పి.లీల, పి.జి.కృష్ణవేణి (జిక్కి), పి.సుశీల, కె.రాణి, యస్.జానకి, ఎ.పి.కోమల, జమునారాణి, ఎల్.ఆర్.ఈశ్వరి, వాణిజయరామ్, స్వర్ణలత, ఎమ్.ఎల్.వసంతకుమారి, రాధా జయలక్ష్మి, సూలమంగళం రాజ్యలక్ష్మి, ఆశాలత కులకర్ణి, చిత్ర, ఎస్.పి.శైలజ, మాల్గాడి శుభ, సుజాత, స్వర్ణలత, సునీత, ఉషా - ఇలా ఎందరో తమ గానంతో గీతాలకు ప్రాణం పోస్తున్నారు.

హిందీ చిత్ర రంగానికి చెందిన దర్శకులు శంకర్ జైకిషన్ (జీవిత చక్రం), సి.రామచంద్ర (అక్బర్ సలీం అనార్కలీ), లక్ష్మీకాంత్ ప్యారేలాల్ (మజ్నూ), సలీల్ చౌదరి (ఛైర్మన్ చలమయ్య), ఆర్.డి.బర్మన్ (అంతం), బప్పీలహరి (సింహాసనం), చిత్రాలకు సంగీతం సమకూర్చగా ఆశాభోంస్లే (పవిత్రబంధం), కవితా కృష్ణమూర్తి (సిద్దార్థ), రఫీ (ఆరాధన, భలేతమ్ముడు), తలత్ మహమ్మద్ (మనోరమ) తెలుగు గీతాల్ని తమ గళంలో వినిపించారు.

⁘ ⁘ ⁘

# నృత్యం

సినిమా రూపకల్పనలో నృత్యానికి ఎంతో ప్రాధాన్యం వుంది. అది కూచిపూడి కావచ్చు. భరతనాట్యం కావచ్చు. జానపద నృత్యం గావచ్చు. కథాకళి కావచ్చు. భాంగ్రానృత్యం గావచ్చు. లేక విదేశాల నుంచి దిగుమతి చేసుకొన్న రాక్ అండ్ రోల్ గావచ్చు. ఆధునిక ప్రక్రియల్లో మరేపేరుతో అయినా పిలవవచ్చు. కావలసిన ఫలితం ఆనాడు కానీ యీనాడుకానీ ఒక్కటే... కథలో సన్నివేశపరంగా జనాన్ని ఆకర్షించగల డాన్సులు వుండాలి. ఈ మేరకు తెలుగుసినీరంగంలో సంప్రదాయ నాట్యరీతుల్ని అభ్యసించి దానిని సినిమాకు తగ్గట్టుగా మలచగలగినవారు డాన్సు మాస్టర్లు. డాన్సు డైరెక్టర్లయి కనువిందొనర్చు నృత్యాలకు రూపకల్పన చేశారు.

కూచిపూడి నుంచి వచ్చి మద్రాసులో సినీరంగంలో నృత్యదర్శకులుగా స్థిరపడ్డ ప్రముఖ వ్యక్తి వేదాంతం రాఘవయ్య. అటు ప్రతిభావారి చిత్రాలు గరుడగర్వభంగంగా (ఇందులో వేషం కూడా వేశారు). బాలరాజు, స్వప్నసుందరి యిటు భరణీవారి లైలామజ్నూకు నృత్య దర్శకత్వం వహించి ఆపై వినోదా సంస్థలో భాగస్వామియై దర్శకుడయ్యాడు.

వాహినీ వారి 'మల్లీశ్వరి'కి సంప్రదాయబద్ధమైన నృత్యరీతులు సమకూర్చిన నాట్యాచార్యులు పసుమర్తి కృష్ణమూర్తి. విజయావారి 'పాతాళభైరవి, చంద్రహారం, మాయాబజార్, జగదేకవీరునికథ' చిత్రాలకు, ఇతరసంస్థలకు పనిచేసిన 'పాండవవనవాసం', నృత్య ప్రధానమైన 'సిరిసిరిమువ్వ' చెప్పుకోదగ్గవి. 'మాయాబజార్'లోని 'అహనాపెళ్లంటా...' పాటకు సమకూర్చిన నృత్యభంగిమలు, 'మోహినీభస్మాసుర' దృశ్యరూపకాన్ని ఆహ్లాదంగా కంపోజ్ చేశారు.

టాకీ వచ్చిన మూడు నాల్గు దశకాల్లో (951-70) పేరేన్నికగన్న నృత్యదర్శకుడు వెంపటి సత్యం, సంగీత నృత్య ప్రధానంగా సాగిన 'సువర్ణసుందరి' చిత్రం. ఈయన గూర్చి ప్రత్యేకంగా ప్రస్తావించవలసిన చిత్రం 'నర్తనశాల'. విరాటరాజు కొలువులో బృహన్నల (యన్.టి.రామారావు), ఉత్తరకు (ఎల్.విజయలక్ష్మి)కి నాట్యం నేర్పిన సలలితరాగసుధారస సారం పాటకు భంగిమలు బృహన్నల చూపగా ఉత్తర అనుకరించటం అపురూపం.

కె.దండాయుధపాణి 'భూకైలాస్' చిత్రానికి వైవిధ్యంగా నృత్యాలను రూపొందించారు. ఇందులో హిందీ రంగానికి చెందిన గోపీకృష్ణ, హెలెన్, ప్రఖ్యాత నర్తకి కమలాలక్ష్మణ్ వీరిపై చిత్రీకరించిన గీత నృత్యభంగిమలు చెప్పుకోదగ్గవి.

ఆ రోజుల్లో హీరాలాల్ (1960-75) నేతృత్వంలో కొత్తపోకడల్లో జనరంజకమైన నృత్యాలు రూపొందించబడ్డాయి. తెలుగులో తొలిసారిగా భాంగ్రా నృత్యం (నీ నల్లని జడలో పూలు) కులగోత్రాలు చిత్రంలో ప్రవేశపెట్టారు. 'మంచి మనసులు' (మావా మావా...), 'మూగమనసులు' (గౌరమ్మా నీ మొగుడెవరమ్మా..) - ప్రేక్షకుల్ని ఆకర్షించాయి. హీరాలాల్ జీవితంలో హైలైట్‌గా చెప్పుకోదగ్గది - 'దసరాబుల్లోడు' చిత్రంలో అక్కినేని చేత పులినృత్యం చేయించటం. నిజానికి ఆరోజుల్లో వింతగా ఆ సన్నివేశాన్ని ఎంజాయ్ చేస్తూ థియేటర్లో యీలలు వేశారు ప్రేక్షకులు.

చిన్ని - సంపత్ అనే ఇద్దరు నృత్యదర్శకులు అటు విఠలాచార్య జానపద (అగ్గిపిడుగు) చిత్రాలకు హుషారైన నృత్యాల్ని అందిస్తూ మరోవైపు జల్సారాయుడు వంటి చిత్రాలకు రాకెన్‌రోల్ తరహాలో 'రాకు రాకు రాకు నా దగ్గరికి' అనేపాటకు పాశ్చాత్య రీతుల్లో నృత్య భంగిమల్ని సమకూర్చారు.

వెంపటి చినసత్యంగారి వద్ద తర్ఫీదు పొందిన శేషు మాష్టారు నృత్య దర్శకునిగా మారి 'ఆనందభైరవి, సాగరసంగమం, సీతాకోకచిలుక, మయూరి, శంకరాభరణం, స్వాతిముత్యం, ముత్యాలముగ్గు' వంటి చిత్రాలకు కలకాలం గుర్తుంచుకోదగ్గ నృత్యరీతుల్ని సమకూర్చారు. గోపీకృష్ణ వద్ద ట్రైనింగ్ పొందిన సలీమ్ మాష్టారు తెలుగులో సుమారు 500 పైగా చిత్రాలకు నృత్యదర్శకత్వం వహించి రికార్డు నెలకొల్పారు. అగ్రశ్రేణి కథానాయకులందరి చిత్రాలకు ఆయన నృత్య దర్శకత్వం వహించి తన బహుముఖ ప్రజ్ఞ నిరూపించుకున్నారు. అక్కినేనికి ప్రేమాభిషేకం, అనుబంధం, యన్.టి.ఆర్.కు వేటగాడు, సర్దార్ పాపారాయుడు, కృష్ణకు ఊరికిమొనగాడు, చిరంజీవికి అడవిదొంగ, గూండా వంటి హిట్స్ బహుకొద్ది వుదాహరణలు మాత్రమే! ఖైదీ చిత్రానికి ఈయన మాధవి-చిరంజీవి కోసం స్నేక్‌డాన్సు తరహాలో కంపోజ్ చేసిన 'రగులుతోంది మొగలిపొద' భంగిమలు ప్రేక్షకుల్లో సంచలనం కలిగించాయి.

తమిళ చిత్రరంగానికి చెందిన లారెన్స్, ప్రభుదేవా ఇద్దరూ తెలుగులో ఈ తరం కథానాయకులకు నవీన పద్ధతుల్లో నృత్యాలను సమకూర్చటమే కాకుండా కొన్ని చిత్రాలకు దర్శకత్వం కూడా వహించారు.

స్నేహచిత్ర పతాకంపై ఆర్.నారాయణమూర్తి నిర్మించిన చిత్రాలకు సీనియర్ నృత్య దర్శకుడు ముక్కురాజు నృత్యాలు కంపోజ్ చేయడమే గాకుండా కొన్ని పాత్రల్ని కూడా పోషించారు.

డాన్సు మాస్టర్ సుచిత్ర మనీషా సంస్థ నిర్మించిన 'రాజేంద్రుడు-గజేంద్రుడు', పలు చిత్రాలకు నృత్య దర్శకత్వం వహించారు.

సాధారణ డాన్సర్‌గా ప్రవేశించిన కె.ఎస్.రెడ్డి 'రాముడు-భీముడు, వెలుగునీడలు' తరువాత డాన్సు మాస్టరయి 'టక్కరి దొంగ - చక్కనిచుక్క, ధర్మదాత, బంగారు గాజులు' మొదలైన చిత్రాలకు నృత్య దర్శకత్వం వహించి స్వీయదర్శకత్వంలో 'కొరడారాణి' చిత్రాన్ని నిర్మించారు.

తంగప్పన్ (ఆత్మీయులు), ఎ.కె.చోప్రా (మూగనోము, ఆకాశరామన్న), వేణుగోపాల్ (బొబ్బిలియుద్ధం), నాగేశ్వరరావు (కొదమసింహం), పి.జె.శర్మ (పెద్దరికాలు), తార (అదృష్టవంతులు), ప్రమీల (శుక్రవారం మహాలక్ష్మి), రాజన్‌రాజు (అల్లుడు పట్టిన భరతం) సీనియర్లుగా పలు చిత్రాలు నృత్య దర్శకత్వం వహించారు.

ఇహ యీ చివరి దశాబ్దంలో నృత్య దర్శకులుగా పలు చిత్రాలకు నూతన పోకడల్లో స్పీడుగా నృత్యాల్ని తీర్చిదిద్దుతున్న వారిలో కొందరు నల్లశీను, ప్రేమలత, చిన్ని-ప్రకాశ్, అనురాధ, డి.కె.యస్, బాబు, శివశంకర్, కె.ఎస్.రఘురాం, తార, ప్రసాద్ మొదలైనవారిని పేర్కొనాలి.

ఒక్క నృత్య సన్నివేశం సినిమాను సూపర్‌హిట్ చేసిందంటే ఆశ్చర్యం వేస్తుంది. కానీ ఇది నిజం. 'రోజులు మారాయి' చిత్రానికి వెంపటి సత్యంగారు కంపోజ్ చేయగా, నర్తకి వహీదారెహమాన్‌పై చిత్రీకరించిన 'ఏరువాకా సాగారో రన్నా చిన్నన్నా...' అనే నృత్యం పదే పదే చూసిన ప్రేక్షకులు ఉన్నారు. ఆ రోజుల్లో వీధుల్లో జరిగే రికార్డింగ్ డాన్సుల్లో ఆ పాట తప్పనిసరిగా ఉండేది.

⁘ ⁘ ⁘

# కళ

గత శతాబ్దంలో నిర్మించబడ్డ పౌరాణిక, జానపద, చారిత్రక చిత్రాల నిర్మాణానికి సంబంధించినంత వరకు కళాదర్శకులపైన గురుతరమైన బాధ్యత ఉండేది. కథా కాలాన్ని బట్టి, సన్నివేశానికి తగ్గ సెట్సును రూపకల్పన చేయటం పాత్రధారుల యొక్క వేష భాషలకు సంబంధించిన స్కెచెస్ వేయటం కళాదర్శకుని బాధ్యత.

తొలిదశలో ప్రఖ్యాత చిత్రకారుడు, రచయిత అడవి బాపిరాజు, అనసూయ, ధ్రువ, మీరాబాయి చిత్రాలకు కళా దర్శకత్వం నెరపారు. తొలితరానికి చెందిన వారిలో సీనియర్ కళాదర్శకుడు యస్.వి.యస్. రామారావు. ఆనాడు ప్రతిభావారు తీసిన జానపద చిత్రాలు 'ముగ్గురు మరాఠీలు, బాలరాజు' చిత్రంలో ఇంద్రుని సభ సెట్‌వర్క్, అశ్వరాజ్ వారు నిర్మించిన 'దీపావళి' చిత్రంలో నరకాసురుని దర్బారు, నరకుని పాత్ర రూపకల్పన చెప్పుకోదగ్గవి.

వాహినీ సంస్థ స్థాపకుల్లో ఒకరైన ఎ.కె.శేఖర్ ఆ సంస్థ నిర్మించిన చిత్రాలకు కళాదర్శకత్వం నెరపారు. ముఖ్యంగా చెప్పుకోదగ్గ చిత్రం 'మల్లీశ్వరి' ఈ చిత్ర కథకు ప్రాణం శిల్పకళ - దాని వైభవం. ఆయన వేసిన స్కెచ్ ననుసరించి తీర్చిదిద్దిన శ్రీకృష్ణదేవరాయలు పాత్ర (నటుడు శ్రీవత్సవ) తరువాత వారికి ఆదర్శప్రాయమైంది. చిత్రంలో ప్రతిసన్నివేశం స్థలం రాయల కాలం నాటి వాతావరణాన్ని జ్ఞప్తికి తెచ్చేలా వుంది. మల్లీశ్వరి వుండే గ్రామం, రాణివాసమందిరం, రాయలవారి సభాప్రాంగణం - తుంగభద్రా నదీ తీర ప్రాంతం - యివన్నీ రూపొందించటంలో ఆయన ప్రతిభ కనబడుతుంది. ఆయన స్వీయదర్శకత్వంలో రూపొందించిన 'శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు కథ' చిత్రంలో కూడా కళా నైపుణ్యం స్పష్టంగా కనువిందు చేస్తుంది.

విజయా వారి విశిష్ట జానపదచిత్రాలు 'పాతాళభైరవి', 'జగదేకవీరునికథ' ఎవర్‌గ్రీన్‌గా చెప్పుకునే పౌరాణిక చిత్రరాజం 'మాయాబజార్'లకు కళాదర్శకత్వం వహించిన మాధవపెద్ది గోఖలే గూర్చి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. (చాలా చిత్రాల్లో ఈయనతో పనిచేసిన కళాధర్‌కు కూడా క్రెడిట్ చెందుతుంది). 'పాతాళభైరవి'లోని మాయామహల్, మాంత్రికుని గుహ, రాజమందిరం,

కథానాయకుడు తోటరాముడు మొసలితో పోరాడిన పుష్కరిణి – ఈ సన్నివేశాల రూపకల్పన ఒక ఎత్తు, నేపాళ మాంత్రికుని రూపానికి తగ్గ స్కెచ్ మరొక ఎత్తు. అలాగే 'మాయాబజార్' చిత్రంలోని ప్రధాన సన్నివేశాలు జరిగే బలరాముని మందిరం, ఘటోత్కచుని ఆశ్రమం, మాయాబజార్‌లోని వివిధ దుకాణాల సముదాయాలు – వీటన్నింటినీ మించి శ్రీకృష్ణ, శకుని పాత్రలకు స్కెచ్ వేసి రూపొందించటం చారిత్రాత్మకంగా చెప్పుకోదగ్గ అంశం. అలాగే 'జగదేకవీరుని కథ'లో కథానాయికలు జలకాలాడే కొలను, కథానాయకుడు విడిది చేసిన రాజమందిరం చెప్పుకోదగ్గవి.

ఆ తరం సీనియర్స్‌లో చెప్పుకోదగ్గ కళాదర్శకుడు టి.వి.యస్.శర్మ. 'నర్తనశాల, పాండవ వనవాసం, సీతారామకళ్యాణం' ఈ మూడు చిత్రాల్లో ఆయన చూపిన ప్రతిభ అలనాటి భారత కథా సన్నివేశాలను, లంకా వైభవాన్ని, అయోధ్యనగర సౌందర్యాన్ని తన కుంచెతో రూపకల్పన చేశారు. 'నర్తనశాల' చిత్రానికిగాను జకార్తాలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ఉత్తమ కళా దర్శకునిగా శర్మకు పురస్కారం లభించింది.

వాలి – సుబ్బారావు సృజనాత్మక శక్తికి చక్కటి వుదాహరణ అంజలి పిక్చర్స్ వారి 'సువర్ణసుందరి' చిత్రం ముందుగా వచ్చే గురుకులం, దేవకన్యలు నాట్యం చేసే శివాలయం (క్లైమాక్స్ కూడా అక్కడే చిత్రీకరించారు) దేవలోకం, ఇంద్రసభ, గిరిజనాట్యం చేసిన రాజప్రసాదంలో తోట యివన్నీ ఒక ఎత్తు హాయిహాయిగా ఆమనిసాగే పాట చిత్రీకరణలో మూడు నాలుగు ప్రదేశాల్లో పాటలోని భావానికి తగ్గట్టు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించే సెట్స్ వేయగా అక్కడ చిత్రీకరించటం వల్ల ఆ పాటలోని మాధుర్యం ద్విగుణీకృతమైంది.

ఎ.బాలు కళా నైపుణ్యానికి ఉదాహరణ 'భూకైలాస్'. 'మున్నీట పవళించు నాగశయన...' నృత్యాన్ని చిత్రీకరించిన రాక్షసరాజు (రంగారావు) సభామందిరంలో పాతాళలోక శిల్పకళ ఉట్టిపడుతుంది.

విఠలాచార్య గారి అగ్గిపిడుగు, నవగ్రహపూజామహిమ మొదలైన చిత్రాల్లో ఆ జానపద కథలకు తగ్గ వాతావరణాన్ని సృష్టించినది బి.సి.బాబు.

రామానాయుడు తీసిన బొమ్మలు చెప్పిన కథ, సిపాయి చిన్నయ్య వంటి చిత్రాలకు కళాదర్శకత్వం నెరపిన రాజేంద్రకుమార్ అభిరుచితో నిర్మించిన 'తారాశశాంకం' చిత్రంలో బృహస్పతి (గుమ్మడి), తార (దేవిక), చంద్రుడు (శోభన్‌బాబు) పాత్రలు కల్పనలో కూడా ఆయన నైపుణ్యం తెలుస్తోంది.

'కురుక్షేత్రం' చిత్రంలో నిజమైన మయసభను తన నైపుణ్యంతో సృష్టించిన అపూర్వ కళాదర్శకుడు కుదరవల్లి నాగేశ్వరరావు, చిత్రంలోని ప్రతి అణువూ భారతకథ వాతావరణాన్ని జ్ఞప్తికి తెస్తుంది.

బాపు గొప్ప చిత్రకారుడు. ఆయన ముందుగా ప్రతి సన్నివేశాన్ని స్కెచ్ వేసుకొని చిత్రీకరించే దర్శకుడు. వారు తీసిన 'సీతాకళ్యాణం' చిత్రానికి కుదరవల్లి నాగేశ్వరరావు కళా దర్శకత్వం వహించాడంటే ఆయన ప్రతిభకు అంతకంటే గుర్తింపు మరేముంటుంది? ఆయన కళా దర్శకత్వంలో రూపొందించిన మరో చిత్రం 'మాయామశ్చీంద్ర'.

సాంఘిక వాతావరణం, అది పల్లెటూరిది కావచ్చు, పట్నానికి చెందవచ్చు. ఆ తరహాల్లోను అటు సారథి వారికి (కులదైవం), యిటు హైదరాబాద్ మూవీస్ (జల్సారాయుడు) సృష్టించి యిచ్చిన కళాదర్శకుడు సూరన్న. ఊహాలోకంలో విహరింపజేసే చిత్రాలు జానపదాలు, మంగమ్మశపథం వంటి జానపదాలకు దక్షయజ్ఞం వంటి పౌరాణికాలకు, సిరిసిరిమువ్వ, నిండు మనసులు వంటి సాంఘిక చిత్రాలకు కళాదర్శకత్వం నెరపిన సవ్యసాచి తోట వెంకటేశ్వరరావు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఎఫెక్టు రావాలని ఆరాటపడే కళాదర్శకుల్లో ఒకరు బి.చలం. 'టక్కరిదొంగ చక్కని చుక్క' వంటి యాక్షన్ చిత్రాల శైలికి తగ్గట్టుగానూ భారీతనం కనిపించే శ్రీకృష్ణార్జున విజయం వంటి పౌరాణికం బహుకొద్ది ఉదాహరణలు.

చలంగారి వద్ద శిష్యరికం చేసిన పేకేటి రంగా (శివరాం గారి అబ్బాయి) మద్రాసులో అయిదు సంవత్సరాలు ఫైన్ ఆర్ట్స్‌లో కృషి చేసి డిప్లొమా పొంది 'స్నేహబంధం'తో కళాదర్శకునిగా మారి, ఆదిత్య 369, భైరవద్వీపం వంటి విశిష్ట చిత్రాలకు కళాదర్శకత్వం వహించారు. ఒక విధంగా భైరవద్వీపానికి పాతాళభైరవి ప్రేరణ. ఆ విషయం సెట్స్‌లో కూడా కనిపించింది. రంగా శిష్యుడు రాము

ఇటీవల వచ్చిన 'ప్రేమించేది ఎందుకమ్మా' చిత్రానికి కళాదర్శకుడు. రంగా 'భైరవద్వీపం' చిత్రానికి నంది ఎవార్డు పొందారు.

మరో విశిష్ట కళాదర్శకులు ఎస్.కృష్ణారావు (కమెరామెన్ నవకాంత్ తండ్రి). ఈయన వీరాంజనేయ వంటి పౌరాణికాలకు; 'మహాబలుడు, బందిపోటు' వంటి పలు జానపద చిత్రాలకు; 'దొంగరాముడు, రక్తసంబంధం, ఆరాధన, జీవన తరంగాలు' వంటి సాంఘిక చిత్రాలకు కళాదర్శకత్వం వహించారు.

సాంఘిక చిత్రాలకు ఎక్కువగా కళాదర్శకత్వం వహించి సహజత్వానికి దగ్గరగా చిత్రాల్ని తీర్చిదిద్దటానికి కారణమైన వ్యక్తి జి.వి.సుబ్బారావు. ఈ దశగా ప్రత్యేకించి పేర్కొనవలసిన చిత్రం 'మూగమనసులు'. సుందర గోదావరినదీ తీరాన రూపుదిద్దుకొన్న గోపీ పర్ణశాల వంటి కుటీరం. దానికి కొద్దిగా దగ్గరలో వున్న జమీందారు గారి భవంతి, ముఖ్యంగా గోపీ, గౌరి పాత్రల తాలుకు స్కెచ్ అత్యంత సహజంగా వుండి నటులు గాక పాత్రలు మాత్రమే కన్పిస్తాయి. ఆయన యితర చిత్రాల్లో చెప్పుకోదగ్గవి మనసులు మమతలు, ఆత్మీయులు, అమాయకురాలు, డాక్టర్ చక్రవర్తి, సెక్రటరి, ఆత్మబలం, అంతస్తులు.

పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న కళాదర్శకుడు తోట తరణి 'భారతీయుడు, ఒకే ఒక్కడు' చిత్రాలు ఈయన ప్రతిభకు తర్కాణాలు.

గత రెండు దశాబ్దాలుగా అటు రాఘవేంద్రరావు, యిటు నారాయణరావు రూపొందించిన అనేక రిచ్‌నెస్ కనిపించే చిత్రాలకి కన్నుల విందుగా అందంగా, అర్థవంతంగా సెట్స్‌ను రూపొందించిన శిల్పి భాస్కరరాజు, వారి సోదరుడు శ్రీనివాసరాజు.

ఇంకా ఈ రంగంలో బి.నాగరాజు, ప్రసాదరావు, దిలీప్‌సింగ్, రామచంద్రసింగ్, లీలాకృష్ణ, హేమచందర్, అశోక్‌కుమార్, విజయకుమార్, వెంకటేశ్వరరావు మొదలైనవారు కళాదర్శకత్వం నెరపుతూ యీనాటి సాంఘిక చిత్రాలకు, పాత్రలకు రూపకల్పన చేస్తున్నారు.

## రూపశిల్పం (మేకప్)

కళాదర్శకత్వానికి మేకప్ దగ్గర సంబంధం వుంది. పాత్ర సాంఘికమైనా, పౌరాణికమైన జానపదమైనా, చారిత్రాత్మకం అయినా ఆ నటుడ్ని తీర్చిదిద్దటం, మేకప్‌మాన్ పని. గతంలో వీరే దుస్తులు, అలంకరణలు, హెయిర్ డ్రెస్సింగ్ చేసేవారు. ఇప్పుడు ఏ భాగానికి అది ప్రత్యేకంగా నిర్వహింపబడుతున్నాయి.

దేవదాసు విజయానికి చెప్పుకోదగ్గ కారణాల్లో ఒకటి మంగయ్యగారి మేకప్. దేవదాసు పాత్ర సన్నివేశపు మూడ్‌నిబట్టి మేకప్‌లో ఎఫెక్టు తెచ్చారు.

యన్.టి.ఆర్‌ను శ్రీకృష్ణునిగా, శ్రీరామునిగా – ఒకటేమిటి ఆయన ధరించిన అద్భుత పౌరాణిక పాత్రల్ని చాలా వరకు పీతాంబరం మరికొంత వరకు హరిబాబు తీర్చిదిద్దారు. ముఖ్యంగా శ్రీకృష్ణునిగా యన్.టి.ఆర్ మరికొంత మారటానికి పీతాంబరం చేసిన కృషి శతథా ప్రశంసనీయం. భక్తవత్సలం కూడా మాయాబజార్‌లోని యితర పాత్రలకు తన హస్తవాసి ద్వారా రూపం కల్పించారు.

ఆ తరువాత తరంలో చెప్పుకోదగ్గ ప్రముఖులు ఎ.పోతరాజు (మహాబలుడు, బొబ్బిలియుద్ధం, సెక్రటరి). భద్రయ్య (రమాసుందరి, గురువును మించిన శిష్యుడు), వీర్రాజు (విచిత్ర కుటుంబం, మంగమ్మ శపథం, చిక్కడు–దొరకడు). నాగేశ్వరరావుచౌదరి (మూగమనసులు), కె.నరసింహారావు (నవరాత్రి), జె.కృష్ణ (సిరిసిరిమువ్వ), జాస్తి మాధవరావు (జమున చిత్రాలు), మాధవరావు (కృష్ణ చిత్రాలు), రమేశ్ (సర్దార్ పాపారాయుడు), కొల్లి రాము (మురళీమోహన్ చిత్రాలు).

ఇంకా ఈ మేకప్ కళలలో ప్రసిద్ధులైనవారిలో కొందరు – గురునానక్, బాబు, రాజశేఖర్, ముందూరు సత్యం, సి.వెంకటేశ్వరరావు, కామేశ్వరరావు, యం.రామస్వామి, కె.ఎస్.కిని, మాధవయ్య, నాగేశ్వరరావు, కృష్ణన్, రాము, నాయుడు, తోటహరి, అన్వర్, భాగ్యలక్ష్మి, బలరాం భాషా, భాస్కరరెడ్డి, వి.గిరిష్, జగదీష్, కుమార్, పి.వి.కృష్ణారావు, పి.మురళి, పి.మల్లి, యం.మోహనరావు, పి.మోహన్, మాధవరావు, మురళి, పాండు, పట్టాభి, ఎం.ఆర్.రెహమాన్, కె.రామకృష్ణ, ఆర్.టి.రాఘవ, పి.రాంబాబు, ఎం.రమేశ్, రాము, ఎ.శేఖర్, వై.సింహాద్రి, టి.సూరిబాబు, శ్రీకాంత్, ఆర్.సురేశ్, యం.శివ, శోభాలత మొ॥.

## ఛాయాగ్రహణం (ఫొటోగ్రఫి)

సినిమా రూపకల్పనలో ఛాయాగ్రహణం (ఫొటోగ్రఫి) అనే అంశానికి విశిష్టస్థానం వుంది. సన్నివేశాన్ని బట్టి దర్శకునితో చర్చించిన తరువాత యే షాట్‌ను యెక్కన్నుంచి యే కోణంలో తీస్తే మంచి ఎఫెక్టు వస్తుంది అనేది కెమెరామెన్ భావుకతపై ఆధారపడి వుంటుంది. ముందురోజుల్లో తెలుపు నలుపు సినిమాలు, ఆ తరువాత గేవా కలర్ ఆపైన ఈస్టుమన్ కలర్, సినిమా స్కోప్, 70 ఎం.ఎం, స్టీరియో ఫోనిక్ సౌండ్, యిలా యెన్నెన్నో పరిణామాలు చోటుచేసుకున్నాయి.

మొదటి దశలో డబ్రి కెమెరా ద్వారా తరువాత ఆరిఫ్లెక్స్ కెమెరా ఆ తరువాత అధునాతనంగా యిప్పుడు స్టడీకమ్ కెమెరా వచ్చాయి. లాంగ్‌షాట్, క్లోజప్, ట్రాలీషాట్, క్రేన్‌షాట్ అంటూ సన్నివేశ చిత్రీకరణ ప్రాధాన్యతను బట్టి తీయటం జరుగుతుంటుంది. ప్రతిరంగంలో కొత్తదనం కోసం ప్రయోగాలకు అవకాశం వుంటూనే వుంటుంది. సినిమాలకు సంబంధించి ఫొటోగ్రఫీలో యీ దిశగా అద్భుతమైన ప్రయోగాలు చేసి ఆహా అనిపించుకొన్నవారు ఎందరో !

వాహినీ సంస్థ రూపశిల్పులలో ఒకరైన కె.రామనాథ్ టాకీల తొలిదశకంలో 'సీతాకళ్యాణం, గృహలక్ష్మి' చిత్రాలకు ఫొటోగ్రఫి అందించి ఆ తరువాత వాహిని చిత్రాలు 'వందేమాతరం, సుమంగళి, దేవత, భక్తపోతన'లకు కెమెరామెన్‌గా పని చేశారు. ఆ తరువాత చెప్పుకోదగ్గ సీనియర్ కమల్‌ఘోష్ 1936లో 'బాలయోగి'ని చిత్రానికి ఫొటోగ్రఫి అందించి తర్వాత 'తల్లిప్రేమ, చండిక, ప్రేమ, రోజులు మారాయి, గోవులగోపన్న, బొబ్బిలియుద్ధం' చిత్రాలకు పని చేశారు.

ఎం.ఎ.రెహమాన్ చాలా ప్రతిభావంతమైన కెమెరామెన్. 'భక్తిమాల' (1941) నుంచి 'శ్రీమద్విరాటపర్వం' వరకు వందలాది చిత్రాలకు తన ఫొటోగ్రఫితో విజయాన్ని సాధించిపెట్టారు. 'విప్రనారాయణ, సువర్ణసుందరి, జయసింహ, నర్తనశాల, త్యాగయ్య' చిత్రాలు ఆణిముత్యాలుగా పేర్కొనాలి.

1941లో నాటి 'తెనాలి రామకృష్ణ'ను ఫొటోగ్రఫి అందించిన పి.శ్రీధర్ తరువాత ప్రతిభావారి 'స్వప్నసుందరి, బాలరాజు'తో తమ ప్రతిభ చూపించారు.

వీరి అబ్బాయి పి.దేవరాజ్ తరువాత ఆరంగంలో ప్రావీణ్యం సంపాదించి తొలి తెలుగు సినిమా స్కోప్ చిత్రం (తెలుపు-నలుపు) 'దేవతలారా దీవించండి' చిత్రం ద్వారా ఫొటోగ్రఫిలో ఓ మలుపుకు శ్రీకారం చుట్టారు.

సీనియర్ కెమెరామెన్‌గా గౌరవింపబడ్డ ఆది. యం.ఇరానీ 'మల్లీశ్వరి' (1951), 'పెంపుడు కొడుకు'. అన్నపూర్ణ వారి తొలి చిత్రం 'దొంగరాముడు'కు పని చేశారు. అయితే 'మల్లీశ్వరి' చిత్రానికి బి.యన్.రెడ్డి గారి సోదరుడు కొండారెడ్డి కూడా పనిచేశారు.

'కృష్ణప్రేమ' (1943)కు పనిచేసిన పి.యస్.శెల్వరాజ్ ఫొటోగ్రఫిలో విశేష కృషి చేసి మంచి ఫలితాలు సాధించారు. హీరోపరంగా తొలి ద్విపాత్రాభినయం చిత్రం 'ఇద్దరుమిత్రులు'. దాసరి నిర్మించిన 'మేఘసందేశం'లోను సెల్వరాజ్ పనితనం స్పష్టంగా కన్పిస్తుంది.

విజయా పతాకంపై నిర్మితమైన చిత్రాలు 'పాతాళభైరవి, చంద్రహారం, పెళ్ళిచేసి చూడు, మిస్సమ్మ, మాయాబజార్, గుండమ్మకథ, జగదేకవీరునికథ'. వీటికి చందమామ, వెన్నెల ప్రాణం వంటివి. వాటిని తన కెమెరా ద్వారా మార్కస్ బార్‌ట్లే మనకు అందించిన విధానం అపూర్వం. 'లాహిరి లాహిరి లాహిరి'లో అన్న ఒక్కపాట చిత్రీకరణ చాలు - ఆయన ప్రతిభను అంచనా వెయ్యటానికి. అంతకుముందు ఆయన వాహినీ వారి 'స్వర్గసీమ' (1945), 'యోగివేమన' (1947)కు ఫొటోగ్రఫి నిర్వహించారు.

విషాదాంత ప్రేమకథా చిత్రాల్లో సన్నివేశానికి తగ్గ మూడ్ క్రియేట్ చేయటానికి కెమెరా ఎంతో సహకరిస్తుంది. ఈ మేరకు 'లైలామజ్నూ, దేవదాసు' చిత్రాల ఘనవిజయానికి పరోక్షంగా కారకుడైన వ్యక్తి కెమెరామెన్ బి.యస్.రంగా; తరువాత విక్రం ప్రొడక్షన్స్ స్థాపించి అభిరుచితో చిత్రాలు నిర్మించారు.

మరో సీనియర్ ఫొటోగ్రాఫర్ పి.యల్.రాయ్, హెచ్.యం.రెడ్డిగారి 'నిర్దోషి' (1951), 'శ్రీవేంకటేశ్వర మహాత్మ్యం', 'మంచి మనసులు' చెప్పుకోదగిన చిత్రాలు కాగా ఆదుర్తి సుబ్బారావు తీసిన 'మూగమనసులు' చిత్రంలో పి.యల్.రాయ్ సాధించిన ఫలితాలు అద్భుతం. వీరు తీసిన రంగుల చిత్రం 'లవకుశ'.

ఉత్తర భారతంలో పేరొందిన కెమెరామెన్ వి.ఎన్.రెడ్డి 'పుట్టిల్లు, చిరంజీవులు' చిత్రాలకు పనిచేశారు. ఇటు సెట్‌వర్క్‌పై జరిగిన సన్నివేశాల్లోనూ అటు ఔట్‌డోర్‌లో చిత్రీకరించిన సన్నివేశాల్లో తన పనితనంతో 'భూకైలాస్' చిత్రానికి ప్రాణం పోసిన వ్యక్తి మాధవబుల్‌బులే. పుల్లయ్యగారి 'అర్థాంగి, మురళీకృష్ణ' చిత్రాలకు కూడా పని చేశారు.

ఎందరో శిష్య ప్రశిష్యుల్ని కెమెరామెన్‌లుగా తీర్చిదిద్దిన వ్యక్తి సి.నాగేశ్వరరావు. 'పాండవ వనవాసం', శర్మగారు వేసిన సెట్స్‌కి తన కెమెరా ద్వారా ప్రాణం పోసిన నాగేశ్వరరావు పని చేసిన యితర చిత్రాల్లో చెప్పుకోదగ్గవి 'చెంచులక్ష్మి'. జగపతి వారి 'ఆరాధన, ఆత్మబలం, అంతస్తులు, దీపావళి, పల్నాటియుద్ధం'. వీరబ్బాయి సి.విజయకుమార్ – శేఖర్‌కమ్ముల రూపొందించిన చిత్రాలకు (ఆనంద్, గోదావరి) ఫొటోగ్రఫీ అందించారు.

'తాతా మనవడు' మొదలుకొని దాసరి నారాయణరావుగారి అనేక చిత్రాలకు ఫొటోగ్రఫి అందించిన 'కన్నప్ప' (మీసాలు స్పెషాలిటి) జీవితంలో చెప్పుకోదగ్గ విశిష్ట చిత్రం 'దానవీరశూరకర్ణ'. ఈయన శిష్యుడు కె.ఎస్.మణి కూడా దాసరి చిత్రాలకు పనిచేశారు. (దేవదాసు మళ్ళీ పుట్టాడు, కోరికలే గుర్రాలయితే, రాముడే రావణుడైతే).

సీనియర్ కెమెరామెన్ విన్సెంట్ ఆనాటి 'రాజు–పేద' (1954) మొన్నటి 'కులగోత్రాలు', 'సెక్రటరి' చిత్రాలకు పని చేశారు. వీరి అబ్బాయి జయానన్ విన్సెంట్ 'ప్రేమంటే యిదేరా' చిత్రానికి, యింకో అబ్బాయి అజయ్ విన్సెంట్ 'రాజకుమారుడు' (మహేష్‌బాబు పరిచయ చిత్రం) చిత్రానికి పని చేశారు.

మంత్రతంత్రాలు మాయలకు సంబంధించిన జానపదచిత్రాలకు ఫొటోగ్రాఫర్ ఎంతో శ్రమపడాల్సి వస్తుంది. మొండెం, తల వేరవ్వటం, కలవటం, దెయ్యాలు, పిశాచాలు, ఆకాశంలో తివాచీలు ఎగరటం – యిటువంటివి మాస్క్ సహాయంతో తీస్తారు. ఆ విద్యలో ప్రసిద్ధుడు హెచ్.ఎస్.వేణు. ఆ కోవలో యీయన విఠలాచార్య తీసిన 'జగన్మోహిని, చిక్కడు–దొరకడు'. పింజల సుబ్బారావు తీసిన 'త్రిలోకసుందరి, పేదరాసి పెద్దమ్మకథ'. భావనారాయణ తీసిన 'గోపాలుడు–భూపాలుడు' చిత్రాలు కొన్ని వుదాహరణలుగా పేర్కొనాలి. ఆ తరహాలో చెప్పుకోదగ్గ మరో వ్యక్తి ఎస్.ఎస్.లాల్.

'సీతారామకళ్యాణం' ద్వారా రంగప్రవేశం చేసిన రవికాంత్‌నగాయిచ్ కెమెరా ద్వారా మొదటి చిత్రంలోనే ఎన్నో అద్భుతాలు చేశారు. ఈయన దగ్గర పనిచేసిన వి.యస్.ఆర్ స్వామి చలనచిత్రసీమలో యెవరూ చేయలేనన్ని అద్భుత ప్రయోగాలు చేశారు (అల్లూరి సీతారామరాజు, మోసగాళ్ళకు మోసగాడు, సింహాసనం, భక్తతుకారాం). ఈయన శిష్యుడు ఎస్.గోపాలరెడ్డి (ఆనందభైరవి), ఆయన శిష్యుడు ఎమ్.వి.రఘు (స్వాతిముత్యం) ఛాయాగ్రహణం అందిస్తూనే కొన్ని చిత్రాలు కూడా నిర్మించారు.

బాలూ మహేంద్ర (శంకరాభరణం), బి.యస్.లోక్‌నాథ్ (బాలచందర్ చిత్రాలు), కె.ఎస్.రామకృష్ణరావు (పవిత్రబంధం), శ్రీనివాసరెడ్డి (విజయా బాపినీడు చిత్రాలు), అశోక్‌కుమార్ (అభినందన), కె.ఎస్.ప్రసాద్ (సీతాకళ్యాణం), జి.కె.రాము (కంచుకోట), ఎస్.ఎస్.లాల్ (విఠలాచార్య చిత్రాలు), పుష్పాల గోపీకృష్ణ (విజయనిర్మల చిత్రాలు) సీనియర్ ఫొటోగ్రాఫర్లుగా పేరొందారు.

దర్శకులు కె.రాఘవేంద్రరావుగారి సోదరులు కె.ఎస్.ప్రకాశ్, అన్నగారికి తగ్గ స్పీడ్‌లో 'వేటగాడు, అపూర్వసహోదరులు, కొండవీటి సింహం, అగ్నిపర్వతం'- కమల్‌హాసన్ అద్భుతంగా నటించిన 'ఇంద్రుడు-చంద్రుడు' చిత్రాలకి ఫొటోగ్రఫి అందించారు.

కెమెరా పరంగా యెంతో రిస్కుతో కూడిన షాట్సు తీస్తూ ఫొటోగ్రఫీలో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్న సోదరులు ఛోటా కె.నాయుడు (చూడాలని వుంది). శ్యాం కె.నాయుడు (రాజా, ఒసేయ్ రాములమ్మా).

ఇక తమ విశేష ప్రతిభా విశేషాలతో యావద్భారత స్థాయిలో ఛాయాగ్రాహ దర్శకులుగా పేరొందిన ప్రత్యేక వ్యక్తులు ఇషాన్ ఆర్య (ముత్యాలముగ్గు), కస్తూరి (సప్తపది), నివాస్ (సాగరసంగమం), బాబా ఆజ్మి (త్యాగయ్య), ఎ.కె.బీర్ (దాసి), కబీర్‌లాల్ (ఆదిత్య 369), పి.సి.శ్రీరామ్ (గీతాంజలి), మధు అంబట్ (తమ్ముడు)లను పేర్కొనాలి. సహజత్వానికి అతి దగ్గరగా వుండేలా రూపకల్పన చేసిన సన్నివేశాల్లో అంతకంటే సహజంగా కెమెరాలో వివిధ భంగిమల్లో బంధించటంలో వీరంతా యెవరి ప్రత్యేకత వారిదే అని నిరూపించుకున్నారు.

❖ ❖ ❖

## పోరాటాలు, అద్భుతాలు (స్టంట్స్ అండ్ థ్రిల్స్)

అది కత్తియుద్ధంగానీ, కర్రసాము గానీ, ముష్టి యుద్ధంగానీ, వాటిలో కూడా పలురకాల పోరాటాలు, వీట్లని స్టంట్స్‌గా వర్గీకరిస్తే... అమాంతం కథానాయకుడు యన్.టి.రామారావు గ్లాసు కిటికినీ దూసుకుని బయటకు దూకటం, మెగాస్టార్ చిరంజీవి మోటారు సైకిల్‌పై, కారుపై, హెలికాప్టరుపై, బుల్‌డోజర్‌పై, రకరకాల విన్యాసాలు చేయటం, హీరో బాలకృష్ణ ఒకతాడు సహాయంతో తోటలోంచి రాజప్రాసాదంలోకి దూకటం యిటవంటివన్నీ థ్రిల్స్‌గా అభివర్ణించవచ్చు. వీటిని కూడా స్టంట్ మాస్టర్లే కంపోజ్ చేస్తుంటారు. వీళ్ళ దగ్గిర అందరు ఆర్టిస్టులకు విగ్రహస్థాయిలో సరితూగే సాహసవంతులు వుంటారు. వారు రిస్క్‌షాట్స్‌లో డూప్‌గా నటిస్తారు. మన కథనాయకులు కొందరు రిస్క్‌షాట్స్ డూప్ లేకుండా చేసిన సందర్భాలు వున్నాయి.

అక్కినేని నాగేశ్వరరావు, ఎన్.టి.రామారావు, కాంతారావు నటించిన జానపద చిత్రాల్లోని కత్తిపోరాట దృశ్యాలను స్వామినాధన్, స్టంట్ సోము, రాఘవులు, సాంబశివరావు కంపోజ్ చేసేవారు. స్టంట్ సోము 'జయసింహ' చిత్రం మొదట్లో జరిగే గొడ్డలి-డాలు యుద్ధాన్ని, తరువాత వచ్చే కాగడాల పోరాటాన్ని థ్రిల్లింగ్‌గా కంపోజ్ చేశారు. 'దొంగరాముడు' చిత్రంలో నాగేశ్వరరావు, ఆర్.నాగేశ్వరరావు మధ్య జరిగే ఫ్రీస్టైల్ పోరాటాన్ని రాఘవులు కంపోజ్ చేశారు.

'అదృష్టవంతులు' చిత్రంలోని రైలు టాప్‌పై పోరాటాన్ని, 'బంగారుబాబు'లో హెలికాప్టర్ పోరాటాన్ని రాఘవులు కంపోజ్ చేశారు.

సాంబశివరావు కంపోజ్ చేసిన పోరాటంలో అత్యంత సహజంగా గంభీరంగా రూపొందించిన భీమ, దుర్యోధన గదా యుద్ధం, 'దానవీరశూరకర్ణ'లో ఎరీనా సెట్‌లో యన్.టి.ఆర్ - సత్యనారాయణపై చిత్రీకరించారు. అలాగే 'నర్తనశాల' చిత్రంలో భీమ-కీచక పోరాటాన్ని లైట్ అండ్ షేడ్ ఎఫెక్ట్‌లో యస్.వి.రంగారావు, దండమూరి రాజగోపాల్‌పై అర్థవంతంగా కంపోజ్ చేశారు.

విఠలాచార్య కాంతారావు, రాజనాల కాంబినేషన్‌లో తీసిన అనేక జానపద చిత్రాలకు ఇ.పరమశివన్ స్టంట్స్ కంపోజ్ చేశారు (నవగ్రహపూజా మహిమ,

గురువును మించిన శిష్యుడు), చిక్కడు-దొరకడు చిత్రంలో పోరాటాల్ని శివయ్య కంపోజ్ చేశారు. హీరోలు ఇద్దరూ పోరాడుతూ కత్తితో ఒకరి చేతిపై మరొకరు వారి పేరును చెక్కడం ఒక థ్రిల్. ఆకాశరామన్న చిత్రానికి, కృష్ణ నటించిన టక్కరిదొంగ - చక్కని చుక్క చిత్రానికి కె.మాధవన్ ఫైట్ మాస్టర్.

జూడోరత్నం కృష్ణ నటించిన కొన్ని చిత్రాలకు ఫైట్‌మాస్టరుగా పని చేశారు. మాధవన్ కూడా కృష్ణ నటించిన అనేక చిత్రాలకు పని చేశారు. స్వయంగా ఆయన పోరాట సన్నివేశాల్లో పాల్గొనేవారు.

రాఘవులుగారబ్బాయి రాజు గత ఇరవై సంవత్సరాలుగా ఫైట్ థ్రిల్స్ అందిస్తూ ఎన్నో చిత్రాల విజయానికి కారకుడయ్యాడు. చిరంజీవి నటించిన అసంఖ్యాక హిట్ చిత్రాల్లో (ఖైదీ, దొంగమొగుడు, కొదమసింహం, అభిలాష, గ్యాంగ్‌లీడర్ మొదలైన) రాజు కంపోజ్ చేసిన పోరాట విన్యాసాలు థ్రిల్స్ ఆకట్టుకున్నాయి.

ఆలోచన దర్శకుడిదే అయినా 'శివ' చిత్రానికి రాజు కంపోజ్ చేసిన సైకిల్ చైన్ ఫైట్ ఓ కొత్త తరహా థ్రిల్స్‌కు తెర లేపింది. ఇటీవల వచ్చిన 'శివయ్య' చిత్రంలో రాజ్‌శేఖర్‌తో చిత్రీకరించిన పోరాటాలు కూడా రాజు కంపోజ్ చేసినవే!

1991-99 మధ్య కాలంలో ఫైట్స్, థ్రిల్స్ స్వరూప స్వభావాలు మారిపోయాయి. కారు వేగంగా ఛేజ్ చేయబడి కొండమీద నుంచి పల్టీలు కొట్టి తగలబడుతూ నేలకొరగటం, అగాధంలో పడిపోవటం. మోటారు సైకిల్ మంటల్లో చిక్కుకొని గాలిలో పల్టీలు కొట్టటం - అంటే వస్తు విధ్వంసం ద్వారా గగుర్పాటును కలిగించేవి. విక్రమ్‌ధర్మా 'సమరసింహారెడ్డి' చిత్రానికి కంపోజ్ చేసిన థ్రిల్స్ పోరాటాలు గగుర్పాటు కలిగించటమే గాక చిత్ర విజయానికి ఎంతో సహకరించాయి. దీనికి కారణం కథలో అండర్ కరెంటుగా వయొలెన్స్ ఉంటటం - అవసరార్థం తప్పనిసరిగా ఫైట్ చేయాల్సిన సందర్భం రావటం వల్ల ఔచిత్యభంగం కలుగలేదు. ఇంకా సూపర్ సుబ్బరాయన్, జూడో రత్నం, కన్నల్ కన్నన్, (ఒకేఒక్కడు చిత్రీకరణలో యీయన ప్రతిభ తెలుస్తుంది), దళపతి, రాంబో రాకేష్, హార్స్ పటేల్ హార్స్‌మెన్ రాజు ఫైట్‌మాస్టర్స్‌గా థ్రిల్స్ అందిస్తున్నారు. వీటికి రీరికార్డింగ్ ఎఫెక్ట్స్ బాగా తోడవడం వల్ల మంచి ఫలితాలు కన్పిస్తున్నాయి.

❖ ❖ ❖

## కూర్పు (ఎడిటింగ్)

చిత్ర నిర్మాణంలో అత్యంత కీలకమైన విభాగం ఎడిటింగ్. ఒక సినిమాకథ తయారయ్యాక డైలాగ్స్‌తో కూడిన స్క్రిప్ట్ వర్కు పూర్తవుతుంది. ఆ స్క్రిప్టు ప్రకారం సినిమాలో సుమారు 75 నుంచి 100 వరకు సీన్లు (సన్నివేశాలు) వుంటాయి. ఒక్కోసన్నివేశాన్ని షాట్లుగా విభజిస్తారు. ఆ ప్రకారం ఏ షాటును ఏ ఆర్టిస్టుపై ఎంత వరకు తియ్యాలి - ఆ పాత్ర డైలాగులు చెప్పుతున్నపుడు, కథాగమనాన్ని అవసరాన్ని బట్టి రియాక్షన్ ఎవరిమీద చూపాలి - యివన్నీ షాట్ డివిజన్‌లో నిర్ణయించబడతాయి. ఆ తరువాత ఆ షాట్‌ను లాంట్, మిడిల్‌షాట్, క్లోజప్ అంటూ పలు విధాలుగా విభజించుకొంటారు. ఆ తరువాత ఒక్కో షాటును సెట్స్ సౌలభ్యరీత్యా చిత్రీకరిస్తారు. ఆ షాట్‌లో టేక్ 1-2-3-4 అలా వుంటాయి. మొదటి టేక్‌లో ఒ.కే. కాకపోతే తర్వాత టేక్‌లు తియ్యాల్సిన అవసరం వుంటుంది. ఈ వివరాలు అంటే సీను నెంబరు, షాట్ నెంబరు, టేకు నెంబరు, ఎఫెక్టు పగలు లేక రాత్రికి సంబంధించినదా అనే వివరాలు క్లాప్ బోర్డు మీద వుంటాయి. (తేదీతో సహా) ఈ వివరాలను ఓకే అయిన షాటు వివరాలను అసిస్టెంట్ లేక అసోసియేట్ డైరెక్టరు ఎడిటింగ్ రిపోర్టునోట్సులో వ్రాసుకుంటాడు. ఇది చిత్రానికి ఆయువుపట్టు వంటి అంశం. ఆ నోట్సు ఆధారంగా చిత్రానికి ఎడిటర్‌గా నియమించబడ్డ వ్యక్తి ఓకే అన్న షాట్సును వుంచి మిగతా వాటిని తొలగిస్తాడు. అల్లా ఓకే అయిన షాట్స్‌ని సీను - షాటు నెంబర్లు ఆధారంగా ఒక క్రమంలో సినిమాను రూపొందిస్తాడు. సన్నివేశం ఎంతవరకుంటే ఆ కథ రక్తి కడుతుందో వూహించి దర్శకునితో సంప్రదించి ఆ చిత్ర నిడివిని నియంత్రణ చేస్తాడు. అప్పుడు చిత్రం మంచి రసపట్టులో నడుస్తుంది. అటువంటి ఎడిటర్ దర్శకుడయితే ముందుగానే నిడివిని గూర్చి ఓ నిర్ణయానికి వచ్చి ఆ ప్రకారమే షూటింగ్ చేస్తాడు. అప్పుడు అనవసరంగా ఎక్కువ ఫిల్మ్ దుబారా కావటానికి అవకాశం ఉండదు.

ఎడిటింగ్ రంగంలో ఆద్యులుగా చెప్పుకోదగిన వారిలో ముఖ్యులు యం.వి.రాజన్ (ఈయన ప్రముఖ రాజకీయవేత్త అనంతశయనం అయ్యంగార్‌కి స్వయాన మేనల్లుడు) టాకీల తొలిదశకంలో హెచ్.ఎం.రెడ్డిగారి చిత్రాలకు, యల్వీ ప్రసాద్ చిత్రాలకు యీయన ఎడిటర్‌గా పనిచేయగా తరువాత తరానికి చెందిన

అనుపమతిలక్, ప్రసాద్‌గారి సోదరుడు సంజీవి, భరణి రామకృష్ణారావు శిష్యులుగా తర్ఫీదు పొందారు.

ఉదయశంకర్ దగ్గర కె.ఎస్.ప్రకాశరావు దగ్గర అటు ఎడిటింగ్ శాఖలోను యిటు దర్శకత్వశాఖలోనూ పని చేసిన ఆదుర్తి సుబ్బారావు దర్శకుడయిన తరువాత ఆయన తీసిన చిత్రాల్లో కథా గమనం అద్భుతంగా వుండేలా చూసేవారు. ఈయన వద్ద అటు దర్శకత్వ శాఖలో సహాయకునిగా వుంటూ యిటు ఎడిటింగ్ నెరపిన సీనియర్ ఎడిటర్ టి.కృష్ణ. టి.కృష్ణ శిష్యుడు జి.జి.కృష్ణారావు ఎడిటింగ్‌లో చేయి తిరిగిన ప్రజ్ఞావంతుడు. అటు విజయమాధవీ వారి చిత్రాలకు (విశ్వనాథనాయకుడు, రావణబ్రహ్మ) యిటు విశ్వనాథ్‌గారి దర్శకత్వంలో తయారైన క్లాసిక్స్ (శంకరాభరణం, స్వాతికిరణం, ఆపద్బాంధవుడు)కు పని చేశారు.

టి.కృష్ణ మరో శిష్యుడు ఆదుర్తి హరినాథ్ విజయకృష్ణావారి చిత్రాలకు ఎడిటింగ్ చేశారు. టి.కృష్ణ వద్ద పనిచేసిన సోదరులు కోటగిరి గోపాలరావు, కోటగిరి వెంకటేశ్వరరావు వందలాది చిత్రాలకు ఎడిటర్స్‌గా పనిచేశారు.

సుప్రసిద్ధ కెమెరామెన్, ఎడిటర్, దర్శకుడు వాహినీ స్థాపకుల్లో ఒకరైన కె.రామనాథ్ మేనల్లుడు యం.యస్.మణి అన్నపూర్ణ వారి చిత్రాల్ని (దొంగరాముడు, ఇద్దరు మిత్రులు, అమాయకురాలు) ఎడిట్ చేశారు.

యం.యస్.మణితో కలిసి పనిచేసిన జంబు అటు విజయా (మాయాబజార్) చిత్రాలకూ, వీనస్ చిత్రాలకూ పని చేశారు. వీరి వద్ద పనిచేసిన కళ్యాణసుందరం కూడా విజయా చిత్రాలకు పని చేశారు.

మొదట్లో బి.ఏ.సుబ్బారావు గారి చిత్రాల్ని ఎడిట్ చేసిన కె.ఎ.మార్తాండ్ తరువాతి కాలంలో సురేష్ రామానాయుడిగారి చిత్రాలను ఎక్కువగా (జీవనతరంగాలు, బొమ్మలు చెప్పిన కథ, సిపాయి చిన్నయ్య, సెక్రటరి) ఎడిట్ చేశారు. వీరి అబ్బాయి మార్తాండ్ కె.వెంకటేష్ సురేష్ వారి చిత్రాలకు ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.

సీనియర్ ఎడిటర్స్ లిస్ట్‌లో చెప్పుకోదగిన వ్యక్తి యన్.యస్.ప్రకాశ్. ఎక్కువగా సుందర్‌లాల్ గారి చిత్రాలకు పనిచేశారు (చిన్నకోడలు, రక్తసంబంధం). జి.డి.జోషి

'పరదేశి'తో మొదలుపెట్టి కొన్ని విఠలాచార్య గారి చిత్రాల్ని ముఖ్యంగా డి.వి.యస్.రాజు గారు నిర్మించిన వాటిని (మంగమ్మ శపథం) ఎడిట్ చేశారు.

కన్నడరంగంలో ఎడిటర్ కం డైరెక్టర్‌గా పేరొందిన జి.విశ్వనాథం వద్ద సహాయకునిగా పని చేసిన గోవిందం విఠలాచార్య గారి స్వంతజానపద చిత్రాలకు (అగ్గి పిడుగు, గురువును మించిన శిష్యుడు, నవగ్రహపూజామహిమ, చిక్కడు-దొరకడు) పనిచేశారు. జానపద చిత్రాల్ని అందంగా, పవర్‌ఫుల్‌గా ఎడిట్ చేయడంలో అందెవేసిన చెయ్యి బి.కందస్వామి. గుర్రపుస్వారీలు, కత్తియుద్ధాలను చాలా జాగ్రత్తగా ఎడిట్ చెయ్యకపోతే ఎఫెక్ట్ రివర్స్ అయ్యే ప్రమాదం వుంటుంది.

క్రైం చిత్రాల దర్శకుడు కె.ఎస్.ఆర్.దాసు పలు చిత్రాలకు ఎడిటర్‌గా పని చేసి, తరువాత దర్శకుడుగా మారారు. సంజీవి దగ్గర పనిచేసిన కె.సత్యం ఎక్కువగా విక్టరి మధుసూదనరావు దర్శకత్వంలో తయారైన చిత్రాలకు పనిచేశారు. సీనియర్ ఎడిటర్ వీరప్ప చిత్రాల్లో చెప్పుకోదగ్గది 'నర్తనశాల'. విశిష్ట ఎడిటర్‌గా గుర్తించబడిన మరోక వ్యక్తి అనిల్ మల్నాడ్. ఈయన ప్రతిభకు చక్కని వుదాహరణ 'సితార'. అవార్డు విన్నర్ ఎడిటర్‌గా శ్రీకరప్రసాద్‌ను పేర్కొనాలి.

గత రెండు దశాబ్దాలుగా తన ప్రత్యేక ప్రతిభతో ఎడిటింగ్‌రంగంలో విశిష్ట వ్యక్తిగా గుర్తించబడిన వారు గౌతంరాజు. ఆనాటి జంధ్యాల చిత్రాలు 'ముద్దమందారం, నాలుగు స్తంభాలాట, ఆనందభైరవి'తో జైత్రయాత్ర ప్రారంభించి ఉషాకిరణ్‌లో వారి చిత్రాలకు (మయూరి) అనేక ఎవార్డు పొందిన చిత్రాలకు కథాపరంగా, నిడివిని ఉత్కంఠత కల్గించే విధంగా నియంత్రించటంలో నిపుణునిగా ప్రసిద్ధి చెందారు.

నాటి తరానికి చెందినవారిలో ఆర్.రాజగోపాల్, జి.కృష్ణస్వామి, కె.బాబూరావు, వి.ఎస్.నారాయణ, జి.విశ్వనాథ్, ఆర్.సురేందర్‌రెడ్డి కాగా, నవతరంలో చెప్పుకోదగ్గ వారు మురళీ రామయ్య, కె.రామగోపాల్‌రెడ్డి, కోలా భాస్కర్, కృష్ణారెడ్డి, మోహన్, రవి, యస్.వి.రమణారావు మొదలైనవారు. సూపర్‌స్టార్ కృష్ణకు ఎడిటింగ్‌లో మంచి ప్రావీణ్యం వుంది అని నిరూపించిన చిత్రం ఆయన దర్శకత్వంలో రూపొందిన 'సింహాసనం'.

## సినిమా జర్నలిజం - పత్రికలు

సమాజం, రాజకీయం, క్రీడలు, కళలు – ఏ రంగానికి చెందినవైనా సరే ఆ వివరాల్ని, విశేషాల్ని, విశ్లేషించి ప్రజలకు అందించి వారిని చైతన్యపరచటమే పత్రికల యొక్క పాత్రికేయులయొక్క పవిత్ర లక్ష్యం. ఇందుకు సినిమా పరిశ్రమ మినహాయింపు కాదు. సినీరంగానికి చెందిన వార్తలతో కూడిన పత్రిక ఆవశ్యకత గుర్తించి పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రిగారి పెట్టుబడితో ఇంటూరి వెంకటేశ్వరరావు సంపాదకత్వంలో రాజమండ్రి నుంచి 1938లో 'చిత్రకళ' పత్రిక ప్రారంభించబడింది. కొంతకాలం పేకేటి శివరామ్ కూడా దానికి సంపాదకులుగా పనిచేశారు.

ప్రముఖ దర్శక నిర్మాత గూడవల్లి రామబ్రహ్మం (సమదర్శి ప్రజామత) రచయిత తాపీ ధర్మారావు నాయుడు (జనవాణి) సముద్రాల రాఘవాచారి (ప్రజామత) పత్రికా ప్రపంచంలో పనిచేసి సినీరంగ ప్రవేశం చేసినవారే. ప్రముఖ దర్శకుడు కమలాకర కామేశ్వరరావు తొలిదశలో కృష్ణాపత్రికకు సినిమా సమీక్షలు రాసినవారు. కొమ్మూరి సాంబశివరావు తెలుగు సినిమా అనే పత్రికను 1940లో ప్రారంభించగా, రూపవాణి పత్రికకు వి.సీతారామయ్య సంపాదకత్వం వహించారు.

విజయా సంస్థ వారు 1953లో కినిమా అనే పత్రికను, ఆ ప్రాంతాల్లోనే టి.వి.రామ్‌నాథ్ నిర్వహణలో సినిమారంగం పత్రికను నిర్వహించారు. తెలుగు టాకీ మూడవ దశకంలో వెలువడ్డ సినిమా పత్రికల్లో చెప్పుకోదగ్గవి 'గౌతమి, ఢంకా, విశ్వమోహిని, పెంకిపిల్ల'.

ఆంధ్ర పత్రికలో ముళ్లపూడి వెంకటరమణ వ్రాసిన సినిమా సమీక్షలు, సినిమాల్లోని సంగీత సాహిత్యాలను సరాగమాల పేరిట వి.ఎ.కె.రంగారావు సహేతుకంగా విశ్లేషిస్తూ వ్రాసిన వ్యాసాలు పాఠకుల్ని ఎంతగానో ప్రభావితం చేశాయి.

గోటేటి శ్రీ రామారావు నడిపిన 'మధురవాణి', రమణమూర్తి 'కొరడా', శ్రీకృష్ణ 'మెరుపు', నరసింహారావు 'చిత్ర', లక్ష్మీనారాయణ 'తుఫాను', ఇంటూరి వారి సినిమా పత్రిక, పి.ఎస్.ఆర్. ఆంజనేయశాస్త్రి సంపాదకత్వంలో నడిచిన 'సినీహెరాల్డ్' కొంతకాలం వరకే మనగలిగాయి.

1966లో విజయువారు ప్రారంభించిన విజయచిత్ర చాలాకాలం సినిమాపత్రికల్లో తలమానికంగా నిలిచింది. మంచి మంచి వ్యాసాలు, ఆర్టిస్టులు, టెక్నిషియన్ల జీవిత విశేషాలు, అందమైన ఫొటోలు, షూటింగ్ ముచ్చట్లు, విచిత్రమైన ప్రశ్న-జవాబులు ఉండడమే గాక కొంతకాలం విజయా-వాహినివారు నిర్మించిన మల్లీశ్వరి, మాయాబజార్, గుండమ్మకథ వంటి సినిమాల స్క్రిప్టును కూడా ప్రచురించారు. ఆ పత్రిక చాలా కాలం నటుడు, రచయిత అయిన రావి కొండలరావు సంచాలకత్వంలో కొంతకాలం విజయవంతంగా నడిచింది. సితార, ఆంధ్రభూమిలోని చిత్ర సమీక్షలు, వ్యాసాలు పాఠకుల్ని ఆకట్టుకున్నాయి.

సినిమా వ్యాపారరంగం. ఈ సత్యాన్ని గ్రహించి కొందరు సినిమా వ్యాపారాభివృద్ధి కోసం రాష్ట్రవ్యాప్తంగా వ్యాపారపరమైన వివరాలను అందిస్తూ ట్రేడ్ గైడ్, మూవీ మార్కెట్, నెంబర్ వన్, బాక్సాఫీసు, మేఘసందేశం, సూపర్‌హిట్ వంటి ఎన్నో పత్రికలు రంగంలో కొచ్చాయి.

నాటి నుంచి నేటి దాకా సినీ పత్రికా సంపాదకులుగా, జర్నలిస్టులుగా, రిపోర్టర్లుగా వివిధ పత్రికలకు మరియు ఫ్రీలాన్సర్‌గా పనిచేస్తున్న వారిలో కొందరు..

వాసిరాజు ప్రకాశం, తుర్లపాటి కుటుంబరావు, ఏచూరి చలపతిరావు, ఎస్.వి.రామారావు, తోటకూర రఘు, భగీరథ, దేవరాజు రవి, గుడిపూడి శ్రీహరి, జగన్, కౌండిన్య, కె.ఎల్.కుమారస్వామి, రవికిషోర్, మోహన్ గోటేటి, నాగేంద్ర ప్రసాద్, నారాయణరాజు, రాజా, పెద్దాడ మూర్తి, కొలికపూడి రవి, రవికుమార్, ఇమ్మంది రామారావు ,రాఘవ, కొండేటి సురేష్, ఎన్.సుబ్బారావు, పసుపులేటి రామారావు, ఖదీర్‌బాబు, సత్యంబాబు, పులగం చిన్నారాయణ, సాహితి, ఓలేటి శ్రీనివాసభాను, కె.ఉమామహేశ్వరరావు, ఉదయవర్లు, వినాయకరావు, ఐ.అర్జునరావు, ఫిలిం న్యూస్ ఆనందన్, పి.హరనాథ్; జగన్, జగన్మోహన్, డి.నారాయణవర్మ, మణిగోపాల్, ఎం.ఎల్.నరసింహం, ప్రమోద్‌కుమార్, బి.శ్రీనివాసరావు, ఐ.శశిమోహన్, వ్యాస్‌చంద్, వి.ఎస్.ఎన్.మూర్తి, వెలది రఘుకుమార్, బి.జయ, పాటిబండ్ల విజయలక్ష్మి, ఉమర్జీ కుమరన్, సి.వి.ఆర్. మాణిక్యేశ్వరి మొదలగువారు పలు పత్రికలకు సినిమాలకు సంబంధించిన వందలాది వ్యాసాలను అందిస్తున్నారు. కొందరు గ్రంథాలు వ్రాశారు.

✣ ✣ ✣

## ఈ పుష్కర (2001-2012) చరిత్ర

ఈ శతాబ్దపు తొలి పన్నెండు సంవత్సరాలు సినిమా చరిత్రపరంగా అనూహ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అంతకుముందు రెండు, మూడు కోట్లదాకా వుండే చిత్ర నిర్మాణవ్యయం ఎంతగానో పెరిగిపోయింది. లోబడ్జెట్ చిత్రమైతే మూడు నుంచి ఐదు కోట్ల వరకు, మధ్యతరగతికి చెందిన చిత్రం పది కోట్లు, అగ్రకథానాయకులతో చిత్రం తీయాలంటే ముప్పై నుంచి నలభైకోట్ల వరకు నిర్మాణ వ్యయం పెరిగింది. ఈ పన్నెండు సంవత్సరాల్లో దాదాపు 1500 చిత్రాలు విడుదలయ్యాయి. వీటిల్లో కేవలం పది శాతం అంటే 150 చిత్రాలు మాత్రమే ఘనవిజయం సాధించాయి. ఇంకా 350 చిత్రాలు పర్వాలేదనిపించాయి. మిగతా వెయ్యి చిత్రాలు నిర్మాతలకు చేదు అనుభవాన్ని మిగిల్చినవే.

ఎందరెందరో కొత్త నిర్మాతలు సినీరంగ ప్రవేశం చేయడం, అనుభవరాహిత్యంతో దర్శకుల, కథానాయకుల కోరికమేరకు భారీగా సెట్సు వేయడం, అవసరమున్నా లేకున్నా ఇతర దేశాల్లో షూటింగు జరపడం, ఒకటికి పదిరెట్లు ఫిల్మ్ నెగిటివ్ ఎక్స్‌పోజ్ చేయడం వలన కోట్లాదిరూపాయిలు బూడిదెలో పోసిన పన్నీరైపోతోంది.

ఈ మధ్యకాలంలో పబ్లిసిటీ పేరిట ఎలక్ట్రానిక్ మీడియా అంటే తెలుగులో ఉన్న పది, పదిహేను ఛానెళ్లల్లో విపరీతంగా పబ్లిసిటీ ఇవ్వడం, దాంతో చిత్రం పట్ల మోజు పెరగడం, ఆ సినిమాలు ప్రేక్షకుల అంచనాలను అందుకోవలేక పోవడంతో ఘోరపరాజయం పాలవడం జరుగుతున్న చరిత్ర.

గ్రాఫిక్స్ పేరుతో తెర మీద అద్భుతాలు సృష్టిస్తున్నారు. ఇది సాంకేతికంగా నిష్ణాతులైన వారికి ఉపాధి కల్పించడమే కాక, వారి మేధస్సుకు పదునుపెట్టే అంశం. దీనికి అమ్మోరు, అరుంధతి, మగధీర, ఈగ వంటి చిత్రాలను ఉదాహరణగా పేర్కొనవచ్చు. కేవలం గ్రాఫిక్స్ సినిమాను బ్రతికించలేవు అనటానికి ఉదాహరణగా శక్తి, బద్రీనాద్, అనగాగనగా ఒక ధీరుడు చిత్రాలను ఉదహరించవచ్చు. వీటిల్లో ప్రయత్నలోపం లేకపోయినా కథాకథనాలు ప్రేక్షకుల్ని ఆకర్షించలేకపోవటమే ప్రధానకారణం.

ఈ పన్నెండేళ్ల కాలంలో విడుదలై అటు ప్రభుత్వ పురస్కారాలతోపాటు, ఇటు ప్రేక్షకుల అభిమానాన్ని కూడా చూరగొన్న చిత్రాలలో కొన్ని: 'చిరునవ్వుతో, షో, ఐతే, స్వరాభిషేకం, బొమ్మలాట, కమ్లి, 1940లో ఒక గ్రామం, అజాద్, మనోహరం, ప్రేమించు, మురారి, అటు అమెరికా ఇటు ఇండియా, మన్మథుడు, నువ్వే నువ్వే, సంతోషం, మిస్సమ్మ, ఒక్కడు, అమ్మా నాన్న ఓ తమిళమ్మాయి, ఆ నలుగురు, ఆనంద్, గ్రహణం, మల్లీశ్వరి, పోతేపోనీ, అనుకోకుండా ఒకరోజు, బొమ్మరిల్లు, గోదావరి, శ్రీరామదాసు, గంగ, పోకిరి, హనుమంతు, మీ శ్రేయోభిలాషి, హ్యాపిడేస్, లక్ష్యం, చందమామ, ఆడువారి మాటలకు అర్థాలే వేరులే, కలిసుందాంరా, ఓనమాలు, దూకుడు, ఈరోజుల్లో, గబ్బర్‌సింగ్, కొత్త బంగారులోకం, గమ్యం, వినాయకుడు, వాసు, ఖడ్గం, నువ్వు నాకు నచ్చావు, సపరివార సమేతం, నీకు నేను నాకు నువ్వు, గౌతం ఎస్.ఎస్.సి, నువ్వొస్తానంటే నేనొద్దంటానా, పరుగు, అష్టాచమ్మా, రెడీ, మర్యాదరామన్న' మొదలైనవి.

కొత్తతరహాలో చిత్రాలను రూపొందించవచ్చని నిరూపించిన దర్శకులు పూరీ జగన్నాథ్, వి.వి.వినాయక్, శేఖర్ కమ్ముల, తేజ, వి.ఎన్.ఆదిత్య, నీలకంఠ, త్రివిక్రమ శ్రీనివాస్, దశరథ్, క్రిష్, ఈశ్వరరెడ్డి, రవిబాబు, వై.వి.ఎస్.చౌదరి, జయంత్ సి.పరాంజి, విజయభాస్కర్, ఎన్.శంకర్, గుణశేఖర్, ఇంద్రగంటి మోహనకృష్ణ, నందినిరెడ్డి, బోయపాటి శీను, శీను వైట్ల, ఏలేటి చంద్రశేఖర్, రవిబాబు, నీలకంఠ, దేవిప్రసాద్; వీరందరికంటే భిన్నంగా చిత్రచిత్రానికి మార్పులు తెస్తూ ప్రేక్షకుల అంచనాలను మించి కొత్తదారుల్లో చిత్రాలు తీసి విజయపథంలో దూసుకెళుతున్న దర్శకమౌళి ఎస్.ఎస్.రాజమౌళి.

హీరోలుగా జయరాం, రవితేజ, రాహుల్, అజయ్, దిలీప్, శివాజీ, సాయికిరణ్, గోపీచంద్, రామ్‌చరణ్‌తేజ, ఆకాష్, ఎన్.టి.ఆర్, నివాస్, అల్లరి నరేష్, ఆర్యన్ రాజేష్, విష్ణువర్ధన్‌బాబు, మనోజ్‌కుమార్, ప్రభాస్, కృష్ణుడు, మహేష్‌బాబు, రవిబాబు, సిద్ధు, రోహిత్, వల్లభ, కల్యాణ్‌రామ్, తారకరత్న, నితిన్, రాజా, సిద్దార్థ, అల్లు అర్జున్, నవదీప్, ఆర్.పి.పట్నాయక్, తరుణ్, ఆదిత్యా ఓం, విక్రమ్, గౌతమ్, సుమంత్, సుశాంత్, నాగచైతన్య, రాణా, వరుణ్‌సందేశ్, శశాంక్, సచిన్ వంటి ఎందరో రంగప్రవేశం చేసినా కాలపరీక్షకు నిలబడేది కొందరే.

ఇక కథానాయికుల ప్రసక్తికొస్తే ప్రతి అయిదు చిత్రాలకు ఒక కథానాయిక పరిచయమౌతుంది. వారు ఇతర భాషలకు చెందిన ఆర్టిస్టులు కొందరైతే అధిక శాతం బొంబాయి నుంచి వచ్చిన మోడల్స్ అక్కడ సినిమాల్లో చిన్నపాటి రోలు వేసి యిక్కడ హీరోయిన్ ఛాన్సులు అంది పుచ్చుకొన్నారు.

రీమాసేన్, సునీత, అభిరామి, కాంచీకౌల్, స్నేహ, అంజల జవేరి, రుతిక, సింధు, సోనాలిబింద్రే, కిరణ్ రాతోడ్, నీలాంబరి, సోనాలీ జోషి, సిమ్రాన్, ప్రీతి జింగానియా, మాళవిక, శృతి, తనూరాయ్, ప్రియాంక, ఆర్తి అగర్వాల్, గజాలా, శ్రియ, ఛార్మి, కావేరి, కీర్తి చావ్లా, సదా, జెన్నిఫర్, నమిత, గిరిజ, రాజశ్రీ, అనూష, శ్వేత, అగర్వాల్, సంపదా, రాధికావర్మ, రక్షిత, స్పందన, అన్షు, ఆసిన్, రేణుదేశాయ్, మాన్య, అదితి అగర్వాల్, నేహ మెహతా, డిసౌజా, ఆర్తి చాబ్రియా, సోనీ, మౌనిక, భాగ్యశ్రీ, దీపాలి, ప్రియాసింగ్, నమ్రతా శిరోద్కర్, బిపాసాబసు, రేఖ, సీమా, జాహ్నవి, హారిక, అమీషాపటేల్, గుర్లిన్ చోప్రా, మీరాజాస్మిన్, అతిధి అగర్వాల్, కమలినీ ముఖర్జీ, రీచాగంగోపాధ్యాయ, నిత్యామీనన్, తమన్నా, అభినయశ్రీ, నిఖిత, గౌరీముంజల్, దామిని, పార్వతి మెల్టన్, లక్ష్మీరాయ్, రాణి గాయత్రి, జ్యోతి ఇలా ఎందరెందరో వచ్చినా వారి ఉనికి తాత్కాలికమే అయినా లయ, భూమిక, స్నేహ, త్రిష, జ్యోతిక, అనుష్క, నయనతార వీరికి మంచి గుర్తింపు గల పాత్రలు లభించటం వాటిల్లో వారి టాలెంట్ నిరూపించుకోవటం చెప్పుకోదగ్గ విశేషం.

సంగీత దర్శకులుగా యం.యం.కీరవాణి, కోటి, వందేమాతరం శ్రీనివాస్, మాధవపెద్ది సురేష్, మణిశర్మ, ఆర్.పి.పట్నాయక్, చక్రి - తమ ప్రతిభను కొనసాగించగా, ఘంటాడి కృష్ణ, శివశంకర్, అనురాగ్, శ్రీ సునీల్‌వర్మ, సవ్యసాచి, శంభూప్రసాద్, అనూప్, కె.ఎం.రాధాకృష్ణన్ వంటి ప్రతిభావంతులు పరిచయమయ్యారు.

అలాగే గాయనీ గాయకులుగా రమణ, కల్పన, లెనిన్ చౌదరి, టీనా, ఉషా, శ్రేయోఘోషల్, కృష్ణంరాజు, మాతాంగి, ప్రియ, కౌసల్య, గోపికాపూర్ణిమ, సునీత, ఎస్.పి.చరణ్, కవితా కృష్ణమూర్తి, సోనునిగమ్, టిప్పు, యువన్ శంకర్ రాజా వంటి వారు వచ్చిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకొంటున్నారు.

ఈ దశకంలో వచ్చిన ప్రధానమైన మార్పు ఏమిటంటే సింగపూర్, అమెరికా వంటి దేశాల్లో ఆంధ్రదేశంతో సమాంతరంగా సినిమాలు విడుదల కావడంతో ఓవర్‌సీస్ బిజినెస్, శాట్‌లైట్ హక్కుల విక్రయం ఊపందుకోవడంతో నిర్మాత పరిస్థితి కొన్ని సందర్భాల్లో ఆశావహంగా వుంటుంది. వందలాది ప్రింట్లు తీసి వీలైనంత త్వరతగతిని సొమ్ము చేసుకోవాలనే ప్రయత్నం, తపన నిర్మాతల్లో కనిపిస్తుంది.

ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రభుత్వపరంగా ఎన్ని నిబంధనలు ఉన్నా, పైరసీ భూతం పరిశ్రమకు సవాలుగా నిలిచింది. సినిమా విడుదలైన మరునాడే పైరసీ సీడీలు మార్కెట్లో లభ్యం కావడంతో సినిమాల మనుగడ ప్రశ్నార్థకమౌతుంది. దీనికితోడు అధిక సంఖ్యలో థియేటర్లు కొందరి పెద్దల నియంత్రణలో ఉండటంతో చిన్న బడ్జెట్ సినిమాల నిర్మాతలు థియేటర్లు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. సినిమా థియేటర్ల నిర్వహణ వ్యాపారపరంగా లాభసాటి కాకపోవడంతో వాటిని పడగొట్టి షాపింగ్‌కాంప్లెక్సులుగా మారుస్తున్నారు. ఒకప్పుడు దక్షిణభారతదేశంలో పేరొందిన చెన్నైలోని జెమినీస్టూడియో షాపింగ్ కాంప్లెక్సుగా మారింది. ఇప్పుడు ఆ పంథాలో రాజధాని నగరంలోని కొన్ని స్టూడియోలు కాంప్లెక్సులుగా మారబోతున్నాయి.

పరిశ్రమను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం ఎన్నో రాయితీలు అందించినా, షూటింగ్ అనుమతి కోసం సింగిల్‌విండో పద్ధతి ప్రవేశపెట్టినా వాటి అమలులో నిర్మాతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఎన్నో.

ఈ దశకంలో దయనీయమైన పరిస్థితి ఏమిటంటే, చాలామంది నిర్మాతలకు తాము తీసే చిత్ర కథ గురించి తెలియదు. షూటింగ్ గూర్చి అవగాహన వుండదు. వారిని ఆర్టిస్టులు, డైరెక్టర్లు, డిక్టేట్ చేసిన సందర్భాలు ఎన్నో. ఈ పరిణామం ఎక్కడికి దారి తీస్తుందో వేచి చూడాల్సిందే !

✿ ✿ ✿

## సినీ పరిశ్రమలోని వివిధ సంఘాలు

ఈ రోజున తెలుగు సినీ పరిశ్రమకు సంబంధించి ట్రేడ్ యూనియన్ తరహా నియమ నిబంధనలతో రూపొందించిన పలు సంఘాలున్నాయి. అవి :-

ఎ.పి.ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్
సినీ రైటర్స్ అసోసియేషన్
సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్
సినిమాటోగ్రాఫర్స్ యూనియన్
సినీ ఆర్ట్ డైరెక్టర్స్ మరియు అసిస్టెంట్స్ యూనియన్
సినీ స్టిల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్
సినీ మేకప్ ఆర్టిస్ట్స్ & హెయిర్ డ్రెసర్స్ యూనియన్
సినీ & టి.వి. కాస్ట్యూమర్స్ యూనియన్
సినీ & టి.వి. అవుట్‌డోర్ యూనిట్ టెక్నీషియన్స్ యూనియన్
సినీ అవుట్‌డోర్ లైట్‌మెన్ యూనియన్
మోషన్ పిక్చర్స్ డ్రైవర్స్ యూనియన్
సినీ మ్యూజిషియన్స్ యూనియన్
సినీ ఆడియోగ్రాఫర్స్ యూనియన్
ఫిలిం ఎడిటర్స్ యూనియన్
మూవీ డబ్బింగ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్
సినీ స్టంట్ డైరెక్టర్స్ & స్టంట్ ఆర్టిస్ట్స్ యూనియన్
ఫిలిం డాన్సర్స్ అసోసియేషన్
సినీ స్టూడియో వర్కర్స్ యూనియన్
సినీ ఆర్టిస్ట్స్ యూనియన్
సినీ జూనియర్ ఆర్టిస్ట్స్ యూనియన్

సినీ జూనియర్ ఆర్టిస్ట్స్ ఏజంట్స్ యూనియన్

సినీ & టి.వి. ప్రొడక్షన్ అసిస్టెంట్స్ యూనియన్

సినీ మెస్ ఎంప్లాయిస్ యూనియన్

సినీ పబ్లిసిటి ఆర్టిస్ట్స్ యూనియన్

మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్

పైవి గాకుండా యింకా ఫిలిం ప్రొడ్యూసర్స్ గిల్డ్, ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉండనే ఉన్నాయి. అలాగే డిస్ట్రిబ్యూటర్‌లకు, ప్రదర్శకులకు సంబంధించి జిల్లా స్థాయిలోను, రాష్ట్రస్థాయిలోను యూనియన్లు ఉన్నాయి.

1931 నుంచి సుమారు 1975 వరకు చిత్రాలు విజయా, ఁ ార్ణ, నవయుగ వంటి పంపిణీ సంస్థల ద్వారా విడుదలయ్యేవి. వీటికి రాయలసీమ ప్రాంతంలోను, ఆంధ్ర ప్రాంతంలోను, తెలంగాణా ప్రాంతంలోను కార్యాలయా ు ఉండేవి. ఈ పంపిణీదారులు నిర్మాతలకు ముందుగా కొంత డబ్బు పెట్టుబడి పెట్టేవారు. దానిని తిరిగి సినిమా విడుదల సమయంలోను, విడుదలయ్యాక సర్దుబాటు చేసుకునేవారు. 1975 నుంచి జిల్లాలవారీగా చిత్రాలు అమ్ముకోవడంతో జిల్లాల వారి పంపిణీ సంస్థలు వెలిశాయి. వీటిల్లో వెయ్యికిపైగా చిత్రాలను విడుదలచేసి రికార్డు సాధించిన వారు ఏలూరులోని ఉషాపిక్చర్స్ అధినేత డా॥ వి.వి. బాలకృష్ణరావు.

ప్రభుత్వానికి, పరిశ్రమకి మధ్య మొదట్లో పర్సంటేజ్ పద్ధతిన సర్దుబాటు జరిగేవి. ప్రభుత్వం థియేటర్ల వసూళ్లపైన కొంతశాతం వినోద పన్ను రూపేణ వసూలు చేసేది. మిగతా సొమ్మును థియేటర్ అద్దెకు, నిర్మాతకు, పంపిణీదారుడు వాటాలుగా పంచుకునేవారు. తరువాత ప్రభుత్వం స్లాబ్‌సిస్టమ్ ప్రవేశపెట్టింది. ఈ స్లాబ్ సిస్టమ్ పరిశ్రమ మనుగడకు కేన్సర్ వ్యాధి వంటిదని గుమ్మడి వంటి పెద్దలు ఎలుగెత్తి చాటారు. చిన్న బడ్జెట్ చిత్రాల నిర్మాతల నుంచి కూడా ప్రతిఘటన ఎదురైంది. ఈ పరిణామాలు దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం స్లాబ్ సిస్టమ్ రద్దు చేసి గతంలో ఉన్న పర్సంటేజ్ సిస్టమ్‌ను పునరుద్ధరించే దిశగా చర్యలు తీసుకుంది.

## ఎవార్డులు - పురస్కారాలు

సినిమా పరిశ్రమను ప్రోత్సహించే దిశగా 1954వ సంవత్సరంలో రూపొందించిన చిత్రాల్లో ఉత్తమమైన వాటికి స్వర్ణకమలం, రజిత కమలం, ప్రశంసాపత్రం, యోగ్యతాపత్రం అందించే ప్రక్రియను కేంద్రప్రభుత్వం చేపట్టింది. ఆ దిశగా 1954లో తెలుగులో నిర్మించబడ్డ 'పెద్దమనుషులు' (రజితపతకం), 'విప్రనారాయణ, తోడిదొంగలు' (యోగ్యతాపత్రం) చిత్రాలు పురస్కారాలను అందుకున్నాయి. నాటి నుంచి నేటి దాకా ఆ పురస్కారాలు తెలుగు చిత్రాలకు లభిస్తూనే వున్నాయి. గాయనిగా సుశీల, వాణిజయరామ్, జేసుదాసు; సంగీత దర్శకునిగా రమేష్‌నాయుడు, కె.వి.మహదేవన్; ఉత్తమ గీతరచయితలుగా శ్రీశ్రీ, వేటూరి, సుద్దాల అశోక్‌తేజా; నటునిగా పి.ఎల్.నారాయణ - కేంద్ర ప్రభుత్వం నుంచి పురస్కారాలు అందుకున్నారు. చలనచిత్ర రంగానికి విశిష్ట సేవలందించిన వారికి కేంద్ర ప్రభుత్వం దాదాఫాల్కే పురస్కారాన్ని అందజేస్తుంది. ఆ పురస్కారాన్ని అందుకున్న తెలుగు ప్రముఖులు - బి.ఎన్.రెడ్డి, ఎల్.వి.ప్రసాద్, బి.నాగిరెడ్డి, అక్కినేని నాగేశ్వరరావు, డి.రామానాయుడు.

కేంద్ర ప్రభుత్వం ఒరవడిలోనే ఉత్తమ చిత్రాలను ప్రోత్సహించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నంది అవార్డులను ప్రవేశపెట్టింది. 1964లో నిర్మించిన చిత్రాలకు 1965లో పురస్కారాలు అందజేసింది. 1964లో విడుదలైన డాక్టర్ చక్రవర్తి (బంగారునంది), కీలుబొమ్మలు (రజితనంది), గుడిగంటలు (కాంస్యనంది) అందుకున్నాయి. ఆయా చిత్రాలకు నగదు బహుమతిని కూడా అందజేసింది. కాలక్రమేణా ఈ నంది పురస్కారాలు చిత్ర నిర్మాణంలోని పలు శాఖలకు, అంశాలకు విస్తరింపజేసింది. ఈ రోజున దిగువ పేర్కొన్న దాదాపు 50 అంశాలలో నంది పురస్కారాలను అందజేస్తున్నది.

ఉత్తమ చిత్రం, ద్వితీయ ఉత్తమచిత్రం, తృతీయ ఉత్తమచిత్రం, అక్కినేని నాగేశ్వరరావు, రాష్ట్రప్రభుత్వం సంయుక్తంగా అందజేసే ఉత్తమ కుటుంబ కథాచిత్రం, ప్రేక్షకాదరణ పొందిన పూర్తి వినోదాత్మక చిత్రం, జాతీయ సమైక్యతా అంశంపై నిర్మించబడ్డ కథాచిత్రం, ఉత్తమ బాలల చిత్రం, ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రం, ఉత్తమ విద్యావిషయిక చిత్రం, ఉత్తమ కథారచయిత, ఉత్తమ దర్శకుడు,

నటి, నటుడు, సహాయనటుడు, సహాయనటి, క్యారెక్టర్ నటుడు, హాస్యనటుడు, విలన్, బాలనటుడు, బాలనటి, దర్శకుడి తొలి ఉత్తమ చిత్రం, ఉత్తమ స్క్రీన్‌ప్లే, సంభాషణల రచయిత, గీత రచయిత, ఛాయాగ్రాహకుడు, సంగీత దర్శకుడు, గాయకుడు, గాయని, ఎడిటర్, కళా దర్శకుడు, నృత్య దర్శకుడు, శబ్దగ్రాహకుడు, ఆహార్యం, రూపశిల్పి, డబ్బింగ్ కళాకారుడు, డబ్బింగ్ కళాకారిణి, ఫైట్ మాస్టర్, స్పెషల్ ఎఫెక్ట్స్, సినీ విమర్శకుడు, సినిమా చరిత్రపై ఉత్తమ గ్రంథం - ఇవి గాక అవసరాన్ని, సందర్భాన్ని బట్టి అందించే మూడు, నాలుగు జ్యూరీ ప్రత్యేక అవార్డులు.

తొలి తెలుగు మూకీ చిత్ర నిర్మాత రఘుపతి వెంకయ్య గౌరవార్థం ఆయన పేరిట రఘుపతివెంకయ్య అవార్డును 1980లో ప్రవేశపెట్టి తొలిసారిగా ఎల్.వి.ప్రసాద్‌కు అందజేసింది. తెలుగు చలనచిత్ర సీమకు విశిష్ట సేవలందించిన ఎన్.టి.రామారావు పేరిట జాతీయస్థాయిలో పురస్కారాన్ని 1996లో ప్రవేశపెట్టింది. దానిని తొలిసారిగా అందుకున్నవారు అక్కినేని నాగేశ్వరరావు. ఉత్తమ దర్శకుడు బి.ఎన్.రెడ్డి పేరిట మరో పురస్కారాన్ని 2008లో ప్రవేశపెట్టింది. దానిని అందుకున్న తొలి వ్యక్తి అనుపమ చిత్రాల నిర్మాత, దర్శకుడు కె.బి.తిలక్.

తెలుగు చలనచిత్ర రంగానికి నిర్మాతలుగా విశిష్ట సేవలందించిన విజయా అధినేతలు - నాగిరెడ్డి, చక్రపాణి పేరిట ఒక పురస్కారాన్ని 2008లో ప్రారంభించి, దానిని తొలిసారిగా ప్రసాద్ ల్యాబ్ అధినేత ఎ.రమేష్‌ప్రసాద్‌కు అందజేశారు. అధిక సంఖ్యలో చిత్రాలు తీసిన మహిళా నిర్మాతగా శ్రీమతి ఎన్.ఆర్.అనురాధాదేవి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదయ్యారు.

ఈ పురస్కారాల విషయంలో అక్కినేనిదే అగ్రస్థానం. ప్రజలనుంచి నటసమ్రాట్, నవలానాయకుడు, ఎవర్‌గ్రీన్ హీరో బిరుదులు, రాష్ట్ర ప్రభుత్వం నుండి రఘుపతి వెంకయ్య, ఎన్.టి.ఆర్ జాతీయ పురస్కారాలు అందుకున్నారు. తమిళనాడు ప్రభుత్వం అన్నా అవార్డును, మధ్యప్రదేశ్ ప్రభుత్వం కాళిదాసు కౌస్తుభ అవార్డును, కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, దాదాఫాల్కే పురస్కారాలను అందజేశాయి. ఇదొక రికార్డ్.

✣ ✣ ✣

## తెలుగు సినీ చరిత్రలో మైలురాళ్లుగా చెప్పుకోతగ్గ అంశాలు


| | | |
|---|---|---|
| తొలి మూకీచిత్రం | - | భీష్మ ప్రతిజ్ఞ (1921) |
| టాకీ చిత్రం (పౌరాణికం) | - | భక్త ప్రహ్లాద (1931) |
| చారిత్రక చిత్రం | - | రామదాసు (1933) |
| బాలల చిత్రం | - | భక్త ధృవ అనసూయ (1935) |
| సాంఘిక చిత్రం | - | ప్రేమ విజయం (1936) |
| జానపద చిత్రం | - | కనకతార (1937) |
| నవలా చిత్రం | - | బారిస్టర్ పార్వతీశం (1940) |
| ద్విపాత్రాభినయనం | - | ఇద్దరు మిత్రులు (1961) |
| గేవా కలర్ చిత్రం | - | లవకుశ (1963) |
| ఈస్ట్‌మన్ కలర్ చిత్రం | - | అమరశిల్పి జక్కన్న (1964) |
| జేమ్స్‌బాండ్ చిత్రం | - | గూఢచారి 116 (1966) |
| కౌబాయ్ చిత్రం | - | మోసగాళ్లకు మోసగాడు |
| సినిమా స్కోప్ బ్లాక్ & వైట్ | - | దేవతలారా దీవించండి |
| సినిమా స్కోప్ కలర్ | - | అల్లూరు సీతారామరాజు (1974) |
| తొలి 70 ఎమ్.ఎమ్ చిత్రం | - | సింహాసనం (1985) |
| తొలి అనువాద చిత్రం | - | ఆహుతి (1950) (నీరా ఔర్ నందా-హిందీ) |

తమిళంలోకి అనువదించబడ్డ చిత్రం - కీలుగుర్రం (1949 -మాయాకుదిరై)

| | | |
|---|---|---|
| సినిమాహాలు | - | మారుతిటాకీస్ (విజయవాడ) |
| చిత్ర పంపిణీదారుడు | - | పూర్ణ మంగరాజు |
| సినిమా పత్రిక | - | చిత్రకళ (పసుమర్తి యజ్ఞనారాయణ) |
| నేపథ్యగాయకుడు | - | సాబు (వందేమాతరం - 1939) |
| నేపథ్యగాయని | - | కాకినాడ రాజారత్నం (భక్తపోతన 1942) |

❖ ❖ ❖

# రచయిత పరిచయం



పేరు : ఎస్.వి.రామారావు

స్వస్థలం : ఏలూరు

బి.ఏ పట్టా పొందాక రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖలో ప్రవేశించి సబ్‌రిజిస్ట్రార్‌గా పదవీ విరమణ చేశారు. చిన్నప్పటి నుంచి నాటకాలు, సినిమాలు అంటే ఎంతో ఇష్టం. 20 నాటికా, నాటకాలు వ్రాసి నటుడిగా శతాధిక రంగస్థల ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

సినిమాలంటే ఎంతో అభిమానం. ఫిల్మ్ జర్నలిస్టుగా వందలకొద్ది వ్యాసాలు పలు పత్రికలకు, సావనీర్లకు అందించారు. తెలుగు సినిమా చరిత్రను భావితరాలకు అందించే ప్రయత్నంలో సినీరంగానికి చెందిన పలు అంశాలను గురించి ఓ డజను గ్రంథాలు వ్రాశారు. వాటిల్లో రెండిటికి (తెలుగుతెర, నాటి 101 చిత్రాలు) రాష్ట్ర ప్రభుత్వ నంది పురస్కారం లభించింది. సినీరంగ ప్రముఖులు గుమ్మడి వెంకటేశ్వరరావు, జమున, నిర్మాతలు డి.వి.ఎస్.రాజు, తమ్మారెడ్డి కృష్ణమూర్తి, కళా దర్శకులు కళాధర్; వీరి జీవితచరిత్రలు గ్రంథాలుగా రావడానికి రచనా సహకారం అందించారు. వీరి సంపాదకత్వంలో రూపొందిన గ్రంథం 'అక్షరాంజలి'.

ఒక అరడజను చిత్రాలకు రచన చేశారు. సినిమా ఆధారితమైన పలు కార్యక్రమాలను టీవీరంగానికి (దూరదర్శన్, శ్రీ వేంకటేశ్వరభక్తి ఛానల్, వనిత, తెలుగువన్.కమ్) అందించారు.

పద్మభూషణ్ డా॥ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, ఎమ్.బి.ఎస్.ప్రసాద్‌గారు ప్రారంభించిన రాష్ట్రంలోని హాసం క్లబ్స్‌కు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. వందలకొద్ది సినీసంగీత కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. డాక్టర్ సి.నారాయణరెడ్డి వీరిని 'సినీవిజ్ఞాన విశారద' బిరుదుతో సత్కరించారు.

Blank Page

Blank Page

## ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు

- తెలుగు జాతి భాషా సంస్కృతులపై నేటి యువతరానికి ఆసక్తి కలిగించేలా ప్రణాళికలు తయారు చేయడం.
- ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక వేదికపై చేర్చి భాషాసంస్కృతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం.
- తెలుగుభాష ప్రపంచ భాషలతో సరితూగేలా అంతర్జాలంలో ఉపయోగించడానికి చర్యల లు చేపట్టడం.
- తెలుగు పాలన, బోధన, ప్రసార మాధ్యమ భాషగా వినియోగించేందుకు చర్యలు తీసుకోవడం.
- తెలుగువారి జానపద, సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలకు, ప్రచారానికి ప్రణాళిక రూపొందించడం.
- తెలుగు జాతి ప్రాచీనతలను, ప్రశస్తిని వెలుగులోకి తేవడం.
- తెలుగు జాతి చరిత్రపై, భాషపై గ్రంథాలు ప్రచురించి కొత్త పారిభాషిక పదాలు తయారుచేయడం.
- తెలుగు భాషను అభ్యసించే వారికి సరళమైన శైలిలో పాఠ్యగ్రంథాలు, బోధనోపకరణాలు తయారు చేసే ప్రణాళిక రూపొందించడం.
- తెలుగు నేలపై గల చారిత్రక, ఆధ్యాత్మిక స్థలాలకు, పర్యాటక కేంద్రాలకు ప్రాచుర్యం కల్పించడం.

**తెలుగు భాష వికాసం** **తెలుగు సంస్కృతి ప్రకాశం**

**దేశ భాషలందు తెలుగు లెస్స**